బుధవారం
3•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 207
• పేజీలు : 16 + (20/16) + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

తెలంగాణను చూసి నేర్చుకోండి

- ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు 'రాజస్థాన్ పత్రిక' హితవు
- వ్యవసాయానికి నిరంతర విద్యుత్‌పై ప్రశంసల జల్లు

రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి గురించి రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు గంభీరమైన మాటలు మాట్లాడుతుంటాయి. ఆచరణకు వచ్చేసరికి హామీలను మరిచిపోతుంటాయి. కానీ, తెలంగాణ ప్రభుత్వం అన్నదాతలకు కొత్త సంవత్సర కానుకను అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా వ్యవసాయరంగానికి 24గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్‌ను అందిస్తూ దేశంలోనే తొలిరాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. తెలంగాణ ప్రభుత్వాన్ని చూసి ఇతర రాష్ట్రాలు నేర్చుకోవాలంటూ రాజస్థాన్ పత్రిక మంగళవారం రాసిన సంపాదకీయం ఇదీ..

రైతుల స్థితిగతుల్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు. కొత్త సంవత్సరపు తొలిరోజున రైతులకు తెలంగాణ ప్రభుత్వం అపురూప కానుకనందించింది. వ్యవసాయరంగానికి 24గంటల నిరంతర విద్యుత్‌ను ప్రారంభించి, దేశంలోనే ఆ ఘనత సాధించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గత కొన్నేండ్లుగా వివిధ కారణాలతో దేశంలో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. ఓసారి వరదలు ముంచెత్తితే, మరోసారి కరువు తాండవిస్తుంది. వాతావరణ ప్రతికూలత కారణంగా నష్టపోతున్న రైతులకు చివరకు కన్నీరే మిగులుతూ వస్తున్నది. సాగు ఖర్చులు కూడా చేతికిరాక అప్పులపాలవుతున్న స్థితిలో.. పలు రాష్ట్రాల్లో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచీ దేశంలోని ప్రతీ రాజకీయ పార్టీ, ప్రతీ ప్రభుత్వం రైతుల అభివృద్ధి గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ వచ్చాయి. వాస్తవానికి ఒరిగిందేమీ లేదు. ఇదంతా ఓట్ల రాజకీయాలతో ముడిపడిన వ్యవహారంగా మారిపోయింది. నిజానికి రాజకీయనాయ కులకు రైతులు గుర్తొచ్చేది ఎన్నికల సమయంలోనే. ఇలాంటి నిరాశాజనక వాతావరణంలో.. రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని స్వాగతించాల్సిందే. ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా తెలంగాణను చూసి నేర్చుకోవాలి. రైతు సంక్షేమం గురించి ఆలోచించాలి. రాజకీయ పార్టీలన్నీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులకు

మిగతా 2వ పేజీలో


पत्रिकायन
राजस्थान पत्रिका . मंगलवार 02.01.2018 rajasthanpatrika
राजस्थान पत्रिका
संस्थापक
कर्पूर चन्द्र कुलिश
सम्पादकीय
तेलंगाना से सबक लें!
हर राजनीतिक दल और सरकारें किसानों के उत्थान की बातें तो बड़ी-बड़ी करते हैं लेकिन हकीकत में होता नजर कुछ आता नहीं।

'రాజస్థాన్ పత్రిక' సంపాదకీయం పేజీ

కీలక స్థానాల్లో సమర్థులైన ఐఏఎస్‌లు

భారీగా బదిలీలు

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా.. ప్రభుత్వ ప్రాథమ్యాలు, అధికారుల పనితీరు మేరకు

ముగ్గురు స్పెషల్ సీఎస్‌లకు మరింత ముఖ్యమైన బాధ్యతలు

భూరికార్డుల ప్రక్షాళనను సక్సెస్ చేసిన వాకాటి కరుణకు సీసీఎల్‌ఏ డైరెక్టర్ పదవి

నవీన్‌మిట్టల్‌కు కాలేజీ విద్య, సాంకేతిక విద్య కమిషనర్‌గా పోస్టింగ్

సబ్ కలెక్టర్లుగా నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో భారీస్థాయిలో ఐఏఎస్ అధికారుల బదిలీ జరిగింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల (స్పెషల్ సీఎస్‌లు) నుంచి కలెక్టర్ల వరకు 31 మందిని ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిలో కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రానికి కొత్తగా కేటాయించిన నలుగురు ఐఏఎస్ అధికారులకు సబ్‌కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు మొత్తం 35 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ, పోస్టింగ్‌లు, అదనపు బాధ్యతల అప్పగింతలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ఇంత పెద్ద ఎత్తున బదిలీలు జరుగడం ఇదే మొదటిసారి. బదిలీలపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముద్ర స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా, ప్రభుత్వ ప్రాథమ్యాలు, అధికారుల పనితీరు ఆధారంగానే బదిలీలు జరిగాయని తెలుస్తున్నది. ఈ విషయమై సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా కసరత్తు చేసి బదిలీలు, నియామకాలకు ఆమోదం తెలిపారని సమాచారం. కీలకమైన స్థానాల్లో సమర్థులైన అధికారుల నియామకం జరిగిందని ఉన్నతాధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ బదిలీల్లో భాగంగా ముగ్గురు స్పెషల్ సీఎస్‌లకు మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్న శాంతికుమారికి సీఎంవోతోపాటు వైద్య ఆరోగ్యశాఖ,కుటుంబ సంక్షేమశాఖను కూడా అప్పజెప్పారు. భూమి రికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తిచేసిన ప్రాజెక్టు మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణను సీసీఎల్‌ఏ డైరెక్టర్‌గా నియమించారు. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా కూడా పూర్తి అదనపు బాధ్యతలతో కొనసాగాలని ఆమెను ఆదేశించారు. ఇప్పటివరకు పురపాలకశాఖ కార్యదర్శిగా సమాచార, ప్రజాసంబంధాలశాఖ(ఐఅండ్‌పీఆర్) కమిషనర్‌గా ఉన్న నవీన్ మిట్టల్‌కు కాలేజీవిద్య, సాంకేతిక విద్య కమిషనర్‌గా

మిగతా 11వ పేజీలో


సురేశ్ చందా (స్పెషల్ సీఎస్)
ప్రస్తుత స్థానం: పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ
బదిలీ స్థానం: తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ


బీఆర్ మీనా (స్పెషల్ సీఎస్)
ప్రస్తుత స్థానం: రెవెన్యూ శాఖ
బదిలీ స్థానం: ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యదర్శి


రాజేశ్వర్ తివారి (స్పెషల్ సీఎస్)
ప్రస్తుత స్థానం: వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ
బదిలీ స్థానం: రెవెన్యూశాఖ


ఏ శాంతికుమారి (ముఖ్యకార్యదర్శి)
సీఎంవోతోపాటు అదనంగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ


అరవింద్‌కుమార్ (ముఖ్యకార్యదర్శి)
ప్రస్తుత స్థానం: ఢిల్లీ తెలంగాణ భవన్ ఆర్సీ
బదిలీ స్థానం: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, ఐఅండ్ పీఆర్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు


మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి తనను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు

చైర్మన్‌గా ఎర్రోళ్ల

శ్రీనివాస్ నియామక ఫైలుపై సంతకం చేసిన సీఎం కేసీఆర్

ఉద్యమకారుడికి లభించిన గుర్తింపు

ఐదుగురు సభ్యుల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ చైర్మన్‌గా సిద్దిపేట జిల్లాకు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను నియమించింది. కమిషన్ చైర్మన్, ఇతర సభ్యుల నియామకానికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం సంతకం చేశారు. కమిషన్ సభ్యులుగా సూర్యాపేట జిల్లాకు చెందిన బోయిళ్ల విద్యాసాగర్, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కుర్సం నీలాదేవి, హైదరాబాద్‌కు చెందిన

మిగతా 2వ పేజీలో



స్వచ్ఛభారత్‌లో

సలాం హైదరాబాద్

- నగర కీర్తికిరీటంలో ఓడీఎఫ్ తురాయి
- బహిరంగ మలవిసర్జనరహిత నగరంగా ప్రకటించిన స్వచ్ఛభారత్ మిషన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ నగర కీర్తికిరీటంలో మరో కలికితురాయి వచ్చిచేరింది. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛభారత్ మిషన్ మంగళవారం హైదరాబాద్ నగరాన్ని బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) నగరంగా ప్రకటించింది. ఈ హోదా ఆరునెలలపాటు ఉంటుంది. ఆ తరువాత కూడా ఈ హోదాను నిలబెట్టుకోవాలంటే మళ్లీ కేంద్ర స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పునరుద్ధరించాల్సి ఉంటుంది. గతంలో ముంబై, వైజాగ్‌లకు ఈ హోదా దక్కిందని అధికారులు తెలిపారు. నగరాన్ని ఓడీఎఫ్ నగరంగా ప్రకటించే క్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్‌కు చెందిన నాణ్యతా పరీక్షల విభాగం ఇటీవల బహిరంగ మలవిసర్జన (ఓడీఎఫ్)పై నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో సభ్యులు పర్యటించి బహిరంగ

మిగతా 12వ పేజీలో



గిరిజన కుంభమేళా మేడారం జాతర

- జాతీయ పండుగగా గుర్తించాలి
- కేంద్ర మంత్రి జ్యువల్ ఓరంను కోరిన రాష్ట్ర మంత్రి అల్లోల్ల, పలువురు ఎంపీలు
- ఈ ఏడాది కోటి మంది భక్తులు వస్తారని అంచనా

3

మంగళ వారం ఢిల్లీలో కేంద్ర మంత్రి జ్యువల్ ఓరంను కలిసి వినతిపత్రం అందజేస్తున్న దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు జీ నగేశ్, సీతారాంనాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

గజల్ శ్రీనివాస్ గలీజ్!

ఉద్యోగిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టు

నగ్నంగా నిలబడి నాట్యాలు.. మసాజ్ చేయాలంటూ ఒత్తిడి

త్వరలో గవర్నర్ కాబోతున్నానంటూ గప్పాలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగమిప్పిస్తానని ఊరింపు

లొంగకపోతే ఎక్కడా ఉద్యోగం రానివ్వనని బెదిరింపులు


లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ గాయకుడు శ్రీనివాస్‌ను నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం రిమాండుకు తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్‌సిటీబ్యూరో/ఖైరతాబాద్, నమస్తేతెలంగాణ:

గజల్‌ను ఇంటిపేరుగా మార్చుకున్నా.. రికార్డుల మోతతో సెలబ్రిటీగా ఎదిగినా గలీజు బుద్ధి కారణంగా కటకటాలు లెక్కించక తప్పలేదు. చెప్పేది ఆలయ పరిరక్షణం.. చేసేది మహిళలను లైంగికంగా వేధించడం.. నచ్చినట్టు నడుచుకుంటే పైకి తెస్తా.. కాదంటే అధఃపాతాళానికి తోస్తానంటూ నయానాభయానా లొంగదీసుకునేందుకు చిల్లర వేషాలు.. చివరికి ఓ బాధితురాలు సాహసించి దృశ్య, శ్రవణ సాక్ష్యాలను సేకరించింది. పోలీసులకు ఫిర్యాదు చేసి అతడి ఆట కట్టించింది. ఫలితంగా గజల్ శ్రీనివాస్ తాను పరివర్తన గీతాలను ఆలపించిన చంచల్‌గూడ జైలులోనే సాధారణ ఖైదీగా అడుగుపెట్టాడు. ఈ కేసులో పోలీసులు స్పందించిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తిగా చలామణి అవుతూ ఆధ్యాత్మిక ముసుగు కూడా వేసుకున్న సెలబ్రిటీ శ్రీనివాస్ అసలు స్వరూపం ఇదా? అని సర్వత్రా దిగ్భ్రాంతి వ్యక్తమవుతున్నది.

ఆలయవాణిలో అపవిత్రకార్యాలు

మహిళలను లైంగిక వేధింపులకు గురిచేసిన కేసులో గజల్ శ్రీనివాస్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆలయ పరిరక్షకుడిగా ప్రచారం చేసుకునే శ్రీనివాస్ లీలలను ఓ బాధితురాలు కెమెరాలో బంధించడంతో గుట్టు రట్టయింది. ఆలయవాణి రేడియోను నడుపుతూ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న గజల్ శ్రీనివాస్‌పై గత నెల 29వ తేదీన బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు మంగళవారం అతనిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవీందర్

మిగతా 11వ పేజీలో

స్థాయీ సంఘానికి ఎన్‌ఎంసీ బిల్లు

సమ్మె విరమించిన వైద్యులు

5

సూక్ష్మ, చిన్నతరహా

పరిశ్రమలకు శుభవార్త

- ఎన్బీఎఫ్‌సీ ఏర్పాటుకు ఆర్బీఐ ఆమోదం
- ఈ నెలాఖరు నుంచి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు మొదలు
- ఫలించిన మంత్రి కేటీఆర్ కృషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ (టీఐహెచ్‌సీ) ఏర్పాటులో కీలకమైన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్బీఎఫ్‌సీ) ఏర్పాటుకు భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర టీఐహెచ్‌సీ అధికారులకు ఆర్బీఐ అధికారికంగా సమాచారం అందించింది. దీంతో జనవరి చివరినుంచి గానీ.. ఫిబ్రవరి మొదటివారం నుంచి గానీ టీఐహెచ్‌సీ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనున్నది. ఖాయిలా పరిశ్రమలు, మూతపడే దశలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ఆలోచనలకు అనుగుణంగా దీనికి శ్రీకారం చుట్టారు. కొత్త కంపెనీలు, పరిశ్రమలను

మిగతా 12వ పేజీలో

మహారాష్ట్రలో భీమా కోరేగావ్ యుద్ధం!

- ద్విశతవార్షికోత్సవాల నిర్వహణపై ఘర్షణలు
- పుణెలో ఒకరి మృతి.. ఆస్తుల ధ్వంసం
- రైల్, రాస్తారోకోలతో స్తంభించిన ముంబై, ఠాణే
- న్యాయవిచారణకు ఆదేశించిన సీఎం ఫడ్నవీస్
- నేడు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన ప్రకాశ్ అంబేద్కర్

భీమా కోరెగావ్ యుద్ధం ద్విశత వార్షికోత్సవాల నిర్వహణపై దళితులు, కొన్ని మితవాద సంస్థల మధ్య మొదలైన ఘర్షణ హింసాత్మకంగా మారింది. పుణెకు సమీపంలోని కోరేగావ్ గ్రామంలో దళితులపై దాడికి నిరసనగా మంగళవారం మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. పుణెతోపాటు ముంబై, సోలాపూర్, ఠాణే నగరాల్లో ఆందోళనకారులు రైలు, రాస్తారోకోలు నిర్వహించారు. దుకాణాలు మూయించి, ఆస్తుల ధ్వంసానికి పాల్పడ్డారు. సోమవారం కోరేగావ్‌లో జరిగిన హింసలో ఒకరు మరణించగా, ఆందోళనకారులు పలు ఇండ్లు, వాహనాలను ధ్వంసం చేశారు. ఈ హింసపై మహారాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. దళితులపై హింసను అరికట్టడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ భరీపా బహుజన్ మహాసంఘ్ నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ బుధవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు.

వివరాలు 5వ పేజీలో


ముంబైలో అల్లర్లను అదుపుచేస్తున్న పోలీసులు



మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌నాయక్, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, వేముల వీరేశం, గాదరి కిశోర్, భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ పూల రవీందర్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, టీఆర్‌ఎస్ నాయకులు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల నర్సింహయ్య, కాసోజు శంకరమ్మ, ఉమామాధవరెడ్డి, తదితరులు కూడా ఉన్నారు.



ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తిరుపతి ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, దాసరి మనోహర్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా,

సీఎం కేసీఆర్‌కు మంత్రుల శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును పలువురు మంత్రులు మంగళవారం ప్రగతిభవన్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం కేసీఆర్‌ను కలిసినవారిలో మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, చందూలాల్, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, విప్ గొంగిడి సునీతతోపాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సీఎం కేసీఆర్ అభినందనలు

కేంద్ర అవార్డులు అందుకున్న వలంటీర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విభాగంలో కేంద్ర అవార్డులు అందుకున్న తెలంగాణ వలంటీర్లను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రగతిభవన్‌లో అభినందించారు. 2016-17 సంవత్సరానికి కేంద్ర క్రీడలు, యువజన సర్వీసులశాఖ అందించిన ఎన్‌ఎస్‌ఎస్ అవార్డులో రాష్ట్రం నాలుగు పురస్కారాలను సాధించింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఉత్తమ యూనిట్ అవార్డు, అనురాగ్ గ్రూప్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సీ మల్లేశ్‌కు ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి చెందిన తగరపు నవీన్, జేఎన్టీయూహెచ్‌కు చెందిన పటుకూరి లలిత్ ఆదిత్యలకు ఉత్తమ వలంటీర్ల అవార్డులు దక్కాయి. పురస్కారాలు గత నెలలో గ్రహీతలు అందుకున్నారు. వారిని మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ లైజనింగ్ ఆఫీసర్ ఎంఎస్‌ఎన్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.51 గంటలకు



సూర్యాస్తమయం: 5.51 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, పాడ్యమి తె. 4.10 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: పునర్వసు ఉదయం 8.50 వరకు తదుపరి పుష్యమి, అమృత ఘడియలు: ఉదయం 6.43 నుంచి 8.19 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.21 నుంచి 1.43 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.59 నుంచి మధ్యాహ్నం 12.43 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.56 నుంచి సాయంత్రం 5.32 వరకు.

లోకం పోకడ



ఎవరు ఎవరికి సంబంధించినోళ్లో వెదికి పెట్టడం మా వల్ల కాదమ్మా.. మీరే వెతుక్కోండి!!

విద్యుత్ ఉద్యోగుల సంబురాలు

- విద్యుత్ సౌధలో పండుగ వాతావరణం
- ఇంక్రిమెంట్‌తో ఉద్యోగుల్లో నూతనోత్సాహం
- అంతా సమన్వయంతో పనిచేయాలని సీఎండీ ప్రభాకర్‌రావు పిలుపు



మంగళవారం హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు అభినందనలు తెలుపుతున్న విద్యుత్ సంస్థల ఉద్యోగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని విద్యుత్ సంస్థల ప్రధాన కార్యాలయం విద్యుత్ సౌధలో మంగళవారం పండుగ వాతావరణం నెలకొన్నది. వ్యవసాయంతోపాటు అన్నిరంగాలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా మొదలైన శుభ సందర్భంగా విద్యుత్ సంస్థల ఉద్యోగులు పెద్దసంఖ్యలో కార్యాలయానికి చేరుకొని పరస్పరం అభినందించుకొన్నారు. స్వీట్లు పంచుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు అభినందనలు తెలిపారు. కొత్త సంవత్సరంలో మొదటి పనిదినం కావడం, 24 గంటల విద్యుత్ సరఫరా మొదలవడం, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ఇంక్రిమెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు జగత్‌రెడ్డి, నర్సింగ్‌రావు, లలిత్‌కుమార్, వెంకట్రాజం, సూర్యప్రకాశ్, ట్రాన్స్‌కో జీఎం విజయ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, వివిధ యూనియన్ల నాయకులు సీఎండీ ప్రభాకర్‌రావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 24 గంటల నిరంతర కరంటు సరఫరా వల్ల తెలంగాణ విద్యుత్ సంస్థల ప్రతిష్ఠ ఎంతో పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహం, మార్గదర్శనం వల్లే ఈ ఘనత సాధించామన్నారు. 24 గంటల కరంట్ ఇవ్వడం ప్రారంభించడంతోనే విజయం సాధించినట్టు కాదని, దానిని విజయవంతంగా కొనసాగించడం పెద్దసవాల్ అని ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం

జెన్‌కో, ట్రాన్స్‌కో డైరెక్టర్లు, సీనియర్ ఉద్యోగులతో సీఎండీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ఇతర డైరెక్టర్లతో కూడా మాట్లాడారు. వ్యవసాయానికి 24గంటల సరఫరా ప్రారంభించిన తర్వాత ఏర్పడిన పరిస్థితిని సమీక్షించారు. ఏ రోజుకారోజు డిమాండ్‌ను అంచనా వేసుకుంటూ, విద్యుత్‌ను సమకూర్చుకోవాలని ప్రభాకర్‌రావు చెప్పారు. ఎక్కడ ఏ చిన్న అంతరాయం వచ్చినా అంతా సమన్వయంతో వ్యవహరించి పరిష్కరించాలన్నారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ విద్య పటిష్ఠతే లక్ష్యం

- వేసవి సెలవుల్లో ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్
- బోధకులు స్వచ్ఛందంగా ముందుకురావాలి
- లెక్చరర్లు ఉద్యోగంతోపాటు సామాజిక బాధ్యతనూ మరువొద్దు
- ఇంటర్‌విద్య కోసం గత మూడేండ్లలో రూ.350 కోట్లు ఖర్చుచేశాం
- 'ప్రగతిపథంలో ఇంటర్‌విద్య' సదస్సులో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో 'ప్రగతిపథంలో ఇంటర్‌విద్య' సదస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చెప్పారు. అందరూ కృషిచేసి, దేశంలోనే తెలంగాణ ఇంటర్‌బోర్డును ప్రథమస్థానంలో నిలుపాలని పిలుపునిచ్చారు. ఇంటర్‌విద్య జేఏసీ చైర్మన్ పీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన 'ప్రగతిపథంలో ఇంటర్‌విద్య' సదస్సు ను ఆయన ప్రారంభించారు. మూడేండ్లలో విద్యార్థులకు సకల సౌకర్యాల కోసం రూ.350 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.350 కోట్లు వెచ్చించడానికైనా సిద్ధంగా ఉన్నామని కడియం ప్రకటించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే వేసవి సెలవుల్లో ఉచితంగా జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. జూనియర్ లెక్చరర్లు కోచింగ్ ఇవ్వటానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని విజ్ఞప్తిచేశారు. లెక్చరర్లు ఉద్యోగమే కాకుండా సామాజిక బాధ్యత కూడా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వల్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు క్రమంగా ఆదరణ పెరుగుతున్నదని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు కూడా ప్రభుత్వ జూనియర్ కాలేజీల వైపు వస్తున్నారని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు.

లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి: పల్లా

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోసం తాను కృషిచేస్తానని శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకొన్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ కోసం జీవో 16ను విడుదల చేస్తే.. కొందరు దీనిపై కేసులు వేశారని విమర్శించారు. ఇంటర్ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఏ అశోక్ చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఇంటర్‌బోర్డులో అన్నిరకాల సర్వీసులను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు కనకచంద్రం, కొప్పిశెట్టి సురేశ్, ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయగౌడ్, గెస్ట్ లెక్చరర్ల సంఘం నాయకుడు వెంకట్‌రెడ్డితోపాటు గోనారెడ్డి, భాస్కర్‌రెడ్డి పలువురు ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై కసరత్తు మొదలు

- 9లోపు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు
- నివేదికలు తయారుచేస్తున్న ప్రభుత్వశాఖలు
- పెరుగనున్న ప్రగతిపద్దు సైజు
- బీసీ సంక్షేమానికి భారీగా కేటాయింపులు
- రైతులకు రూ.8 వేల పెట్టుబడి పథకానికి చోటు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసే అవకాశం

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 వార్షిక బడ్జెట్ రూపకల్పనకు ఆర్థికశాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను, ప్రస్తుత సంవత్సరం కేటాయించిన నిధులలో ఇప్పటివరకు ఎంత ఖర్చయింది? ఇంకా ఎన్నినిధులు అవసరం? అనే విషయంపై ప్రభుత్వశాఖలు నివేదిక తయారుచేస్తున్నాయి. ఈ నెల 9వ తేదీలోగా అన్నిశాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను పంపాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీచేసింది. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి మొదటివారంలోనే ప్రవేశపెట్టనున్నందున.. రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనను త్వరగా పూర్తిచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేటాయింపులు పెంచటంతోపాటు.. రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.8 వేల చొప్పున పంటల పెట్టుబడి పథకానికి కూడా కేటాయింపులు చేయనున్నారు. రైతు రుణమాఫీ పూర్తి కావడంతో ప్రభుత్వం రైతులకు పంటల పెట్టుబడిని ఇవ్వనున్నది. ప్రణాళిక, ప్రణాళికేతర పద్దులు లేకుండా ప్రగతిపద్దు, నిర్వహణపద్దు పేరుతో కొత్త తరహాలో 2017-18 బడ్జెట్‌ను రూపొందించింది. సంక్షేమంతోపాటు మానవీయ కోణాన్ని జోడించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గత బడ్జెట్ పెద్దపీట వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం రూ.1,49,646 కోట్లుగా ప్రతిపాదించింది. ఇందులో ప్రగతి పద్దు రూ.88 వేల కోట్లు కాగా.. నిర్వహణ వ్యయం కింద రూ.61 వేల కోట్లను ప్రతిపాదించారు. వచ్చే బడ్జెట్‌లో కూడా ప్రగతిపద్దు సైజు పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే బడ్జెట్‌లోని ప్రగతి పద్దులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసే అవకాశముంది. బీసీల సంక్షేమానికి ఈ ఏడాది 5,071కోట్ల రూపాయలు కేటాయించింది. వచ్చే వార్షిక బడ్జెట్‌లో దీనిని భారీగా పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు బీసీ సబ్‌ప్లాన్‌పై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం నిధులను వెంటవెంటనే ఖర్చుచేస్తున్నారు. పైసా పైసాకు పక్కాగా లెక్క చెప్తున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన దానికంటే ఎక్కువ నిధులను వెచ్చిస్తున్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులలో ఇప్పటికే 20 శాతానికి పైగా ఖర్చుచేశారు. ఎస్టీల అభివృద్ధికి 12 శాతం వరకు నిధులను ఖర్చుచేసినట్టు సమాచారం. ప్రణాళిక, ప్రణాళికేతర బడ్జెట్‌కు స్వస్తి పలికిన నేపథ్యంలో బడ్జెట్‌ను ప్రధానంగా రెండు భాగాలుగా విభజించారు. క్యాపిటల్, రెవెన్యూ వ్యయంగా రూపొందించారు. ప్రణాళిక బడ్జెట్ లేనందున ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ప్రగతిపద్దు కింద చేర్చారు. ఈసారి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలుచేయటానికి పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టంలో లోపాలను సవరించి కొత్తరూపమిచ్చారు. ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో ప్రగతిపద్దు (ప్లాన్) కింద మొత్తం రూ.88,071 కోట్లను కేటాయించింది. అందులో ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.14,375 కోట్లు, ఎస్టీల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.8,165.88 కోట్లు కేటాయించింది. వాస్తవానికి గతంలో ప్రభుత్వాలు, అధికారులు బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రణాళిక కింద కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చుచేసేవారు కాదు. ఆర్థిక సంవత్సరం చివరలో ఖర్చుచేయడానికి హడావుడి చేసేవారు. ఖర్చుచేయకుండా మిగిలిపోయిన నిధులు మురిగిపోయేవి. అటువంటి పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పటిష్ఠ వ్యవస్థను రూపొందించారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులు మొత్తం ఖర్చుచేయని పక్షంలో మిగిలిన నిధులను వచ్చే ఏడాది బడ్జెట్‌కు క్యారీఫార్వర్డ్ చేయాలని నిర్ణయించారు. ఒక సంవత్సరంలో మిగిలిన నిధులను, మరుసటి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్‌ఫండ్‌కు అదనంగా కలుపుతున్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులలో ఒక్కపైసా కూడా ఖర్చుచేయకుండా వృథాగా పోదు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులు ఏవిధంగా ఖర్చవుతున్నాయనే విషయంపై ముఖ్యమంత్రితోపాటు సీఎం కార్యాలయం కూడా తరుచూ సమీక్షిస్తున్నది. ఆయా శాఖలు ప్రతినెలా నివేదికలు తయారుచేస్తున్నాయి. గతంలో ఆర్థిక సంవత్సరం మొదలైన మొదటి ఆరునెలల వరకు కనీసం 10 శాతం నిధులు కూడా ఖర్చు చేయడంలో అధికారులు విఫలమయ్యేవారు. కానీ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించడంతో ఏ ప్రాంతంలో ఎక్కడ.. ఎవరికి.. ఎంత నిధులను ఖర్చు చేశామనే విషయంపై అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. నిధులు సద్వినియోగమయ్యేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఫలితంగా ఈసారి మొదటి ఆరునెలల్లోనే నిర్ణీత పరిమితిని మించి నిధులను ఖర్చుచేశారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల

మొదటిపేజీ తరువాయి...



సుంకపాక దేవయ్య



రాంబాల్ నాయక్



చిలకమర్రి నర్సింహ



బోయిళ్ల విద్యాసాగర్

సుంకపాక దేవయ్య, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం రాంబాల్‌నాయక్, చిలకమర్రి నర్సింహను ప్రభుత్వం నియమించింది.

ఉద్యమకారుడికి దక్కిన గుర్తింపు

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందు నిలిచిన ఉద్యమకారుడు ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు తగిన గుర్తింపు దక్కింది. తెలంగాణ ఉద్యమబాటలో పనిచేసినవారందరికీ ఒక్కొక్కరిగా సీఎం కేసీఆర్ గుర్తింపునిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే విద్యార్థి నాయకుడిగా తెలంగాణ కోసం తపించిన శ్రీనివాస్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం గణపూర్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్.. కేసీఆర్ తలపెట్టిన తెలంగాణ మలి దశ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. టీఆర్‌ఎస్వీకి తొలి అధ్యక్షుడి, టీఆర్‌ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడిగా కూడా పనిచేశారు. 2003లో ఓయూ ఆర్ట్స్ కళాశాల టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడిగా కొనసాగారు. 2004లో జంటనగరాల టీఆర్‌ఎస్వీ విభాగం ప్రధాన కార్యదర్శిగా, 2005-07 వరకు టీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2007-2010 వరకు టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎర్రోళ్ల..

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ తనకు దైవంతో సమానమని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉద్యమ సమయం నుంచి మంత్రులు హరీశ్‌రావు, కే తారకరామారావు, ఎంపీ కవిత తనను ప్రోత్సహించారని, సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తనకు ఊహ తెలిసినప్పటి నుంచి సిద్దిపేట నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ తనకు ఆదర్శమని వెల్లడించారు. తెలంగాణ కోసం ఉద్యమించిన కేసీఆర్ సైన్యంలో తానొక సైనికుడిగా నిలిచే అవకాశం లభించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, వారి ప్రగతికోసం కమిషన్ తరఫున కృషి చేస్తానని చెప్పారు. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో టీఆర్‌ఎస్‌కు సేవచేసే భాగ్యం కల్పించారని, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం అలుపెరుగకుండా శ్రమిస్తున్న కేసీఆర్ బాటలో తాను పనిచేస్తానని వివరించారు. యువతకు, పార్టీని నమ్ముకొని నిస్వార్థంగా పనిచేసేవారికి సీఎం కేసీఆర్ తగిన ప్రోత్సాహం అందిస్తారని శ్రీనివాస్ తెలిపారు.

ఇంటర్‌లో గ్రేడింగ్ విధానంపై ఆచితూచి నిర్ణయం

సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ: డిప్యూటీ సీఎం కడియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మార్కుల విధానానికి స్వస్తి పలికి, గ్రేడింగ్ పద్ధతి ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనపై విద్యాశాఖ తుది నిర్ణయం తీసుకోలేదు. గ్రేడింగ్ విధానంపై లోతుగా అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఇంటర్‌లో గ్రేడింగ్ విధానం అమలుచేయాలన్న సిఫారసులను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, దీనిపై 15 రోజులలో నిపుణుల కమిటీ ఏర్పాటుచేసి, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని మంగళవారం తనను కలిసిన విలేకరులతో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చెప్పారు. జాతీయస్థాయి జేఈఈ, నీట్‌తోపాటు రాష్ట్ర ఎంసెట్ వంటి పరీక్షలను దృష్టి లో పెట్టుకుని గ్రేడింగ్ విధానాన్ని అమలుచేయాల్సి ఉన్నదన్నారు. జాతీయస్థాయిలో ఐఐటీ, ఎన్‌ఐటీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న జేఈఈ పరీక్షల ర్యాంకింగ్ ఖరారులో గ్రేడింగ్ బదులుగా మార్కుల విధానాన్ని అమలుచేస్తున్నారు. ఇంటర్‌లో గరిష్ఠంగా 75 శాతం మార్కులు సాధించినవారికి జేఈఈ ఫలితాల్లో ర్యాంకులు ప్రకటిస్తున్నారు. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకపోతే గ్రేడింగ్ విధానం అమలుకు తమకు అభ్యంతరం లేదని కడియం స్పష్టంచేశారు. గ్రేడింగ్ విధానం అమలుచేస్తే 75 శాతం మార్కులను లెక్కించడంలో తేడాలు వస్తున్నాయని, అందువల్ల దీనిపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉన్నదని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి ఏ అశోక్ చెప్పారు.

తెలంగాణను చూసి నేర్చుకోండి

మొదటిపేజీ తరువాయి...

ఎన్నో హామీలిస్తుంటాయి. అధికారంలోకి రాగానే రైతుల కోసం ఏమేం చేస్తారో ధీమాగా చెబుతాయి. ముఖ్యంగా రుణమాఫీ, ఉచిత విద్యుత్, నిరంతర విద్యుత్‌కు సంబంధించి హామీలైతే మ్యానిఫెస్టోల్లో మొదటి ఐదు వాక్యాల్లోనే ప్రచురిస్తాయి. తీరా ఎన్నికల్లో గెలిచాక ఆ ప్రభుత్వం రైతులకు కొత్తగా చేసేదేమీ ఉండదు. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు ఆందోళనబాట పట్టాల్సి వస్తున్నది. కడుపుమండి నిరసనకు దిగినవారిపై కాల్పులు జరుపుతున్న వార్తలు ఇప్పుడు సాధారణ విషయాలుగా మారాయి. రైతుల సంక్షేమం గురించి పట్టించుకోవాల్సిన పాలకులు ఇలా వ్యవహరించడం తగదు. దేశానికి అన్నంపెడుతున్న రైతుకు తన వాటా తనకు ఎందుకు దక్కదు? అన్నదాతల సంక్షేమం జరుగనంతవరకు ఈ దేశం బలోపేతం కాదన్న వాస్తవాన్ని గ్రహించాలి. పార్లమెంట్ సమావేశాల్లోనూ రైతుసమస్యలపై కూలంకషంగా చర్చించాలి. వాటి పరిష్కారంపై ఆలోచించాలి. ఇదంతా ఎప్పుడో జరుగాల్సింది. ఇప్పటికైనా సమయం మించిపోలేదు. తెలంగాణ ప్రభుత్వం అసాధ్యాన్ని ఎలా సుసాధ్యం చేసి చూపించిందో చూడండి.. ఇప్పుడిక మిగతా రాష్ట్రాల వంతు!

కోల్ ఇండియా చైర్మన్ పదవికి శ్రీధర్!

కేంద్రానికి సిఫారసు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణి సీఎండీగా ఉన్న శ్రీధర్ పేరును కోల్ ఇండియా చైర్మన్ పదవికి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కోల్ ఇండియాకు చైర్మన్‌గా వెళ్లడానికి శ్రీధర్‌ను అనుమతించే ఫైల్‌పై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతకం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ మంగళవారం కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శికి ఈ మేరకు సిపారసు లేఖ రాశారు. 1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీధర్ సర్వీస్ రికార్డులో ఎలాంటి మచ్చ లేదని లేఖలో ధ్రువీకరించారు. దీంతో కోల్ ఇండియాకు చైర్మన్‌గా శ్రీధర్ ఎంపిక ఇక ఖాయమేనని అధికారవర్గాలు చర్చించుకుంటున్నాయి. ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేసిన శ్రీధర్ సింగరేణి సీఎండీగా కూడా సంస్థ లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషించారు. సంస్థ పనితీరులో అనేక సంస్కరణలు తీసుకువచ్చి, కార్మికుల్లో నూతనోత్సాహం నింపి బొగ్గు, విద్యుత్ ఉత్పత్తులను గణనీయంగా పెంచారు. విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి ప్రవేశించడానికి శ్రీధర్ ఎంతగానో కృషి చేశారు. జైపూర్ విద్యుత్ కేంద్రంలో మరో కొత్త ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరిగేందుకు శ్రమిస్తున్నారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేశారు. సీఎం కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి శ్రీధర్ అసమాన ప్రతిభను కనబరిచారు.

మంత్రి కేటీఆర్ ఔదార్యం

వైద్యఖర్చుల కోసం చిన్నారి, మహిళకు ఆర్థిక సహాయం

నెటిజన్ల వినతికి స్పందించిన మంత్రి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండే రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మరోమారు తన పెద్ద మనసును చాటుకున్నారు. రెండేండ్ల చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండగా తల్లిండ్రులు దవాఖానలో చేర్పించారు. ఆ చిన్నారికి అత్యవసర వైద్యసేవలు అందించాల్సి ఉన్నది. పేదరికంలో ఉన్న ఆ దళిత కుటుంబం ఇప్పటికే రూ.లక్షన్నరకు పైగా ఖర్చుచేసిందని వారిని ఆదుకోవాలని వినాయకరావు అనే నెటిజన్ ట్విట్టర్‌లో మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన కేటీఆర్ తన కార్యాలయ సిబ్బందితో వివరాలు తెలుసుకుని సహాయం అందించారు. తన తల్లిని బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా దవాఖానలో చేర్పించి రూ. 5 లక్షలకు పైగా ఖర్చు చేశామని.. ఆమె వైద్యానికి మరింత సొమ్ము కావాలని నవీన్ అనే మరో నెటిజన్ ట్విట్టర్‌లో మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి సహాయం అందించాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

సీఎస్ పదవీకాలం పొడిగించండి

కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం లేఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ పదవీకాలాన్ని మరో మూడునెలలు పొడిగించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయం మేరకు లేఖ రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సీఎస్‌గా ఎస్పీసింగ్ ఈ నెల 28వ తేదీన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఈయన సుదీర్ఘకాలం రాష్ట్రంలో కీలకమైన బాధ్యతలను నిర్వహించారు. ఎస్పీసింగ్ సేవలు రాష్ట్రానికి ఇంకా అవసరమని భావించిన సీఎం కేసీఆర్.. ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని కేంద్రాన్ని కోరారు.

186 చెరువుల పునరుద్ధరణకు అనుమతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయ నాలుగోదశలో భాగంగా 186 చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం అనుమతినిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్, వరంగల్ గ్రామీణం, భూపాలపల్లి, మహబూబాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కొమురంభీం, కొత్తగూడెం జిల్లాల్లో 186 చెరువులకు గాను రూ.53.65 కోట్ల విలువైన పనులకు పాలనా అనుమతులు ఇచ్చింది.

మేడారంను జాతీయ పండుగగా గుర్తించాలి

- కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, పలువురు ఎంపీలు
- ఈ ఏడాది కోటిమంది భక్తులు వస్తారని అంచనా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన కుంభమేళాగా పేరొందిన మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని మరోసారి కోరింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు జీ నగేశ్, సీతారాంనాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర గిరిజనశాఖ మంత్రి జ్యువల్ ఓరంను కలిసి విజ్ఞప్తిచేశారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఇప్పటికే తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి ప్రతిపాదించిన విషయాన్ని గుర్తుచేశారు. రెండేండ్లకు ఒకసారి మేడారంలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మల జాతరకు జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారని కేంద్ర మంత్రికి వివరించారు. మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది 90 లక్షల భక్తులు ఈ జాతరలో పాల్గొన్నారని, ఈసారి కోటి మంది భక్తులు పాల్గొంటారని భావిస్తున్నట్టు చెప్పారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. ఉత్తరభారత్‌లో జాతీయ గిరిజన వనజ్ ఉత్సవ్ పేరుతో పండుగ నిర్వహిస్తున్నట్టుగానే.. తెలంగాణలో జరిగే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రాన్ని కోరినట్టు తెలిపారు. తమ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి జ్యువల్ ఓరం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మేడారం జాతర నిర్వహణకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం రూ.160 కోట్లు మంజూరుచేసిందని, ఈ ఏడాది రూ.80 కోట్లు మంజూరుచేసినట్టు వివరించారు. మేడారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఈ నెల 18న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి చందూలాల్ ఆధ్వర్యంలో పరిశీలించనున్నట్టు తెలిపారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మేడారం జాతర నిర్వహించనున్నారు.



మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు సీతారాంనాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్



మంగళవారం సచివాలయంలో మంత్రులు నాయిని, కడియం, చందూలాల్‌తో సమావేశమైన రేయాన్స్ ఫ్యాక్టరీ ప్రతినిధులు, కార్మిక సంఘం నాయకులు

తొమ్మిదిలోగా నెల వేతనం ఇవ్వాలి

- రేయాన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి మంత్రుల ఆదేశం
- సీఎం హామీని పట్టించుకోకపోవడంపై మండిపాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్మికులకు 32 నెలలుగా జీతాలు చెల్లించకుండా వేధిస్తున్న భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్-బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ) యాజమాన్యంపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హోం, కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజన, పర్యాటకశాఖ మంత్రి చందూలాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ మూతపడటంతో రోడ్డున పడిన దాదాపు 750 మంది కార్మికులకు ఈనెల 9వ తేదీలోగా కనీసం ఒకనెల జీతం చెల్లించాలని వారు కంపెనీ ప్రతినిధికి డెడ్‌లైన్ విధించారు. మంత్రులు కడియం, నాయిని, చందూలాల్‌తో మంగళవారం సచివాలయంలో కంపెనీ కార్మిక యూనియన్ల నాయకులు, ప్రతినిధులు సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ యాజమాన్య ధోరణిని ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు. ఈ నెల 9వ తేదీలోగా కార్మికులకు ఒకనెల వేతనం చెల్లించి, 10వ తేదీన తమతో సమావేశమై మిగిలినది ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాన్ని మంత్రులు ఆదేశించారు. వీటిలో దేనిలో విఫలమైనా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేయాన్స్ ఫ్యాక్టరీ మూతపడకూడదని, కార్మికులు ఇబ్బంది పడకూడదని మూడేళ్ల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ యాజమాన్యానికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చినా కంపెనీని ఇప్పటికీ తిరిగి ప్రారంభించకపోవడాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. సమావేశంలో కార్మికశాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్యనాయక్, డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

గత ఏడాది విమానాశ్రయాల్లో

1,339 కిలోల బంగారం పట్టివేత

- 527 కిలోల వెండి, రూ.15 కోట్ల నగదు స్వాధీనం
- సీఐఎస్ఎఫ్ వార్షిక నివేదిక విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత ఏడాది దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన విమానాశ్రయాల్లో అక్రమ రవాణా చేస్తున్న 1,339 కిలోల బంగారాన్ని సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) అధికారులు పట్టుకున్నారు. ఈ బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.335 కోట్ల వరకు ఉంటుందని సీఐఎస్ఎఫ్ 2017 వార్షిక నివేదిక వెల్లడించింది. రూ. 2.07 కోట్ల విలువైన 527 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.15.68 కోట్ల నగదు పట్టుబడినట్టు వార్షిక నివేదిక తెలిపింది. దేశంలోని 59 ప్రధాన విమానాశ్రయాలకు, ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్‌కు సీఐఎస్ఎఫ్ రక్షణ కల్పిస్తున్నది.



రాములు గౌడ్‌కు చెక్కును అందజేస్తున్న నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, నెట్‌వర్క్ ఇంచార్జి ఎస్జీవీ శ్రీనివాస్‌రావు

'నమస్తే తెలంగాణ' రిపోర్టర్‌కు ఆర్థికసాయం

చందానగర్, నమస్తే తెలంగాణ: అనారోగ్యంతో బాధపడుతున్న హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట్ 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్ నస్కంటి శ్రీనివాసులు వైద్య ఖర్చుల కోసం పత్రిక యాజమాన్యం రూ.60,808 మంజూరుచేసింది. పత్రిక ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, నెట్‌వర్క్ ఇంచార్జి ఎస్జీవీ శ్రీనివాసరావు ఆర్థికసాయం చెక్కును మంగళవారం శ్రీనివాసులు సమీప బంధువు రాములుగౌడ్‌కు అందజేశారు.

ప్రాజెక్టులు, సంస్థలకు భూముల కేటాయింపు

- అటవీశాఖకు 450 ఎకరాల బదలాయింపు
- రైల్ కోచ్ ఫ్యాక్టరీకి 32.32 ఎకరాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం చేపట్టిన పలు ప్రాజెక్టులు, సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించింది. మిషన్ భగీరథ ప్రాజెక్టు పైప్‌లైన్లు వేయడానికి అటవీభూమిని తీసుకుని, ఆ భూమికి బదులుగా జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి జిల్లాల్లో 450 ఎకరాల భూములను బదలాయించింది. రైల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని వెలిమల గ్రామంలో 32.32 ఎకరాలు ఇచ్చింది. జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామంలో టీఎస్ఐఐసీ పార్క్ కోసం 14 ఎకరాలు కేటాయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఇటీవల జరిగిన తెలంగాణ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్టు సమాచారం. ఎకో టూరిజం ప్రాజెక్టు కోసం కృష్ణానదీ తీర ప్రాంతంలోని నల్లగొండ జిల్లా నేరేడిగొమ్మ మండలం పెద్దమునిగల్ గ్రామంలో 15 ఎకరాల భూమిని కేటాయించింది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్) బెటాలియన్‌ను ఏర్పాటు చేయడానికి హిమాయత్‌నగర్, శంషాబాద్ మండలాల్లో 3.21ఎకరాలు మంజూరు చేసింది. హైదరాబాద్‌లో రెడ్డిబాలికల హాస్టల్ నిర్మాణం కోసం రెడ్డి కాలేజీ హాస్టల్ పక్కనే ఉన్న నారాయణగూడ ఐపీఎమ్‌కు చెందిన 1261 గజాల స్థలాన్ని కేటాయించింది. పద్మశాలి, గౌడభవన్‌ల నిర్మాణం కోసం ఖమ్మం జిల్లా రఘునాథపల్లిలో 29 గుంటల భూమిని ఇచ్చింది గొల్లకురుమలకు ప్రభుత్వం కోకాపేట గ్రామంలో 10 ఎకరాలు కేటాయించడం, అక్కడ గొల్లకురుమ భవన్‌కు సీఎం కేసీఆర్ ఈ మధ్యనే శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇదేవిధంగా క్యాన్సర్ దవాఖాన నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్ గ్రామంలో 15 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కేసీఆర్ సమర్థతతోనే విద్యుత్ విజయం

- కరంట్ వెలుగులతో మొదలైన కొత్త సంవత్సరం
- నాడు కరంటు కావాలంటే కాల్పులు జరిపారు
- ఇప్పుడు దీనివెనుక మతలబు ఏమిటంటున్నారు
- తీగలు పట్టుకుంటే మతలబు తెలుస్తుంది
- ప్రతిపక్షాలకు ప్రజలు షాక్ ఇవ్వడం ఖాయం
- మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



టీఆర్ఎస్ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో కొత్త సంవత్సరం విద్యుత్ వెలుగులతో మొదలైందని.. దేశచరిత్రలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వ్యవసాయానికి నిరంతరం ఉచితంగా విద్యుత్‌ను అందించిన రాష్ట్రంగా రికార్డు సృష్టించిందని మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొన్న సమర్థమైన చర్యలతోనే మూడున్నరేండ్లలోనే తెలంగాణ చీకట్లను తరిమేసి వెలుగులు మిరుమిట్లు గొలిపే రాష్ట్రంగా మారిందని పేర్కొన్నారు.టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నాయకత్వ పటిమతోనే ఇది సాధ్యమైందని, అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మొనగాడు కేసీఆర్ అని ప్రజలు అభినందిస్తున్నారన్నారు. ఒకనాడు కరంట్ అడిగినందుకు రైతులను కాల్చిచంపిన చరిత్ర అప్పటి టీడీపీ ప్రభుత్వానిదని, తర్వాత అధికారంలోకి వచ్చి న కాంగ్రెస్ కూడా ప్రజలను మభ్యపెట్టిందని వివరించారు. రాష్ట్రం విడిపోతే తెలంగాణ చీకట్లమయమవుతుందని ఉమ్మడిరాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్న మాటలు ఇంకా తెలంగాణ ప్రజల చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణపట్నం నుంచి రావాల్సిన విద్యుత్‌ను రాత్రికి రాత్రే సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని ఏపీకి కట్టబెట్టారని ఆయన చెప్పారు. 24గంటల కరంట్ ఇస్తే తాను స్వయంగా టీఆర్ఎస్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారి టీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని ప్రజలను అడుగుతానని విపక్ష నేత జానారెడ్డి అసెంబ్లీలోనే చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పూర్తి చేయలేకపోయిన జైపూర్, భూపాల్‌పల్లి విద్యుత్ ప్రాజెక్టులతోపాటు, వార్ధా-హైదరాబాద్‌లైన్‌ను పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. విద్యుత్ శాఖలో 16వేల కొత్త ఉద్యోగాలను సృష్టించడంతోపాటు 24వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేశారని వివరించారు. కాంగ్రెస్ నేతలు కేసుల మీద కేసులు వేసినా వెనుకకు తగ్గకుండా యాదాద్రి, భద్రాద్రి ప్రాజెక్టులతో పాటు కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్టులో మరో దశను చేపట్టిముందుకు పోతున్నదని వెల్లడించారు.

ఈ ఏడాది మరిన్ని విజయాలు

సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యుత్ విజయం సాధించిన తెలంగాణ.. కొత్త సంవత్సరంలో భూరి కార్డుల ప్రక్షాళన, ఎకరానికి రూ.8వేల పెట్టుబడి, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి వంటి మరిన్ని అద్భుత విజయాలు అందుకోనున్నదన్నారు. కొందరు కుహనా రాజకీయ నేతలు 24గంటల విద్యుత్ వెనుక మతలబు ఏమిటన్ని విషం కక్కుతున్నారని, అలాంటి వారు విద్యుత్ తీగలు పట్టుకుంటే మతలబు తెలుస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధులు, కేంద్ర మంత్రులు ఇక్కడకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అభినందిస్తున్నారని చెప్పారు. విపక్షాలు ఇకనైనా కుహనా రాజకీయాలు మానుకొని, రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి హితవు పలికారు.

సీఎంతో పవన్ భేటీ వెనుక రాజకీయ ప్రాధాన్యం లేదు

సినీనటుడు, జనసేన అధ్యక్షుడు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలువటం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టంచేశారు. 24గంటల విద్యుత్ ఎలా సాధ్యమైందో తెలుసుకోవడానికే పవన్‌కల్యాణ్ సీఎంను కలిశారని చెప్పారు. పవన్‌కల్యాణ్ కంటే ముందు రాష్ట్రంలో ఇప్పటివరకూ పర్యటించిన కేంద్ర మంత్రులు, రాష్ట్రాలమంత్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని పెద్దఎత్తున పొగిడారని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ పార్టీ సిద్ధాంతాలు ఏమిటో తెలియవని..అయితే కేసీఆర్ ఉద్యమస్ఫూర్తిని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్‌లో చెప్తానని పవన్‌కల్యాణ్ అన్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి వివరించారు.

ఇంజినీర్ల పదోన్నతుల జాబితాకు ఏపీ సుముఖం

సమాచారం పంపాలని తెలంగాణ నీటిపారుదలశాఖకు లేఖ

ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చాక నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నీటిపారుదలశాఖలో 1978 పీఎస్సీ (పబ్లిక్ సర్వీస్ కమిషన్) నుంచి 2007 పీఎస్సీ వరకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పదోన్నతుల జాబితాను రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ సుముఖత వ్యక్తం చేసింది. వాస్తవంగా తెలంగాణకు సంబంధించి నీటిపారుదలశాఖ గత ఏడాది సెప్టెంబర్‌లో పదోన్నతుల జాబితాను విడుదల చేసింది. దీనిపై కొందరు ఇంజినీర్లు కేసు వేయగా పదోన్నతులను తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇదేవిధంగా ఉమ్మడి రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పదోన్నతుల జాబితాను ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ రూపొందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జోన్-5, 6కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సాంకేతిక అధికారుల జాబితా, వారి వివరాలు పంపితే తాము పదోన్నతుల జాబితాను రూపొందిస్తామని ఏపీ జలవనరులశాఖ కార్యదర్శి తెలంగాణను కోరారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి లేఖ రాశారు. దీంతో ఈ మేరకు ఏపీకి సమాచారాన్ని ఇవ్వాలా? పదోన్నతుల ప్రక్రియలో ఏపీ తన పరిధిలోని 1-4 జోన్లలో అమలు చేసిన విధానాన్నే అవలంబించాలా? అనే వాటిపై స్పష్టత నివ్వాలని నీటిపారుదలశాఖ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తర్వాత ఈ అంశంపై చర్యలు మొదలుపెట్టనుంది.

ఎంసెట్-2018 కన్వీనర్‌గా ప్రొఫెసర్ యాదయ్య

ఎడ్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్ కన్వీనర్లను ప్రకటించిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న ఎంసెట్-2018 కన్వీనర్‌గా జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్యను నియమించారు. ఆయనను ఎంసెట్ కన్వీనర్‌గా నియమించడం ఇది రెండోసారి. మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ప్రవేశ పరీక్షల తేదీ, నిర్వహించనున్న యూనివర్సిటీలు, కన్వీనర్ల పేర్లను ప్రకటించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రవేశ పరీక్షపేరు	పరీక్షల తేదీలు	నిర్వహణ బాధ్యతలు	కన్వీనర్
టీఎస్ ఎంసెట్	మే 2 -మే 5 వరకు	జేఎన్టీయూహెచ్	ప్రొఫెసర్ ఎన్ యాదయ్య
టీఎస్ ఈసెట్	మే 9	జేఎన్టీయూహెచ్	ప్రొఫెసర్ ఏ గోవర్దన్
టీఎస్ ఐసెట్	మే 17	కాకతీయ యూనివర్సిటీ	ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యశర్మ
టీఎస్ పీఈసెట్	మే 20 నుంచి	మహాత్మాగాంధీ యూనివర్సిటీ	ప్రొఫెసర్ వీ సత్యనారాయణ
టీఎస్ లాసెట్	మే 25	ఉస్మానియా యూనివర్సిటీ	ప్రొఫెసర్ ఎస్బీ ద్వారాకానాథ్
టీఎస్ పీజీలాసెట్	మే 26	ఉస్మానియా యూనివర్సిటీ	ప్రొఫెసర్ ఎస్బీ ద్వారకానాథ్
టీఎస్ పీజీఈసెట్	మే 27	ఉస్మానియా యూనివర్సిటీ	ప్రొఫెసర్ ఎస్ సమీన్‌ఫాతీమా
టీఎస్ ఎడ్‌సెట్	మే 31	ఉస్మానియా యూనివర్సిటీ	ప్రొఫెసర్ సీ మధుమతి



కేంద్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చింది. ట్రిపుల్ తలాఖ్ బిల్లు అందులో ఒకటి. ఈ బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీది ఎటూ తేల్చుకోలేని గందరగోళ స్థితి. దేంట్లోనైనా కాంగ్రెస్‌ది ఒక అడుగు ముందుకు, పదడుగులు వెనక్కు అన్న చందమే.

ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ, కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖామంత్రి

గడిచిన కొన్నేండ్లుగా మన సైనిక స్థావరాలపై ఉగ్రదాడులు వరుసగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రక్షణ స్థావరాలను బలోపేతం చేయాలని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ నేతృత్వంలోని కమిటీ సూచించింది. కానీ ప్రభుత్వం గాఢ నిద్రలో ఉన్నది.

జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ ఎంపీ



చరిత్రలో నేడు



1910

రోజుకు 8 గంటల పని దినం కోసం సమ్మె, పోరాటం ప్రారంభించిన గని కార్మికులు.

1957

తొలిసారిగా ఎలక్ట్రానిక్ వాచ్‌ను తయారుచేసిన ల్యాంకస్టర్ పా.





1988

ఈ శతాబ్దంలో ఎక్కువకాలం బ్రిటన్ ప్రధానిగా సేవలందించిన మార్గరెట్ థాచర్.

రెండు దశాబ్దాల ఎదురుచూపుల తర్వాత తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశం ఖరారైంది. 1995లోనే అప్పటి సీఎం జయలలితపై విమర్శనాస్త్రాలు సంధించి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నట్లు సంకేతాలు పంపారు. కానీ కాలక్రమంలో జయలలితతో సయోధ్య కుదిరి రాజకీయ బరినుంచి విరమించుకున్నారు. ఈ కొత్త సంవత్సరం సందర్భంగా తన అభిమానులతో సుదీర్ఘ మంతనాల తర్వాత రాజకీయ ప్రవేశానికి పచ్చజెండా ఊపారు. తమిళ నాడులో ప్రస్తుతం ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని, పరిస్థితులను కలిసివచ్చే అంశంగా ఉపయోగించుకోవాలన్నది రజనీ ఎత్తుగడ. పరిణామాలు చూస్తే సానుకూలం సంకేతంగానే కనిపిస్తున్నవి.

ది హిందూ

బ్రిటన్ రాజపీఠం విషయంలో చరిత్రలో ఎన్నడూలేనంత ఉత్కంఠ ఏర్పడింది. చర్చ జరుగుతున్నది. మీడియా టాబ్లాయిడ్లకు ఒడువని మేతగా మారిపోయింది. రాణి ఎలిజబెత్ తర్వాత కిరీటాన్ని ధరించేది ఎవరన్నది బ్రిటన్‌లో ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. గత సంప్రదాయాలకు భిన్నంగా వారసత్వ కిరీటం ఎలిజబెత్ రాణి మనువడు రాకుమారుడు విలియంకు కట్టబెట్టపోతున్నట్లు తెలిపింది. దీనికి అనుగుణంగానే మెజార్టీ ప్రజల అభిప్రాయం ఉన్నట్లు సర్వేలు చెబుతుండటం గమనార్హం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

అమెరికాకు కనువిప్పు

పాముకు పాలుపోస్తే విషం చిమ్మక మానదని పాకిస్థాన్ విషయంలో అమెరికాకు తెలిసివచ్చింది. ఏండ్లకేండ్లుగా అమెరికా సాయం పొందుతూ అమెరికాను అంతం చేయాలనుకుంటున్న టెర్రరిజానికి పాక్ ఆయువు పోస్తుందని అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ ఆగ్రహించాడు. ఈ క్రమంలో ట్రంప్ మాటలు గమనార్హమైనవి. గత పదిహేనేండ్లలో పాక్‌కు 2.10లక్షల కోట్ల సాయం గుడ్డిగా అందించాం. దీంతో ఒరిగిందేమీ లేదు. అక్కడి నాయకులు మాకు అబద్ధాలు చెప్పారు. మాకు నమ్మకద్రోహం చేశారు. మమ్మల్ని బుద్ధిహీనులుగా భావిస్తున్నారు. ఇకనుంచి అలా జరుగనివ్వమంటూ ట్రంప్ తన ఆగ్రహాన్నీ, ఒకింత నిర్వేదాన్నీ వ్యక్తంచేశాడు. ఇదే విషయాన్ని భారత్ దశాబ్దాలుగా చెబుతున్నది. అయినా అమెరికాకు చెవికెక్కలేదు. పైగా అనేక క్లిష్ట సమయాల్లో పాక్‌కు అమెరికా వత్తాసు పలికింది. సరిహద్దు చొరబాట్లను పాక్ ప్రేరేపిస్తున్నదని భారత్ చెప్పినప్పుడల్లా కొట్టిపారేసింది. పాకిస్థాన్ స్థావరంగా చేసుకొని ఇస్లామిక్ టెర్రరిస్టు మూకలు పెచ్చరిల్లిపోతున్నాయని భారత్ అనేకమార్లు అంతర్జాతీయ సమాజానికి సాక్ష్యాధారాలతో సహా వివరించింది. అయినా అమెరికా వేటినీ పట్టించుకోలేదు. తన వ్యూహాత్మక రాజకీయ విధానాల్లోంచి దఫదఫాలుగా పాక్‌కు ఆర్థిక, సైనిక సాయం పెంచుకుంటూపోయింది. 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని ప్రపంచ వాణిజ్య కేంద్రంపై ఉగ్రదాడి తర్వాత ప్రమాదాన్ని గుర్తించిన అమెరికా చర్యలకు ఉపక్రమించింది. అయితే అప్పటికే చేయి దాటిపోయింది. ఉగ్రభూతం దేశదేశాల్లో తిష్టవేసి శాంతి సుస్థిరతలను సవాలు చేస్తూ వస్తున్నది. రక్తపుటేరులు పారిస్తున్నది. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్‌లోని అబోతాబాద్‌లో ఆల్‌ఖైదా అగ్రనేత ఒసామాబిన్ లాదెన్‌ను అమెరికా మట్టుబెట్టింది. దానికి కొనసాగింపుగానే అఫ్గానిస్థాన్, ఇరాక్, సిరియా తదితర దేశాల్లో తిష్టవేసిన ఉగ్రమూకలను ఏరివేసేందుకు చర్యలుచేపట్టింది. అయితే దీంట్లో కూడా ఆశించిన మేర పాక్ నుంచి సాయం అందటం లేదని, ఒంటరిగా అఫ్ఘన్‌లో పోరాడుతున్నామని ట్రంప్ చెప్పుకునే పరిస్థితి ఎదురైంది. ఏదేమైనా ఆలస్యంగానైనా అమెరికాకు కనువిప్పు కలుగటం ఆహ్వానించదగ్గ పరిణామం.

అఫ్ఘానిస్థాన్‌పై సోవియట్ దాడి తర్వాత మరింత దూకుడుగా, విచక్షణారహితంగా ఉగ్రమూకలను సోవియట్‌కు వ్యతిరేకంగా ఉసిగొలిపింది. 1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిపోవటంతో, అప్పటిదాకా పెంచిపోషించిన మూకలే పక్కలో బల్లెమైపోయాయి. అది అఫ్ఘాన్ మొదలు ఇరాన్, ఇరాక్, సిరియా ఐఎస్ఐఎస్ దాకా జీహాద్ మూకలు కంట్లో నలుసుగా తయారయ్యాయి. ఇప్పుడు ఉగ్రమూకల ప్రమాదం అనుభవంలోకి వచ్చిన తర్వాత ఆలస్యంగానైనా కనువిప్పు కలుగటం హర్షణీయం.

అమెరికా అనుసరించిన పాక్ అనుకూల విధానాలకు సుదీర్ఘ చరిత్ర ఉన్నది. అంతకుమించిన స్వార్థ పూరిత ఆధిపత్య రాజకీయార్థిక విధానాల నేపథ్యం ఉన్నది. మొదటి ప్రపంచ యుద్ధకాలం నుంచి అమెరికా, రష్యాల మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం నేపథ్యంలో ఆసియా ఖండంలో రష్యా ప్రభావాన్ని నిలువరించేందుకు పాకిస్థాన్‌ను విశ్వసనీయ మద్దతుదారుగా భావించింది. దీనికి భారత్ అనుసరించిన అలీనవిధానం, అన్ని విషయాల్లో అమెరికాకు వంతపాడకపోవటం లాంటి విధానాలు తోడయ్యాయి. అలాగే నెహ్రూ అనుసరించిన సోషలిస్టు తరహా అభివృద్ధి ప్రణాళికలు, అంతర్జాతీయంగా రష్యా అనుకూల విధానాలను సాకుగా చెప్పుకున్నది. దీంతో అమెరికా ఎన్నడూ భారత్‌ను సహజ మిత్రదేశంగా భావించలేదు. రెండో ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత మరింతగా పాకిస్థాన్‌ను నెత్తికెక్కించుకున్నది. 1954లోనే అమెరికా-పాకిస్థాన్ రక్షణ, సహకార ఒప్పందం కుదుర్చుకొని 50 కోట్ల డాలర్ల ఆర్థికసాయం, 70 కోట్ల డాలర్ల సైనిక సాయాన్ని అందించింది. ఇలా 1948లో ఏడు కోట్ల సాయంతో ప్రారంభించిన అమెరికా సాయం 2010 నాటికి 330 కోట్ల డాలర్లకు చేరింది. ఈ సహాయాన్నే ఇప్పుడు పాకిస్థాన్ ఉగ్రమూకలను పెంచిపోషించటం కోసం వాడుతున్నదంటూ దీన్నే అమెరికా నమ్మకద్రోహం అంటున్నది. ఏదైనా తనదాకా వస్తే గానీ తెలిసి రాదన్నది నిజమవుతున్నది.

ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితికి, ఉగ్రవాదానికి మూలం దశాబ్దాలుగా అమెరికా అనుసరించిన విధానాలే కారణం. రష్యా ప్రభావాన్ని నిలువరించే పేర దేశదేశాల్లో అమెరికా మతవాదాన్ని పెంచిపోషించింది. అఫ్ఘానిస్థాన్‌పై సోవియట్ దాడి తర్వాత మరింత దూకుడుగా, విచక్షణారహితంగా ఉగ్రమూకలను సోవియట్‌కు వ్యతిరేకంగా ఉసిగొలిపింది. 1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిపోవటంతో, అప్పటిదాకా పెంచిపోషించిన మూకలే పక్కలో బల్లెమైపోయాయి. అది అఫ్ఘాన్ మొదలు ఇరాన్, ఇరాక్, సిరియా ఐఎస్ఐఎస్ దాకా జీహాద్ మూకలు కంట్లో నలుసుగా తయారయ్యాయి. ఇప్పుడు ఉగ్రమూకల ప్రమాదం అనుభవంలోకి వచ్చిన తర్వాత ఆలస్యంగానైనా కనువిప్పు కలుగటం హర్షణీయం. ఇప్పటికైనా నాకో నీతి, నీకో నీతి అన్నట్లుగా అమెరికా వ్యవహరించకుండా ఉండాలి. జీహాదీ మూకల మానవహననాన్ని ప్రపంచంలో ఏ మూలన జరిగినా ఖండించాలి. కట్టడి చేయాలి. పాకిస్థాన్‌కు ఈ ఏడాది ఇవ్వాలనుకున్న ఆర్థిక సాయం 14.3 వేల కోట్లు ఇవ్వబోమన్న హెచ్చరికతోనే సరిపెట్టరాదు. భారత్ సరిహద్దు వెంట జరుగుతున్న చొరబాట్లు, దాడులకు దన్నుగా నిలుస్తున్నది ఎవరో ప్రపంచానికి తెలియంది కాదు. లాడెన్ అంతంతోనే ఉగ్రకోరలు విరిగిపోవు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా చేయాలి. ఉగ్రమూలాలను సమూలంగా పెకిలించి వేయాలి. ప్రపంచశాంతికి మార్గం వేయాలి.

సందర్భం

తల్లీ సావిత్రీ పూలే!!

అవ్వా! నువ్వు లేకపోతే
మా బతుకులెట్ల తెల్లారేవో?
ఎడ్లోళ్లమైన మాకు – నోరెట్ల వచ్చేదో?
ఎన్నడూ వెలుగు మొకం జూడని
మా చీకటి జీవితాల మీద
ఎన్నీల వెలుగుల్ని కుమ్మరించిన దానివి
పనురాలి కంటే మీనమైన బతుకుల మీద
ఆత్మవిశ్వాసపు జెండాలెగురేసిన దానివి
శూద్రుల తొలుసూరు తల్లివి
మా నిజమైన భరత మాతవు!
అక్షరాలు వింటే చెవులు తెగిపడే రోజుల్లో
అక్షరాలు చదివితే మా నాలుకలు
నలభై ముక్కలయ్యే కాలంల
మా నెత్తిమీద అక్షరాలు చల్లిన అమృతమూర్తివి
'నస్త్రీ స్వాతంత్ర్య కుర్హతి' అని మొరిగే కుక్కల మధ్య
ఆడదాన్ని అంగడిసరుకు చేసిన అన్యాయాల నడుమ
ఆకాశంలో సగభాగం మీద అక్షర దీపాలెత్తిన దానివి
మా జాతికి అసలైన సరస్వతివి
మా నెత్తిమీద రుద్దిన కర్మ సిద్ధాంతాన్ని
మమల్ని బానిసల్ని జేసిన పవిత్ర గ్రంథాలను
నా తండ్రి సర్జరీ చేసి
కుట్రలు బయటపెడుతున్నప్పుడు
నువ్వు మనిషివే కాదు పొమ్మన్న
అగ్రవర్ణ దురంహకారానికి
హక్కులే లెవ్వన్న ఆ ఆధిపత్యవాదులకు
గుండెల్లో రాళ్లు గుమ్మరిస్తున్న జ్యోతిభా సహచరివై
దారిలో దివిటి పట్టిన దానివి
మనసు నిండా నమ్మకాన్ని నింపిన దానివి
తల్లీ! సావిత్రీ పూలే!!
పుస్తకాన్ని పుట్టినప్పుడల్లా
నీ పాదాన్ని తాకినంత పులకరింత
అక్షరాన్ని పలికినప్పుడల్లా
మీ ఆది దంపతుల మీద పాటగుట్టినంత సంబురం

- తోకల రాజేశం, 9676761415

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



సునీల్ ధవళ

తమిళ తంబిలు ఎవరివైపో?

1970లలో బెంగుళూర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ బస్సులో శివాజీరావు గైక్వాడ్ అనే కండక్టర్ డ్యూటీలో ఉన్నాడంటే కుర్రకారుకు హడల్. అతను చాలా స్ట్రిక్ట్. ఆ బెల్‌బాటమ్ ప్యాంట్ల రోజుల్లో ప్రయాణికులు కదులుతున్న బస్సు ఎక్కినప్పుడో, బస్ ఫుట్‌బోర్డ్ మీద వేలాడినప్పుడో ఎక్కడ పడిపోతారోనని అతని భయం. బస్సు నడుస్తున్నప్పుడు ఎక్కితే వెంటనే దింపించేసేవాడు. టికెట్ వెలకు కచ్చితమైన చిల్లర ఇవ్వాల్సిందే.

ప్రయాణికుల కష్టం సొమ్ము చిల్లిగవ్వ కూడా తనకు ముట్టకూడదు. ఇలాంటి నియమావళితో డ్యూటీ చేసేవాడు. డ్యూటీ అయిపోయాక ఊర్లో ఎక్కడ నాటకాలున్నా వెళ్లి ముఖానికి రంగు పులుముకొని తనకిష్టమైన దుర్యోధనుడు పాత్ర ప్రదర్శించేవాడు. స్నేహితుల ప్రోత్సాహంతో, తన అదృష్టం పరీక్షించుకోవడానికని మద్రాసు వెళ్లాడు. ప్రముఖ దర్శకులు కె.బాలచందర్ దృష్టిని ఆకర్షించి అతని తమిళ చిత్రం అపూర్వ రాగాంగల్ ద్వారా 1975లో శివాజీ కాస్త రజనీకాంత్‌గా మారి తన సినిమా కెరీర్‌ను ప్రారంభించారు.

ఆది నుంచి తమిళ సినిమా రంగం తమిళ రాజకీయాలను చక్రం తిప్పగా జయలలితతో అది అంతరించిపోతుందా అని అనుకొనేలోగా అటు కమలహసన్ ఇటు రజనీకాంత్ ఇన్నేండ్ల ఊహాగానాలకు తెరదించారు. రాజకీయరంగు పులుముకొని అరంగేట్రం చేస్తామని తమ అభిమానులకు చల్లని వార్త చెప్పారు. కె.బాలచందర్ శిష్యులు మొదట్లో వెండితెర మీద ఒకరికొకరు పోటీ ఇచ్చుకొని ఇద్దరూ ఇద్దరే అని నిరూపించారు.

ఇప్పుడు రాజకీయరణంలోకి దిగడానికి విజయశంఖం పూరించారు. కమల్, రజనీకాంత్ విడిగా కన్నా జట్టు కట్టి మూకుమ్మడిగా పోరాడితే బాగుండు. కానీ అది సాధ్యం కాదు. హేతువాది అయిన కమల్‌హసన్ బీజేపీని నచ్చుకోడు. రజనీకాంత్ బీజేపీ సానుభూతిపరుడు, కమలంపై పలుమార్లు తన ఇష్టాన్ని ప్రదర్శించాడు. జయలలిత అవినీతి కేసుల ఊబిలో కూరుకుపోయినప్పుడు, పదేండ్ల క్రితం రజనీకాంత్‌కు అవకాశం వచ్చింది. అయితే అప్పటికే అతని కెరీర్ మంచి పీక్‌లో ఉండటం మూలంగా చేజేతులా వదులుకోవాల్సి వచ్చింది. అంత క్రమశిక్షణాపరుడు! ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే మంచి మనస్కుడు, మృదుభాషి, సంస్కారి, దయాళుడు అయినటువంటి రజనీకాంత్ రాజకీయాల్లో నెగ్గుకురాగలడా? అన్నదే ఇప్పుడు అందరి మనసులో నెలకొన్న ప్రశ్న. అయితే తన అభిమానులను నిరాశపరుచడం ఇష్టంలేక, కేవలం వాళ్లను సంతోషింపజేమాలని ఈ నిర్ణయం తీసుకున్నాడా అన్నది కూడా ఆలోచించదగినదే. మరో కోణమేమంటే దేశం మొత్తం నెగ్గుకొంటూ తన సామ్రాజ్యాన్ని విస్తరణ చేసుకొంటున్న బీజేపీ తమిళనాడుపై ఎప్పట్నుంచో కన్ను వేసింది. మొన్నటివరకు ఓపీఎస్, ఈపీఎస్ వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి అమ్మ లేని తమిళనాడులో తానే ఒక పెద్ద దిక్కుగా ఉంటూ తెరవెనుక నుంచి చక్రం తిప్పుతున్నది. మొన్న జయలలిత నియోజకవర్గం ఆర్కేనగర్ ఉపఎన్నికలో చేతులు కాల్చుకున్నది. ఇప్పు డు రజనీకాంత్‌ను ప్రాక్సీగా వాడుకొని, అతని ఇమేజ్, అభిమానులు, కీర్తి, మచ్చలేని వ్యకిత్వాన్ని ఉపయోగించుకుంటుందా అన్న సందేహం కూడా లేకపోలేదు.

జయలలిత ఒక్క ఓటుతో వాజపేయి ప్రభుత్వాన్ని పడగొట్టిన ఉక్కు మహిళ. ఆ ఉద్ధండురాలు ఉండగా కమలహసన్, కమలనాథులు తమిళనాట రాజకీయ రంగప్రవేశం చేయడం ఫలితం లేదు. కమల్‌హసన్‌కు రజనీకాంత్‌కు ఉన్నంత ఫ్యాన్ బేస్, ఫాలోయింగ్ లేదు. అతను కొంచెం చంచల స్వభావం, వివాదాస్పద వ్యాఖ్యలు చేసి అతని వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చుకున్నాడు. కమల్ నిర్ణయాన్ని తీవ్రంగా తీసుకొని ఆయనపై నమ్మకం పెట్టుకొనేంత పరిస్థితి లేదు. అతను ఒంటరి పోరాటం చేస్తే ఓట్లు చీల్చగలడు కానీ తమిళనాట తనదంటూ ముద్ర వెయ్యలేడు.

తమిళ ప్రజలలో ఒక విశేషం ఉన్నది. అనాదిగా హిందీ భాషను అంటే గిట్టదు. జాతీయపార్టీలను ఆమడ దూరంలో ఉంచుతున్నారు. వాళ్లలో వాళ్లు పోరాడుకున్నా అది రాష్ర్టానికే పరిమితం. తమ ఆత్మ గౌరవం మంటగలిస్తే సహించరు. అది కాంగ్రెస్ అయినా బీజేపీ అయినా ఒకటే. దశాబ్దాలుగా కరుణానిధి డీఎంకే, జయలలిత ఎఐఎడీఎంకే ద్రవిడ పార్టీలు, ఇండియా, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లాగా పోరాడి ఉత్కంఠరేపేవి.

తెలుగు రాజకీయాలతో పోలిస్తే తెలుగు ప్రజలకు ఇందిరా కాంగ్రెస్‌పై నిస్పృహ విసుగు కలిగిన రోజుల్లో ప్రత్యామ్నాయం కోసం చూస్తుండగా ఆపద్బాంధవుడిలా ఎన్టీఆర్ క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చి పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో అధికారం చేపట్టారు. అదే సీన్ పునరావృతం చేయొచ్చని చిరంజీవి 2009లో పార్టీ స్థాపించినా ప్రజలు పెద్దపీఠ వెయ్యలేదు. నటుడిగా ఎన్టీఆర్‌కున్న ప్రజాదరణ చిరంజీవికి కూడా ఉండేది. కాకపోతే రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, సమీకరణాలు మారిపోయాయి. తెలుగు ప్రజల ఆత్మగౌరవం అనే అస్త్రంతో ఎన్టీఆర్ రణరంగంలోకి దిగితే, సామాజికన్యాయం చిరంజీవి అమ్ములపొదిలో పెట్టుకున్నారు. పైగా తెలంగాణ ఉద్యమం అట్టుడికిపోతున్నది. మరోవైపు కుల, వర్గ రాజకీయ ఎత్తుగడలు. ఫలితంగా ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీని, చిరంజీవి రీమేక్ చేయగా బ్యాలట్ బాక్స్‌ల్లో తుస్సుమన్నది.

ద్రవిడ పార్టీల ఆవిర్భావం.ఈరోజు తమిళనాట ఉన్న ద్రవిడ పార్టీలన్నింటికీ మూలం ద్రావిడార్ కజగం (డీకే) 1891 లో సీఐథాస్‌డీఎంఎస్ఓ అనగా ద్రవిడ మహాజన్ సభ సమావేశ సంస్థను వ్యవస్థాపించి ద్రవిడ అనే బీజం నాటారు. 1912లో నటేస ముదలియార్ ద్వారా

> సామాజిక సంస్కరణలు, మహిళల సాధికారత కల్పించడం ప్రధాన లక్ష్యంగా, మూఢనమ్మకాలు, కుల, మత వ్యత్యాసాలను భూస్థాపితం చేయడమే ధ్యేయంగా ద్రవిడ పార్టీల ఉద్భావన జరిగింది. అయితే గడిచిన ఐదేండ్లలో కుల ఆధారిత పార్టీలు అసాధారణంగా పుట్టుకొస్తున్నాయి. అవి పీఎంకే, వీసీసీ, ఎంఎంకే, కేఎండీకే, కేజేకే, వీకేసీ, పీటీ వం టివి. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో హేమాహేమీలూ, డజన్ పార్టీలు, కొత్త పార్టీల రంగప్రవేశంతో, ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ అంత ప్రాముఖ్యం సంతరించుకున్నది. అయితే తమిళ తంబిల ఓటు ఎవరికో చూడాలి?

మద్రాస్ యునైటెడ్ లీగ్ పెట్టి 1914లో మద్రాస్ ద్రవిడియన్ అసోసియేషన్‌గా రూపాంతరం చెందింది. 1916లో టీఎం నాయర్, పీటీ చెట్టి ద్వారా సౌత్ ఇండియన్ లిబెరల్ ఫెడరేషన్ స్థాపించబడింది. క్రమేపీ అది జస్టిస్ పార్టీగా అవతరించింది. మద్రాస్ ద్రవిడియన్ అసోసియేషన్ కూడా దీనితో విలీనమైంది. 1938లో పెరియార్ ఈవీ రామస్వామి జస్టిన్ పార్టీకి అధ్యక్షుడయ్యారు. తమ ఆదర్శాలు, లక్ష్యాలు సాధించాలంటే జస్టిస్ పార్టీ పేరు ద్రావడార్ కజగం (డీకే) పార్టీగా మార్చి పార్టీ నియమావళిని తీర్చిదిద్దాలని తీర్మానించారు. 1949లో విబేధాలు వచ్చి సీఎన్ అన్నాదురై ద్రావడార్ కజగం నుంచి విడిపోయి డీఎంకే (ద్రావిడ మున్నేట్ర కజగం పార్టీకి జన్మనిచ్చారు. అన్నాదొరై మరణానంతరం కరుణానిధి ఆధిపత్యం నచ్చక, 1972లో ఎంజీ రామచంద్రన్ ఏడీఎంకే (అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం) స్థాపించారు. అయితే తమ మనుగడను కేవలం తమిళనాట కాకుండా జాతీయస్థాయికి పాకాలని 1978లో పార్టీ పేరును ఏఐఏడీఎంకే (అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం)గా మార్చారు. అలా జాతీయ రాజకీయాల్లో చేరి 1979లో చరణ్‌సింగ్ కేంద్ర క్యాబినెట్లో భాగమైంది. కేంద్ర క్యాబినెట్లో ప్రాతినిధ్యం వహించిన మొట్టమొదటి ప్రాంతీయ పార్టీగా చరిత్రకెక్కింది ఏఐఏడీఎంకే. 1994లో డీఎంకే నుంచి విడిపోయి వైకో ఎండీఎంకే అని వేరె కుంపటి పెట్టారు.


1977 నుంచి 1984ల మధ్య మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంజీఆర్, ఏఐఏడీఎంకేను విజయ పంథాకు తీసుకెళ్లి డీఎంకేకు పదేండ్లు మనుగడ లేకుండా చేశారు. జయలలిత మరణం తర్వాత తమిళనాట అనిశ్చితి ఏర్పడింది. ఇప్పట్లాగే ఎంజీఆర్ మరణించాక పార్టీ రెండువర్గాలుగా చీలిపోయినా ఎంజీఆర్ సతీమణి జానకి వర్గం బలహీనపడి తుదకు జయలలితనే వారసురాలుగా స్వీకరించారు. గత దశాబ్దాలుగా రెండు ద్రవిడ పార్టీలు రణరంగంలో పోరు జరుపుతూ అధికారం పంచుకుంటుండగా, ఇక్కడ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని విడుదల చేసినట్లు, తమిళ హీరో విజయకాంత్ డీఎండీకే పార్టీని మొదలెట్టారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 10 శాతం ఓట్లను పొందారు. రాష్ట్రంలో మూడవ అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయకాంత్ పార్టీ, డీఎంకే కంటే ఎక్కువ ఓట్లు సాధించగలిగింది. 2011లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు విజయకాంత్ పార్టీ ఏఐఏడీఎంకేతో చేతులు కలిపింది. పోటీచేసిన 41 సీట్లలో 29 స్థానాలను గెలుచుకున్నది. అంతేకాకుండా విజయకాంత్ తమిళనాడు శాసనసభలో ప్రతిపక్షనేతగా ఎన్నికయ్యారు. 2016 ఎన్నికల్లో ఆ పార్టీ టీఎంసీ-పీడబ్ల్యూఎఫ్‌లు ఒక సంకీర్ణ మిశ్రమగా పోటీచేసి మట్టిలో కొట్టుకుపోయింది. విజయకాంత్‌కు డిపాజిట్ కూడా దక్కలేదు. పార్టీ 6 శాతం కన్నా తక్కువ ఓట్లు రావడంతో ఎలక్షన్ కమిషన్ పార్టీ గుర్తింపును రద్దు చేసింది. మరోవైపు దశాబ్దం పాటు ఏఐఏడీఎంకే, డీఎంకే రెండింటి గూడుల్లో కాపురం చేసిన తర్వాత, సినీనటి రాధిక భర్త, నటుడు ఆర్.శరత్‌కుమార్ 2007లో తన సొంత రాజకీయ పార్టీ – ఆల్ ఇండియా సమతువా మక్కల్ కట్చిని ప్రారంభించి, 2011 అసెంబ్లీ సీట్లు కోసం ఏఐఏడీఎంకేతో పొత్తు పెట్టుకున్నారు. 2016 ఎన్నికల్లో శరత్‌కుమార్ ఓడిపోయి అతని పార్టీ నామరూపల్లేకుండా పోయింది.

సామాజిక సంస్కరణలు, మహిళల సాధికారత కల్పించడం ప్రధాన లక్ష్యంగా, మూఢ నమ్మకాలు, కుల, మత వ్యత్యాసాలను భూస్థాపితం చేయడమే ధ్యేయంగా ద్రవిడ పార్టీల ఉద్భావన జరిగింది. అయితే గడిచిన ఐదేండ్లలో కుల ఆధారిత పార్టీలు అసాధారణంగా పుట్టుకొస్తున్నాయి. అవి పీఎంకే, వీసీసీ, ఎంఎంకే, కేఎండీకే, కేజేకే, వీకేసీ, పీటీ వంటివి. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో హేమాహేమీలూ, డజన్ పార్టీలు, కొత్త పార్టీల రంగప్రవేశంతో, ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ అంత ప్రాముఖ్యం సంతరించుకున్నది. అయితే తమిళ తంబిల ఓటు ఎవరికో చూడాలి?

(వ్యాసకర్త: సీఈవో, ది థర్డ్ అంపైర్ మీడియా, ఫార్మర్ వైస్ ప్రెసిడెంట్ నేషనల్ జియోగ్రాఫిక్ ఇండియా ఫాక్స్)

విద్యుత్ విజయం

తెలంగాణం



గటిక విజయ్ కుమార్

అంతరిక్షాన్ని జయించిన విజ్ఞానమైనా సరే, అది అతి సామాన్యుడికి ఉపయోగపడినప్పుడే సార్థకత. విద్యుత్ సరఫరా విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ఈ విషయాన్నే స్పష్టపరుస్తున్నది. ఇంతకాలం కరెంటు సరిగా లేక కష్టాలనుభవించిన కర్షకులకే విద్యుత్ విజయంతో సాధించిన ప్రగతి ఫలం గరిష్ఠంగా దక్కాలనే ముఖ్యమంత్రి దృక్పథమే నేడు వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచితంగా కరెంటు సరఫరా కావడానికి కారణం. వ్యవసాయం కోసం చేసే ఖర్చు దండుగ అని, జీడీపీలో వ్యవసాయం వాటా చాలా స్వల్పమని భావించే ఈ రోజుల్లో వ్యవసాయదారుల కోసం ఎంతో వ్యయమయ్యే 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం కచ్చితంగా అసాధారణమైన విషయమే. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటివరకు కనీసం ఆలోచనకు కూడా రాని ఘనతను సాధించిన తెలంగాణ నేడు దేశానికి ఆదర్శంగా, రైతులకు భరోసాగా నిలబడింది. తెలంగాణ రాష్ట్రంలో కనీసం ఇండ్లకైనా కరెంటు ఇవ్వగలరా అనే అనుమానాలున్న నేపథ్యంలో కేవలం మూడున్నరేండ్లలో గృహాలకే కాదు, వ్యవసాయానికి, పరిశ్రమలకు, వాణిజ్య అవసరాలకు కూడా 24 గంటల కరెంటు సరఫరా చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమర్థతను చాటుతున్నది.

విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతి వల్ల రైతులకు ఎక్కువ ప్రయోజనం కలిగించాలని ముఖ్యమంత్రి మొదటినుంచి గట్టి నిర్ణయంతో ఉన్నారు. అందుకే రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్ అందించే కార్యక్రమం ప్రారంభించారు. ఇతరవర్గాల వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు కరెంటు వాడుకోగలుగుతున్నప్పుడు రైతులకు మాత్రమే ఎందుకు పరిమితి ఉండాలని ముఖ్యమంత్రి తననుతాను ప్రశ్నించుకున్నారు. దానికి సమాధానం కూడా తానే వెతికి ఇప్పుడు 24 గంటల పాటు కరెంటు అందిస్తున్నారు. ఎంత వ్యయమైనా సరే, రైతులకు 24 గంటలపాటు ఉచిత కరెంటు ఇవ్వాలనే నిర్ణయం వెనుక తెలంగాణ రైతులు దశాబ్దాల పాటు అనుభవించిన కష్టాల నేపథ్యం ఉన్నది.

సమైక్య పాలనలో ప్రాజెక్టులు నిర్మించలేదు. కాకతీయులు నిర్మించిన చెరువులు శిథిలమైపోయాయి. దీంతో తెలంగాణ రైతులు 23 లక్షల బోర్లు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు, చెరువుల కింద సాగయ్యే భూమి కన్నా బోర్లకింద సాగయ్యే భూమే ఎక్కు వ. అయితే ఆ బోర్లు పనిచేయడానికి కావాల్సినంత కరెంటు అందుబాటులో ఉండకపోయేది. 1995 నుంచి 2004వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు రైతులకు సబ్సిడీ కరెంటు ఇచ్చే విషయంలో వ్యతిరేక భావం తో ఉండేవారు. వ్యవసాయ కరెంటు చార్జీలు పెంచి బషీర్‌బాగ్ కాల్పుల కు, రైతుల్లో ఆగ్రహానికి కారణమయ్యారు. కేవలం అధికారంలోకి రావ డం కోసమే ఉచిత విద్యుత్ అనే హామీ ఇచ్చినవారు తర్వాత ఉచితం అయితే చేశారు. కానీ.. కావాల్సినంత కరెంటు మాత్రం ఇవ్వలేదు. 200 4, 2009 ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఏనాడూ హామీని అమలు చేయలేదు. రాష్ట్రంలో మరెవ్వరూ కరెంటు వాడనప్పుడు అర్ధరాత్రి వేళ రైతులకు ఇచ్చేవారు. ఎలాగూ ఉచితంగానే ఇస్తున్నాం కాబట్టి ఎప్పుడిచ్చి నా, ఎంతిచ్చినా, ఎలా ఇచ్చినా చచ్చినట్టు తీసుకోవాలనే భావ న నాటి పాలకుల్లో ఉండేది. దీని దుష్ఫలితం తెలంగాణ రైతాంగం అనుభవించింది. వ్యవసాయానికి రెండు, మూడు గంటల కరెంటు కూడా అం దక పంటలు ఎండిపోయినయి. అర్ధరాత్రి కరెంటు ఎన్నో ప్రాణాలను బలిగొన్నది. లో వోల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు నిరంతరం కాలిపోయేవి. రైతులు కాలిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పట్టుకొని పట్టణాల చుట్టూ తిరిగే దుర్గతి నాడు పట్టింది. రైతులు నష్టపోవడమే కాదు, రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు కూడా దారుణంగా తగ్గాయి.

ఈ పరిస్థితి నుంచి రైతులు శాశ్వతంగా విముక్తి కావాలనే లక్ష్యంతోనే కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించారు. ఉచితంగా కరెంటు ఇవ్వడం మాత్రమే కాదు. లో వోల్టేజీ సమస్యలేని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోని, మోటార్లు పేలిపోని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని నిర్ణయించారు. దాదాపు రెండేండ్ల కిందట వచ్చిన వ్యవసాయానికి 24 గం టల విద్యుత్ సరఫరా ఆలోచనను అమలుచేయడానికి విద్యుత్ సంస్థలు కూడా భారీ ఏర్పాట్లు చేశాయి. ఉచిత విద్యుత్ ఇవ్వడానికయ్యే కరెంటు ను సమకూర్చుకున్నది. తెలంగాణ విద్యుత్ సంస్థల ఉద్యోగులు నిజంగానే ఉద్యమస్ఫూర్తితో పనిచేశారు.

> రైతులు శాశ్వతంగా విముక్తి కావాలనే లక్ష్యంతోనే కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించారు. ఉచితంగా కరెంటు ఇవ్వడం మాత్రమే కాదు. లో వోల్టేజీ సమస్య లేని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోని, మోటార్లు పేలిపోని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని నిర్ణయించారు. దాదాపు రెండేండ్ల కిందట వచ్చిన వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఆలోచనను అమలుచేయడానికి విద్యుత్ సంస్థలు కూడా భారీ ఏర్పాట్లు చేశాయి.

ప్రాజెక్టులు నిర్మించడం వల్ల బ్యారేజీల వద్ద, రిజర్వాయర్లలో పుష్కలంగా నీటి లభ్యత ఉంటుంది. మిషన్ కాకతీయ వల్ల పూడికతీసిన చెరువుల్లో కూడా నీటి నిల్వ ఎక్కువైంది. ఫలితంగా రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి. ఈ జలాలను నూటికి నూరు పాళ్లు వాడుకోవడానికి అవసరమైన కరెంటు కూడా ఇప్పుడు అందుబాటులో ఉండటం వల్ల రైతులు నిబ్బరంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

ఏ విషయంలోనైతే తెలంగాణకు కష్టాలు తప్పవనే అంచనాలుండేవో అదే అంశంలో నేడు తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలువడం మాత్రం కచ్చితంగా కేసీఆర్ దార్శనికత వల్ల సాధించిన విజయమే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

మాజీ సైనికాధికారి ఉన్మాదం

రెండు గంటల్లో ఇనుపరాడ్‌తో కొట్టి ఆరుగురి హత్య



న్యూఢిల్లీ, జనవరి 2: హర్యానాలోని పల్వల్‌లో దారుణం చోటుచేసుకుంది. రెండుగంటల వ్యవధిలో ఆరు హత్యలు జరుగడం కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఈ హత్యలు జరిగాయి. ఉన్మాదిగా మారిన ఆర్మీ మాజీ అధికారి నరేశ్ ధాంకడ్ (45) అకారణంగా ఆరుగురు అమాయకుల్ని పొట్టనబెట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు ఇనుప రాడ్‌తో తిరుగాడటం సీసీ టీవీ దృశ్యాల్లో కనిపించింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ఓమాక్స్ సిటీ నివాసి నరేశ్ ధాంకడ్ ఉన్మాదిగా మారాడు. ఆగ్రా చౌక్ నుంచి మినార్‌గేట్ వరకు రెండుకిలోమీటర్ల పొడవునా పలుచోట్ల దొరికిన వారిని దొరికినట్లుగా ఇనుప రాడ్‌తో మోది హత్యచేశాడు. మంగళవారం తెల్లవారుజామున రెండుగంటల ప్రాంతంలో రోడ్డెక్కి రెండుగంటలపాటు వీధుల్లో తిరుగాడుతూ ఒక్కొక్కరిపైనా దాడిచేస్తూ వెళ్లాడు. వరుస హత్యల ఘటన పల్వల్ ప్రజలతోపాటు పోలీసులను నివ్వెరపరిచింది. ఎవరూ వీధుల్లోకి రావద్దని, ఇంట్లోనే ఉండాలని పోలీసులు ప్రజల్ని అప్రమత్తం చేశారు. పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించినప్పటికీ పొగమంచు కారణంగా ఏమీ కనబడలేదు. దవాఖాన నుంచి ఇనుపరాడ్‌తో నిందితుడు బయటకు వస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆయన ధరించిన దుస్తుల ఆధారంగా ఉదయం 6:30 గంటల ప్రాంతంలో స్థానిక ఆదర్శ సొసైటీ వద్ద నిందితుడిని పోలీసులు గుర్తించారు. ‘నరేశ్ ధాంకడ్ ఈ హత్యలకు పాల్పడినట్లుగా తేలింది. ఏడవ హత్యకు ప్రయత్నించగా.. బాధితుడు ఎదురుదాడి చేసి చితకబాదడంతో నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన మానసిక స్థితి సరిగ్గా లేదు’ అని జిల్లా ఎస్పీ సులోచన గజ్‌రాజ్ తెలిపారు. గాయాలతో స్పృహ కోల్పోయిన నరేశ్ ధాంకడ్‌కు దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. హర్యానా వ్యవసాయవిశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన నరేశ్ ధాంకడ్ యూనివర్సిటీ టాపర్ కూడా. 1999లో సైన్యంలో లెఫ్టినెంట్‌గా చేరిన ఆయన అనారోగ్య కారణాలతో 2003లో ఉద్యోగవిరమణ చేశారు.

హెచ్-1బీ వీసాపై మరిన్ని ఆంక్షలు

గ్రీన్‌కార్డు దరఖాస్తుదారుల వీసా రెన్యువల్ రద్దుకు ప్రతిపాదన

75,000 మంది భారతీయులపై ప్రభావం!

న్యూఢిల్లీ, జనవరి 2: అమెరికన్లకే ఉద్యోగాలు పేరిట ట్రంప్ ప్రభుత్వం హెచ్-1బీ వీసా నిబంధనల్లో తీసుకువస్తున్న సవరణలు భారతీయులకు సంకటంగా మారుతున్నాయి. ఇప్పటికే ఈ వీసాపై పలు నిబంధనలు విధించిన ట్రంప్ ప్రభుత్వానికి తాజాగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్) నుంచి మరో ప్రతిపాదన వచ్చింది. హెచ్-1బీ వీసా ద్వారా అమెరికాలో ఉద్యోగం చేస్తూ శాశ్వత నివాసానికి సంబంధించిన గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారిపై పలు ఆంక్షలు విధించాలని డీహెచ్‌ఎస్ ప్రతిపాదించింది. గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నవారి హెచ్-1బీ వీసా గడువు ముగిస్తే వారికి మళ్లీ వీసాను పొడిగించవద్దని డీహెచ్‌ఎస్ సూచించింది. దీంతో దాదాపు 50,000 నుంచి 75,000 మంది భారతీయులు తిరిగి స్వదేశం వెళ్లిపోవాల్సి రావచ్చు. ఈ ప్రతిపాదనను నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్, సర్వీసెస్ కంపెనీస్(నాస్కాం) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. డీహెచ్‌ఎస్ ప్రతిపాదన సాఫ్ట్‌వేర్ రంగంపై తీవ్రప్రభావం చూపనుందని అమెరికాలోని సెనెటర్ల దృష్టికి తీసుకెళ్లింది. హెచ్-1బీ వీసా బిల్లులో పలు ఆంక్షలు పొందుపర్చుతున్నారని, వీటిని తొలిగించేలా చూడాలని కోరింది. ప్రతి సంవత్సరం అమెరికా 85,000 హెచ్-1బీ వీసాలను మంజూరు చేస్తున్నది. ఈ వీసాలను ఎక్కువగా భారతీయ ఐటీ నిపుణులే పొందుతున్నారు. అత్యంత నైపుణ్యత గల వారికే హెచ్-1బీ వీసాలు జారీ చేస్తామని ఇప్పటికే అమెరికా ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

స్థాయీ సంఘానికి ఎన్‌ఎంసీ బిల్లు

సమ్మె విరమించిన వైద్యులు.. 12 గంటల దేశవ్యాప్త సమ్మెతో రోగుల ఇబ్బందులు



భువనేశ్వర్‌లో వైద్యవిద్యార్థుల ప్రదర్శన

న్యూఢిల్లీ, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 12 గంటల సమ్మెకు పిలుపునిచ్చిన భారత వైద్య మండలి (ఐఎంఏ) మంగళవారం విరమించుకున్నది. ఎన్‌ఎంసీ బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వైద్యులు విధుల్లో చేరారు. బడ్జెట్ సమావేశాల్లోపు స్థాయీ సంఘం తన నివేదికను అందజేయాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆదేశించారు. ఎన్‌ఎంసీ బిల్లును కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం లోకసభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యులతోపాటు వైద్యులు ఆందోళన వ్యక్తం చేయడంతో పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి అనంత్‌కుమార్ బిల్లును స్థాయీ సంఘానికి పంపుతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న భారత వైద్య మండలి (ఎంసీఐ) స్థానంలో నూతన కమిషన్‌ను ప్రవేశపెట్టడంతోపాటు హోమియోపతి, ఆయుర్వేద కోర్సులు చేసిన వైద్యులు కూడా బ్రిడ్జి కోర్సు పూర్తి చేస్తే అల్లోపతి వైద్యం చేసేందుకు అనుమతించడం బిల్లు ముఖ్య ఉద్దేశం. కాగా మంగళవారం దేశవ్యాప్తంగా ఎనిమిది గంటలపాటు వైద్యుల సమ్మె కొనసాగింది. ఇది రోగులపై తీవ్ర ప్రభావం చూపింది.

అట్టుడికిన మహారాష్ట్ర

‘భీమా కోరెగావ్ యుద్ధం’ ద్విశతవార్షికోత్సవాల నిర్వహణపై వివాదం

దళితులు, మితవాద సంస్థల మధ్య ఘర్షణ.. ముంబై, థాణే, సోలాపూర్, ఔరంగాబాద్ నగరాల్లో ఆందోళనలు

దళితుల ఆత్మగౌరవ యుద్ధం.. భీమా కోరెగావ్



1800 సంవత్సరం ప్రారంభంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ మరాఠా ప్రాంతాలపై తన ప్రాబల్యాన్ని విస్తరించడం ప్రారంభించి పుణెను కూడా హస్తగతం చేసుకున్నది. దీంతో పుణె కేంద్రంగా పరిపాలన సాగించిన పేష్వా బాజీరావ్-2 తప్పనిసరి పరిస్థితుల్లో సతారా ప్రాంతంలో తలదాచుకున్నాడు. పుణెను తిరిగి స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో ఆయన 1818లో 28వేల మంది మరాఠాల సైన్యంతో బయల్దేరాడు. అదే సమయంలో మహర్ దళితులతో కూడిన 800 మంది ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికుల పటాలం తమ ప్రధాన కేంద్రమైన పుణెవైపు వెళుతున్నది. అప్పుడు పేష్వాకు చెందిన దళాలు వీరిని చూశాయి. దీంతో బ్రిటిషు సైన్యం సమీపంలోని కోరెగావ్ గ్రామంలో తలదాచుకుంది. వీరితో పోరాడేందుకు పేష్వా రెండువేల మంది సైనికులను అక్కడికి పంపాడు. 1818 జనవరి ఒకటిన జరిగిన యుద్ధంలో ఈస్ట్ ఇండియా కంపెనీ మరాఠా సైన్యాన్ని తిప్పి కొట్టింది. ఈ పోరులో 200-300 మంది సైనికులను కంపెనీ కోల్పోగా, పేష్వా సైనికులు 500-600 మంది వరకు మరణించారు. విషయం తెలిసిన బాజీరావ్ పుణెపై దాడి చేయకుండానే వెనుదిరిగాడు. ఈ విజయానికి చిహ్నంగా ఈస్ట్ ఇండియా కంపెనీ కోరెగావ్‌లో ఒక స్థూపాన్ని నిర్మించింది. అగ్రకులాలుగా ఉన్న పేష్వాలు మహర్ దళితులను అంటరానివారుగా పరిగణించి అనేక అవమానాల పాల్జేసేవారు. కసితో రగిలిపోయిన మహర్లు.. పేష్వా సైన్యం సంఖ్యాబలం అధికంగా ఉన్నప్పటికీ యుద్ధంలో తెగించి పోరాడి విజయం సాధించారు. అప్పటినుంచి జనవరి 1న దళితులు విజయ్‌దివస్‌గా జరుపుకుంటున్నారు. మహర్ దళిత వర్గానికి చెందిన బాబాసాహెబ్ అంబేద్కర్ 1927లో కోరెగావ్ విజయ స్థూపాన్ని సందర్శించారు. అప్పటినుంచి దళితులకు అది యాత్రాస్థలంగా మారిపోయింది. ఏటా నూతన సంవత్సరపు తొలిరోజున దళితులు ఆ గ్రామానికి పోటెత్తుతారు.

ముంబై, జనవరి 2:





ఔరంగాబాద్‌లో ఆందోళనకారులపైకి బాష్పవాయు గోళాలను ప్రయోగిస్తున్న పోలీసులు

భీమా కోరెగావ్ యుద్ధం ద్విశత వార్షికోత్సవాల నిర్వహణపై దళితులు, కొన్ని మితవాద సంస్థల మధ్య మొదలైన ఘర్షణ హింసాత్మక రూపం దాల్చింది. పుణే, ముంబై, సోలాపూర్, థాణే, ఔరంగాబాద్ నగరాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అనుకూల, వ్యతిరేకవర్గాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. ఆందోళనకారులు ముంబైలో సబర్బన్ లోకల్ రైళ్లను అడ్డుకొని, పలుచోట్ల రోడ్లపై బైఠాయించారు. పలుచోట్ల దుకాణాలను మూయించి బస్సులను ధ్వంసం చేశారు, ఒక టీవీ చానెల్‌కు చెందిన పాత్రికేయునిపై దాడికి పాల్పడ్డారు. ఈ హింసాకాండపై న్యాయవిచారణకు ఆదేశించినట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. హింసను నివారించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ భారీపా బహుజన్ మహాసంఘ్ నాయకుడు, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ బుధవారం మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్‌కు 250 దళిత సంఘాలు మద్దతు తెలిపాయని చెప్పారు. 200 సంవత్సరాల క్రితం జరిగిన భీమా కోరేగావ్ యుద్ధంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన సైన్యం నాటి పేష్వా సైన్యాన్ని ఓడించింది. ఈస్ట్ ఇండియా కంపెనీ పక్షాన పోరాడిన మహర్ దళితులు, ప్రజాస్వామికవాదులు ప్రతియేటా జనవరి ఒకటో తేదీన ‘విజయ్ దివస్’ పేరిట ఈ విజయోత్సవాలను జరుపుకుంటున్నారు. కాగా పుణెలోని కొన్ని మితవాద గ్రూపులు ఈ ఉత్సవాల నిర్వహణను వ్యతిరేకిస్తున్నాయి. భీమా కోరెగావ్ గ్రామంలోని యుద్ధ స్మారక కేంద్రం వద్దకు దళితులు సోమవారం ప్రదర్శనగా వస్తుండగా కొందరు అల్లరిమూకలు వారిపై రాళ్లు రువ్వినట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఒకరు మరణించారని పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతంలో హింస చెలరేగిందని, అల్లరిమూకలు ఒక ఇంటితో సహా కొన్ని వాహనాలకు నిప్పు పెట్టి, కొన్నింటిని ధ్వంసం చేశారని చెప్పారు. సమీపంలోని పాబల్, షిక్రాపూర్ గ్రామాలకు కూడా ఘర్షణలు విస్తరించడతో పుణె-అహ్మద్‌నగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపివేశామని తెలిపారు. ప్రస్తుతానికి గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉందని అన్నారు. అయితే ఈ హింసాకాండ మంగళవారం ముంబైకి విస్తరించింది. ఆందోళనకారులు రైల్‌రోకో జరుపడంతో ముంబైలోని గోవండీ, చెంబూర్ మధ్య రైళ్లను నిలిపివేశారు. ములుండ్, చెంబూర్, భాండుప్, రమాబాయ్ అంబేద్కర్ నగర్, కుర్లా తదితర ప్రాంతాల్లో వారు రాస్తారోకో నిర్వహించారు. నగరంలో జరుగుతున్న ఆందోళనలపై కొంతమంది సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాపింపచేయడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. వదంతులు నమ్మవద్దని, వాటిని వ్యాపింపజేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు. మితవాద సంస్థల నేతలు మిలింద్ ఎక్‌బోటే, శంభాజీ భిడేపై కేసు నమోదు చేశారు. హింస ప్రజ్వరిల్లడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ అన్నారు.

ఆరెస్సెస్, బీజేపీ ఫాసిస్టు పోకడలకు నిదర్శనం: రాహుల్

పుణే, ముంబై నగరాల్లో జరిగిన ఘర్షణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బీజేపీ, ఆరెస్సెస్‌లపై విరుచుకుపడ్డారు. భారతీయ సమాజంలో దళితులు అట్టడుగునే ఉండాలన్నది ఆరెస్సెస్, బీజేపీల ఆలోచనా ధోరణి అని విమర్శించారు. ఉనా (గుజరాత్‌లో దళితులపై దాడి), రోహిత్ వేముల, ఇప్పుడు భీమా-కోరేగావ్ ఘటనలు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని దళితులకు రక్షణ కల్పించాలని కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథావలే డిమాండ్ చేశారు. భీమా కోరేగావ్‌ను సందర్శించేందుకు వెళుతున్న దళితులను, ప్రజాస్వామికవాదులను అడ్డుకున్నారని, వారిపై కొందరు రాళ్లు రువ్వారని మంత్రి ఒక ప్రకటనలో ఆరోపించారు. మరిన్ని అదనపు బలగాలను తరలించి అక్కడి దళితులకు రక్షణ కల్పించాలని అథావలే ముఖ్యమంత్రిని కోరారు.

హిందూ ఏక్తా అగాడీ వల్లే హింస: అంబేద్కర్

పుణెలో చెలరేగిన హింసకు హిందూ ఏక్తా అగాడీ సంస్థనే కారణమని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు. పుణెలో మరాఠాలకు, దళితులకు మధ్య ఎలాంటి ఘర్షణలు జరుగలేదని చెప్పారు. నిజానికి భీమా కోరెగావ్ ద్విశతవార్షికోత్సవాలను శంభాజీ బ్రిగేడ్ అనే మరాఠా సంస్థ నిర్వహించిందని తెలిపారు. మిలింద్ ఎక్‌బోటే, శంభాజీ భిడే నేతృత్వంలోని హిందూ ఏక్తా అగాడీ, శివ్‌రాజ్ ప్రతిష్ఠాన్ సంస్థల కారణంగానే ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని, తదనంతరం హింస చెలరేగిందని చెప్పారు. పేష్వాలకు వారసులైన అఖిల భారతీయ హిందూ సభ తొలుత తమ ఉత్సవాలను వ్యతిరేకించిందని, అయితే తాము వారితో మాట్లాడిన మీదట వారు సానుకూలంగా స్పందించారని అంబేద్కర్ వివరించారు. ఈ హింసపై హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలో విచారణ జరుపాలని ఆయన డిమాండ్ చేశారు.



ముంబైలో లోకల్ రైలును అడ్డుకున్న ఆందోళనకారులు



థాణేలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు



పుణెలో ఆందోళనకారుల చేతుల్లో దహనమైన వాహనాలు



ఔరంగాబాద్ ఘర్షణల్లో ఓ ఉద్రిక్త దృశ్యం



ముంబైలో దళితుల నిరసన ప్రదర్శన

జనౌషధి కేంద్రాల్లో ఔషధాలు 96% చౌక

న్యూఢిల్లీ, జనవరి 2: బహిరంగ మార్కెట్‌లో ఔషధాల ధరలతో పోలిస్తే ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పీఎంబీజేపీ) కేంద్రాల్లో విక్రయిస్తున్న జెనెరిక్ ఔషధాల ధరలు 96 శాతం చౌక అని కేంద్రం తెలిపింది. మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి మంషుఖ్ ఎల్ మాండవీయ సభ్యుల ప్రశ్నకు సమాధానమిచ్చారు. సాధారణంగానే బ్రాండెడ్ జెనెరిక్ ఔషధాల ధరలు ఎక్కువగానే ఉంటాయని తెలిపారు. ఉదాహరణకు జెమిసిటబైన్ 100 మి.గ్రా ఇంజెక్షన్ ధర మార్కెట్‌లో రూ.6412.04 అయితే పీఎంబీజేపీ కేంద్రాల్లో కేవలం రూ.631.21లకే లభిస్తుందన్నారు.

మావోయిస్టులకు క్షమాభిక్ష ప్రతిపాదనేదీ లేదు: కేంద్రమంత్రి కిరెన్ రిజిజు

మావోయిస్టులకు, జమ్ముకశ్మీర్ మిలిటెంట్లకు క్షమాభిక్ష ప్రసాదించే ప్రణాళికేదీ తమ వద్ద లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని మావోయిస్టులు, జమ్ముకశ్మీర్‌తోపాటు ఈశాన్య భారతంలో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న మిలిటెంట్లను అదుపులోకి తెచ్చేందుకు బహుళ అంచెల విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. మిలిటెంట్లతో రాజ్యాంగ పరిధిలో చర్చలు జరిపేందుకు సిద్ధమని చెప్పారు

జీరో అవర్ ఎజెండా పూర్తిలో రాజ్యసభ రికార్డు



రాజ్యసభలో జీరో అవర్ ఎజెండా అంశాలన్నీ పూర్తి కావడం రికార్డేనని చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు తెలిపారు. మంగళవారం జీరో అవర్ అంశాలు, ప్రత్యేక ప్రస్తావనలు ముగిసిన తర్వాత ఆయన మాట్లాడుతూ ‘ఈ రోజు రాజ్యసభ చరిత్ర సృష్టించింది. తొలిసారి జీరో అవర్ అంశాలు, ప్రత్యేక ప్రస్తావనలపై చర్చ ముగియడంతో సభ రికార్డు నెలకొల్పింది‘ అని అన్నారు. వెంకయ్యనాయుడు ఈ ప్రకటన చేస్తున్నప్పుడు సభ్యులంతా బల్లలు చరిచి సంతోషం వ్యక్తం చేశారు.

డిమాండ్ తగ్గింపునకు యూరియా బస్తా పరిమాణం కుదింపు

యూరియా వాడకాన్ని 10 శాతానికి తగ్గించేందుకు 50 కిలోల బస్తాలను 45 కిలోలకు తగ్గిస్తున్నట్లు కేంద్ర రసాయనాలు, ఫెర్టిలైజర్స్ శాఖ సహాయ మంత్రి ఇందర్‌జిత్ రావు తెలిపారు. దీనిపై గత సెప్టెంబర్‌లోనే క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. ఆరు నెలల్లోగా 45 కిలోల యూరియా బస్తాల తయారీకి ప్రభుత్వం గడువు పెట్టిందని చెప్పారు.

జుట్టు ఊడుతున్నదని టెకీ ఆత్మహత్య

మధురై: జుట్టు ఊడుతున్నందున పెండ్లి కాదేమోననే మనస్తాపంతో యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఒకరు తమిళనాడులోని మధురైలో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. జైహింద్‌పురానికి చెందిన ఆర్ మిథున్‌రాజ్ (27) బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. మిథున్ తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి ఆయనను పెంచి పెద్దచేసింది. తల్లి తనకు పెండ్లి సంబంధాలు చూస్తున్న నేపథ్యంలో జుట్టు ఊడిపోవడాన్ని జీర్ణించుకోలేక మిథున్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్స్ వస్తున్నాయ్

దాతలకు ఎస్బీఐ ద్వారా జారీ.. 2014కు పూర్వం ఇచ్చిన రుణాల్లోనే మొండిబకాయిలు

ఒకే రకమైన పన్ను రేటు సాధ్యం కాదు.. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 2: రాజకీయ పార్టీల నిధుల సేకరణ అంశంపై గత బడ్జెట్‌లో కీలక ప్రతిపాదన చేసిన కేంద్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా తొలి అడుగువేసింది. దాతలు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు వీలుగా ఎలక్టోరల్ బాండ్స్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం పార్లమెంట్‌లో ప్రకటించారు. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) కింద అన్ని రకాల వస్తువులకు ఒకే రకమైన పన్ను రేటును విధించడం సాధ్యంకాదని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్స్‌ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ద్వారా జారీచేస్తారని, జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఈ బాండ్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆ నాలుగు నెలల్లో నెలకు పదేసి రోజుల చొప్పున ఈ బాండ్లు లభ్యమవుతాయని వివరించారు. వీటి కాలపరిమితి పదిహేను రోజులు ఉంటుందని తెలిపారు. బాండ్లను స్వీకరించే రాజకీయపార్టీలు వీటిని తమ అధీకృత బ్యాంక్ అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఆయా బాండ్ల మీద దాతల పేర్లు ఉండవు. ఒక్కొక్క బాండ్ కనీస విలువ రూ.1,000 ఉంటుంది. రూ.వెయ్యి, పదివేలు, లక్ష, పదిలక్షలు, కోటి రూపాయల విలువైన బాండ్లు లభిస్తాయి. ఈ బాండ్లకు వడ్డీ చెల్లించరు. రాజకీయపార్టీలకు విరాళాలు ఇవ్వదల్చుకున్న వ్యక్తులు లేదా సంస్థలు ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు.

రూ. 7.33 లక్షల కోట్లకు చేరిన మొండిపద్దులు

2014 ఏప్రిల్‌కు పూర్వం ఇచ్చిన రుణాలే మొండిబకాయిలుగా మారాయని అరుణ్‌జైట్లీ తెలిపారు. రిస్క్‌ను అంచనావేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటం, సరైన సెక్యూరిటీలు లేకుండా, విచ్చలవిడిగా రుణాలివ్వటమే మొండిబకాయిలతోపాటు ఉద్దేశపూర్వక ఎగవేతదారులు పెరుగటానికి కారణమని చెప్పారు. 2014 మార్చి 31 నాటికి రూ.2.16 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంకుల మొండిబకాయిలు 2017 సెప్టెంబర్ నాటికి రూ.7.33 లక్షల కోట్లకు చేరినట్టు ఆయన వెల్లడించారు.

ఎక్కువ పన్ను పరిధిలో విలాస వస్తువులు..

విలాసవంతమైన వస్తువులను ఎక్కువ పన్ను పరిధిలో ఉంచామని జైట్లీ తెలిపారు. ఇప్పటికే కొన్ని వస్తువులను 28శాతం పన్ను పరిధి నుంచి 18శాతం పన్ను పరిధిలోకి మార్చామని, ఇలాంటి మార్పుల ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు.

ప్రతిపక్షాలు సహకరించాలి

ట్రిపుల్ తలాక్ బిల్లుపై మంత్రి విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో కూడా ఆమోదం పొందేలా ప్రతిపక్షాలు సహకరించాలని పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నామని, ఈ సందర్భంగా సవరణలు కోరుతూ కాంగ్రెస్ ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందే విషయంలో ప్రతిపక్షాలతో చర్చిస్తున్నామని తెలిపారు. మరోవైపు ఈ బిల్లు విషయంలో ఎలాంటి వైఖరిని ప్రదర్శించాలన్నదానిపై కాంగ్రెస్ రాజ్యసభాపక్ష నేత గులాం నబీ ఆజాద్ ప్రతిపక్షపార్టీల నాయకులతో మంగళవారం చర్చించారు. రాజ్యసభలో బిల్లు చర్చకురాగానే దానిని సెలెక్ట్ కమిటీకి పంపాలని, పలు సవరణలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసే అవకాశమున్నట్లు తెలుస్తున్నది.

ఉత్తుత్తి బాంబు బెదిరింపు

ముంబైలో విమాన ప్రయాణికుడి అరెస్ట్

ముంబై: విమానంలో బాంబు పేలిందని బెదిరించిన ఒక ప్రయాణికుడిని ముంబై పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఒక సంస్థలో సీఈవోగా ఉన్న వినోద్ మూర్జాని(45) ఆదివారం ముంబై నుంచి ఢిల్లీ మీదుగా రోమ్‌కు కుటుంబంతో కలిసి వెళ్లాలనుకున్నారు. అయితే విమానాలు ఆ రోజు వేళకు నడువకపోవడంతో విసిగిపోయిన ఆయన ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి ఫోన్ చేసి ఓ విమానంలో బాంబు పేలిందని చెప్పి కాల్ కట్‌చేశాడు. చివరికి అది ఉత్తి బెదిరింపు కాల్ అని గుర్తించిన విమానాశ్రయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినోద్‌ను పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు. ‘బామ్-డెల్ స్టేటస్’ (ముంబై నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానం పరిస్థితి) గురించి మాత్రమే వినోద్ అడిగారని, టెలిఫోన్ ఆపరేటర్ పొరపాటుగా అర్థం చేసుకున్నారని ఆయన న్యాయవాది వాదించారు. రూ.15వేల పూచీకత్తుపై కోర్టు వినోద్‌కు బెయిల్ మంజూరు చేసింది.

అనిశ్చితి వెనుక శత్రుదేశాల కుట్ర

ఇరాన్ అత్యున్నత నేత అయతుల్లా-అలీ- ఖమేనీ ఆరోపణ

టెహ్రాన్: తమ దేశంలో అనిశ్చితి సృష్టించేందుకు శత్రువులు కుట్ర పన్నారని ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా-అలీ-ఖమేనీ ఆరోపించారు. ‘శత్రువులు మనదేశంలో సమస్యలు సృష్టించేందుకు ఆయుధాలు, డబ్బు, విధానాలు, భద్రతా సర్వీసులతోపాటు అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నారు’ అని చెప్పారు. మంగళవారం ఆయన ప్రభుత్వ టీవీ చానెల్ ద్వారా జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. తమ దేశంలో నిరసన ప్రదర్శనల వెనుక అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా ఉన్నాయని ఇరాన్ అధికార వర్గాలు చెప్తున్నాయి. వరుసగా ఐదో రోజు ఇరాన్‌లోని వివిధ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇస్ఫాహన్ రాష్ట్రం ఖాహ్దెరిజాన్‌లోని పోలీస్‌స్టేషన్‌పై దాడి ఘటనలో ఆరుగురు ఆందోళనకారులు మరణించారు. మాష్హాద్ నగరంలో జరిగిన నిరసన ప్రదర్శనల్లో ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య 21 మందికి చేరుకున్నది.

పాక్‌కు ఆర్థికసాయం నిలిపేసిన అమెరికా

వాషింగ్టన్, జనవరి 2: పాకిస్థాన్‌కు అందజేస్తున్న 25.5 కోట్ల డాలర్ల మిలిటరీ ఆర్థికసహాయాన్ని నిలిపేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని శ్వేతసౌధ వర్గాలు ధ్రువీకరించాయి. తన భూభాగంపై పేట్రేగుతున్న ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరిపైనే ఆర్థికసహాయం అంశం ఆధారపడి ఉంటుందని అధికారవర్గాలు వెల్లడించాయి.


ట్రంప్ వ్యాఖ్యలపై పాక్ నిరసన: ‘పాకిస్థాన్ అబద్ధాల కోరు, మోసకారి’ అని దుమ్మెత్తిపోసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై పాక్ ప్రతిస్పందించింది. తమ దేశంలోని అమెరికా రాయబారి డేవిడ్ హాలేను సోమవారం రాత్రి పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. ట్రంప్ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని విదేశాంగశాఖ కార్యదర్శి తెహ్మినా జాంజువా కోరారు. పాక్ అధికారులతో హాలే సమావేశమయ్యారని అమెరికా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి మంగళవారం ధ్రువీకరించారు.

పాక్‌ను వెనుకేసుకొచ్చిన చైనా

ఉగ్రవాదంపై అద్భుతంగా పోరాడుతున్నదని కితాబు

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామనే పేరుతో నిధులు తీసుకొని తమను పాకిస్థాన్ మోసం చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మండిపడ్డ మరుసటి రోజే.. పాక్‌ను చైనా వెనుకేసుకొచ్చింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రపంచం గుర్తించాలని చైనా పేర్కొన్నది. ‘ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు పాకిస్థాన్ అపారంగా ప్రయత్నిస్తున్నది. త్యాగాలు చేస్తున్నది. దీన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించాలి’ అని చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి జెంగ్ షాంగ్ మంగళవారం ఓ అధికారిక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాక్ పోరాటం చేస్తున్నందుకు చైనా సంతోషంగా ఉన్నదని చెప్పారు. చైనా, పాకిస్థాన్‌లు మంచి భాగస్వాములని, రెండు దేశాలకు ప్రయోజనం కలిగేలా మరింత సాయం ఇచ్చిపుచ్చుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో కలిసి పనిచేస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలపై షాంగ్ స్పందిస్తూ.. మూడు దేశాలు (చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్) భౌగోళికపరంగానే కాకుండా, ఒకేరకమైన అభిరుచులు కూడా కలిగి ఉన్నాయని చెప్పారు.

మధుకోడాకు జైలుశిక్షపై ఢిల్లీ హైకోర్టు స్టే



న్యూఢిల్లీ: బొగ్గు కుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ సీఎం మధుకోడాపై దిగువ న్యాయస్థానం విధించిన మూడేండ్ల జైలుశిక్ష, రూ.25 లక్షల జరిమానాపై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. తనకు విధించిన శిక్షను సవాల్ చేస్తూ మధుకోడా దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సీబీఐని జస్టిస్ అను మల్హోత్రా సారథ్యంలోని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22 వరకు వాయిదా వేసిన న్యాయస్థానం.. అంత వరకు మధుకోడాకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. దేశం విడిచి వెళ్లొద్దని మధుకోడాను ఆదేశించింది.

కౌన్సెలింగ్‌కు రాకుంటే వారంటు.. అరెస్ట్

- ట్రాఫిక్ అదనపు డీసీపీ అమర్‌కాంత్‌రెడ్డి


ట్రాఫిక్ అదనపు డీసీపీ అమర్‌కాంత్‌రెడ్డి

బేగంపేట: ప్రమాదరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకే తాము డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపట్టామని ట్రాఫిక్ అదనపు డీసీపీ అమర్‌కాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతూ 2,500 మంది పట్టుబడ్డారు. వీరందరికీ శుక్రవారం వారకు దశలవారీగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 250 మందికి మంగళవారం బేగంపేట ట్రాఫిక్ కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. దీనికి టీవీ యాంకర్ ప్రదీప్ హాజరుకాలేదు. ఆయన శుక్రవారం వరకు ఏ రోజైనా హాజరుకావొచ్చని పోలీసులు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరు కానీ వారిని కోర్టులో చార్జిషీట్ వేసి వారెంట్‌తో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ అదనపు డీసీపీ వివరించారు.

తెలుగు వర్సిటీ దూరవిద్య షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలుగు విశ్వవిద్యాలయ దూరవిద్యా కేంద్రంలో వివిధ కోర్సులను అభ్యసించడానికి ప్రవేశ దరఖాస్తు జనవరి 20 చివరి తేదీ అని వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుము రూ.300తో ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2017-18తోపాటు గత విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల షెడ్యుల్‌ను విడుదల చేశారు. కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆగస్టు 2 నుంచి 11వ తేదీవరకు తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులకు 2019 జనవరి 2 నుంచి 11 వరకు, ఎంఏలో టూరిజం, ఈఎల్‌టీ, సంగీత విశారద కోర్సులో రెండు నుంచి ఆరేండ్ల కాలవ్యవధి కోర్సులకు జనవరి 7 నుంచి 11 వరకు తరగతులు ఉంటాయన్నారు. మిగిలిన సంవత్సరాల కోర్సులకు ఏటా జనవరిలో అనుసంధాన తరగతులు నిర్వహిస్తామన్నారు. మెదటి సంవత్సరం జూన్ 30, రెండో సంవత్సరం జూన్ 31 వరకు ఎంసీజే అసైన్‌మెంట్స్, జూన్ 30 వరకు సీసీఎంటీ రెస్పాన్స్ పత్రాలు, జూలై 31కి టెలివిజన్ డాక్యుమెంటరీ సీడీ, 2019 జూలై 31న ఎంఏ జ్యోతిషం రెండో సంవత్సరం పేపర్-5 ప్రాజెక్టులను సమర్పించాలని ప్రకటించారు. 2018 అక్టోబర్, నవంబర్ మధ్య కాలంలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

మల్కాజిగిరిలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయండి

- పార్లమెంట్‌లో ఎంపీ మల్లారెడ్డి



కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సైనిక్‌స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ చామకూర మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో సైనిక్ స్కూల్ అంశాన్ని ఎంపీ ప్రస్తావించారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమేర్పడిన తర్వాత ఈ ప్రాంత వాసులకు సైనిక్ స్కూల్ లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలోని కోరుకొండ, చిత్తూరు జిల్లాలోని కలికిరిలో ఉన్న రెండు సైనిక్ స్కూళ్లు ఏపీ రాష్ట్రంలో ఉన్నందున తెలంగాణకు ప్రత్యేక సైనిక్‌స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్డీఏ)లో చేరేందుకు సైనిక్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక్ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతమున్న ఏపీలోని రెండు స్కూళ్లలో చేరే విషయంలో తెలంగాణ విద్యార్థులు నాన్-లోకల్ క్యాడర్‌లోకి వస్తున్నారని, దీంతో తెలంగాణ విద్యార్థులు సైనిక్ స్కూళ్లలో చదువుకునే అవకాశం లేకుండా పోతున్నదన్నారు. కేంద్రం తక్షణమే మేడ్చల్ జిల్లాలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎంపీ మల్లారెడ్డి పార్లమెంట్ స్థాయిలో 'మీరు వేయాల్సిన ప్రశ్నలేమైనా ఉంటే నాతో పంచుకోండి.. మీ తరపున ఆ ప్రశ్నను నేనడుగుతా' అని ఎంపీ సూచిస్తూ లేఖలు రాశారు. 12 వేల ప్రశ్నలు ఎంపీ దృష్టికి రాగా, వాటిలో 37 అత్యుత్తమ ప్రశ్నలను ఎంపిక చేశారు. సీఎంఆర్ పాఠశాలకు చెందిన సీహెచ్ వీఎస్డీ కల్యాణ్‌రామ్ అనే విద్యార్థి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మనకు సైనిక్ స్కూల్ లేదని, కోరుకొండ, కలికిరిలో ఉన్న స్కూళ్లలో ఈ ప్రాంత విద్యార్థులు నాన్-లోకల్ కింద చేరాల్సి వస్తున్నదని.. ఈ ప్రశ్నను పార్లమెంట్‌లో లేవనెత్తి, మల్కాజిగిరిలో సైనిక్‌స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంపీ మంగళవారం పార్లమెంట్‌లో కల్యాణ్‌రామ్ తరపున ప్రశ్న అడిగారు.

అభివృద్ధికి హెచ్‌ఎండీఏ పట్టం

ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో మహర్దశ.. సంస్థ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

పట్టణాలు, గ్రామాల్లో వడివడిగా రహదారి విస్తరణ, డ్రైనేజీ, లైట్ల బిగింపు పనులు


సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు, విస్తరిస్తున్న రోడ్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పరిధిలో అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. సంస్థ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్న కమిషనర్ చిరంజీవులు ఏడు జిల్లాల పరిధిలోని ప్రజా అవసరాలకు తగ్గట్టుగా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. అనధికారిక లే అవుట్లను క్రమబద్ధీకరించుకొనేందుకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. సంస్థ పరిధిలో 1.71 లక్షల దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ఇప్పటి వరకు 80శాతానికి పైగా దరఖాస్తులకు పరిష్కారం చూపారు. తద్వారా సంస్థకు రూ.500 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నిధులను శివారు గ్రామ పంచాయతీల అభివృద్ధికి వెచ్చించాలని నిర్ణయించారు. రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక వసతులకుగాను ఆయా మున్సిపాలిటీలకు రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులను పట్టాలెక్కిస్తున్నారు. ఇందులో భాగంగానే సంగారెడ్డి మున్సిపాలిటీలో రూ.10 కోట్లు, పటాన్‌చెరులో రూ.3 కోట్లతో రహదారుల విస్తరణ, డ్రైనేజీ వసతుల పనులు చేపట్టారు. గత వేసవిలో మొదలు పెట్టిన ఈ పనులను ఇప్పటి వరకు దాదాపు 80శాతం మేర పూర్తి చేసినట్టు ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. భువనగిరి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనుల కోసం దరఖాస్తులు రావడంతో కమిషనర్ చిరంజీవులు రూ.15 కోట్లు కేటాయించారు. రోడ్లు, డ్రైనేజీ, సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటు పనులను పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సంస్థ పరిధిలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా చర్యలు ముమ్మరం చేశారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎల్‌ఆర్‌ఎస్ నిధులను సంస్థ పరిధిలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధికి వెచ్చిస్తుండటం విశేషం.

ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో చేపడుతున్న పనుల వివరాలు

ప్రాంతం	పథకం వ్యయం(రూ.ల్లో)	పురోగతి
సంగారెడ్డి రహదారి విస్తరణ, డ్రైనేజీ, ఫుట్‌పాత్, సెంట్రల్ మీడియన్	9,95,00,000	75శాతం పూర్తి
సంగారెడ్డి గ్రానైట్ రాయితో సెంట్రల్ మీడియన్ పనులు-రీచ్-1	1,60,00,000	70శాతం పూర్తి
సంగారెడ్డి గ్రానైట్ రాయితో సెంట్రల్ మీడియన్ పనులు-రీచ్-2	1,60,00,000	65శాతం పూర్తి
సంగారెడ్డి ప్రధాన రహదారిలో స్ట్రీట్ లైట్ల ఏర్పాటు	1,95,00,000	80శాతం పూర్తి
సంగారెడ్డి నందిగామ, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు	71,60,000	30శాతం పూర్తి
పటాన్‌చెరు, అమీన్‌పూర్, రహదారి విస్తరణ పనులు	3,55,95,000	55శాతం పూర్తి
భువనగిరి పట్టణం, సెంట్రల్ మీడియన్, లైటింగ్ పనులు (44/300కి.మీ నుంచి 48/300 కి.మీ)	4,20,00,000	టెండర్ల దశలో..
రంగారెడ్డి, తొర్రూర్ వై జంక్షన్ నుంచి ఇంజాపూర్ క్రాస్ రోడ్ బీటీ రోడ్	2,95,00,000	టెండర్ల దశలో..

మహిళా చైతన్యానికి ఫిజూల్ ఖర్చ్

- బల్దియా సరికొత్త సామాజిక ఉద్యమం!
- దక్షిణ కొరియా, గుజరాత్ స్ఫూర్తిగా అనవసర ఆడంబరాలను ఆపడమే లక్ష్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అనవసర ఆడంబరాలకుపోయి అప్పులపాలవుతున్న పేదలను చైతన్యపర్చేందుకు జీహెచ్‌ఎంసీ సరికొత్త ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. 'ఫిజూల్ ఖర్చ్' పేరుతో నాలుగున్నర లక్షల కుటుంబాలను అనుత్పాదక వ్యయాలనుంచి దూరంగా ఉంచాలని సంకల్పించింది. ఇలా సామాజికంగా చైతన్యం కల్పించడం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని బల్దియా కమిషనర్ జనార్దన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. జీహెచ్‌ఎంసీలో 45 వేల మహిళా స్వయం సహాయక సంఘాలున్నాయి. ఒక్కో గ్రూపులో పది మంది సభ్యుల చొప్పున నాలుగున్నర లక్షల మంది మహిళలు ఉన్నారు. సంప్రదాయాల ప్రకారం వేడుకలు చేసుకోవడానికి చాలామంది స్థోమతకు మించి ఆడంబరాల కోసం అప్పులు చేస్తున్నారు. నెలనెలా పొదుపుచేసుకున్న సొమ్మే కాకుండా అప్పుచేసిన సొమ్ముకూడా వేడుకలకు ఒక్కరోజులో ఆవిరైపోతుంది. ఇలా నిత్యం ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటూ బతుకు వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేరినవారంతా పేద, మధ్యతరగతికి చెందినవారే ఉన్నారు. స్వచ్ఛ కార్యక్రమాలుసహా ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ చేపట్టే వివిధ సామాజిక అంశాల్లో వీరిపాత్ర ప్రముఖంగా ఉంటుంది. జీహెచ్‌ఎంసీ పేదరిక నిర్మూలన విభాగం నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఈ మహిళలు ఆర్థికంగా ఎదుగకపోవడానికి ప్రధాన కారణం అనుత్పాదక వ్యయమే. దీన్ని దృష్టిలో ఉంచుకొని జీహెచ్‌ఎంసీ కమిషనర్ 'ఫిజూల్ ఖర్చ్' పేరుతో సరికొత్త ఉద్యమానికి తెరలేపారు. ఇందులో భాగంగా యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల్లో చైతన్యం నింపేందుకు యూసీడీ ఆధ్వర్యంలో నాటకాలు వంటి కళారూపాలను ప్రదర్శించనున్నట్టు కమిషనర్ తెలిపారు. దక్షిణ కొరియాలో 1972లో, గుజరాత్‌లో సైతం 'సేవా' అనే సంస్థ ఆధ్వర్యంలో అనుత్పాదక వ్యయాన్ని నిర్మూలించేందుకు పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని, అదే తరహాలో తాము కూడా 'ఫిజూల్ ఖర్చ్' ఉద్యమాన్ని చేపడుతామన్నారు.

మార్పుతెస్తాం: కమిషనర్ జనార్దన్‌రెడ్డి



రూ.12 వేల వేతనం వచ్చే సగటు వ్యక్తి పిల్లల పుట్టినరోజు వేడుకకో, బారసాలకో రూ.ఐదు వడ్డీపై రూ.50 వేలు అప్పుచేస్తారు. నెలకు రూ.2,500 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. దీంతో తీసుకున్న అప్పుకు వడ్డీపోగా అతని ఆదాయం నెలకు రూ.9,500 పడిపోతుంది. అప్పు తీర్చేందుకు రెండేండ్లు పడుతుంది. ఈలోగా మరో ఫంక్షన్ రానేవస్తుంది. మరోసారి అప్పు చేస్తారు. వేతనంలో మార్పురాకపోగా, ఖర్చు పెరిగి ఆ కుటుంబం నిత్యం అప్పుల్లోనే ఉంటుంది. దీంతో అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి, మానసిక ఒత్తిడి పెరిగి అనర్థాలు జరిగే ఆస్కారం ఉంటుంది. దాదాపు రెండు దశాబ్దాల కిందట సిరిసిల్లలో జరిగిన చేనేత కార్మికుల వరుస ఆత్మహత్యలకు అప్పుల బాధలే ప్రధాన కారణం. వీటిని దృష్టిలో ఉంచుకొని నగరంలో మహిళా స్వయం సహాయక సంఘాలను చైతన్య పర్చేందుకు ఈ 'ఫిజూల్ ఖర్చ్' చేపడుతున్నాం.


హైరేంజ్ రికార్డ్స్ పత్రాన్ని ఈఎంఈ కమాండెంట్ అజయ్‌మాలిక్‌కు అందజేస్తున్న పర్యాటకశాఖ ఎండీ క్రిస్టీనా

ఆర్మీ ఒకటో ఈఎంఈకి రెండు హైరేంజ్ ప్రపంచ రికార్డులు

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: సికింద్రాబాద్‌లోని ఆర్మీ ఒకటో ఈఎంఈ సెంటర్‌కు ప్రపంచ రికార్డులో చోటుదక్కింది. అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2305 మంది సైనికులు 30 నిమిషాలపాటు చేసిన నిరవధిక వ్యాయామానికి హైరేంజ్ ప్రపంచ రికార్డ్స్‌లో చోటు దక్కినట్టు రక్షణశాఖ పౌర సంబంధాలశాఖ అధికారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరానికి చెందిన హైరేంజ్ ప్రపంచ రికార్డ్స్ సీఈవో సుమన్ పల్లె ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఈఎంఈలో జరిగిన ఓ కార్యక్రమంలో రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాన్ని ఈఎంఈ కమాండెంట్ బ్రిగేడియర్ అజయ్‌మాలిక్, కల్నల్ సునీల్ అనియల్‌కు పర్యాటకశాఖ ఎండీ క్రిస్టీనా, వైద్యారోగ్యశాఖ ఆదనపు కార్యదర్శి సోనిబాలదేవి అందజేశారు. ఆర్మీ డేను పురస్కరించుకొని తలసేమియా, లుకేమియా బాధితుల కోసం గతేడాది ఈఎంఈలో మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సైనికులు, వారి కుటుంబసభ్యులు 2,795 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ఈ రక్తదాన శిబిరానికి సైతం హైరేంజ్ ప్రపంచ రికార్డ్స్‌లో చోటు దక్కింది.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
బుధవారం 3 జనవరి 2018

WWW. NTNEWS.COM

వారివి కడుపు కోసం పడుపులోకి దిగిన నిర్జీవపు శరీరాలు.. కొందరు బలవంతంగా కొనసాగితే.. మరికొందరు వేరే దారి లేక ఆ నరకకూపంలోనే మగ్గుతున్నారు. ఒక్కసారి అందులోంచి బయట పడితే మరోసారి పుట్టినట్టే. కానీ ఎందరు బయటపడుతున్నారు? వారి పిల్లలు ఎటువైపు అడుగులేస్తున్నారు? వారి భవిష్యత్ ఏంటి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే బండారి జయమ్మ. ఇంతకీ జయమ్మ ఏం చేసింది? వారి జీవితాల్లో ఎలాంటి వెలుగులు నింపుతున్నది?

చైతన్యమే జయం!



తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. నా అనేవారు లేరు. 'ఎవరు చేరదీస్తారు?' అనే ప్రశ్నకు మేనమామ సమాధానంలా కనిపించాడు. తను వేసుకున్న ప్రశ్న, దొరికిన సమాధానం సరైనవే అనిపించింది. కట్ చేస్తే.. జయమ్మ పదవ తరగతి పూర్తయింది. పై చదువులకు పంపించే ఆర్థిక స్థోమత, ఉద్దేశం తన మేనమామకు లేవని అర్థమయింది. పైగా ఆ కుటుంబానికి తనిప్పుడు భారం. రెండవ పెళ్లి చేసుకోవాలనుకుంటున్న వ్యక్తికి జయమ్మను ఇచ్చి పెళ్లి చేయడానికి నిర్ణయించారు. అప్పుడు కరెక్టే అనిపించిన సమాధానం ఇప్పుడు తప్పుగా అనిపించింది. తల్లిదండ్రులను దూరం చేసి తప్పు చేసిన దేవుడు, ఇప్పుడు మరో తప్పు చేయనున్నాడని జయమ్మకు బోధపడింది. వెంటనే మేనమామ ఇంట్లోంచి బయటకు వచ్చేసింది. అప్పటికే తను మనసు పడ్డ వ్యక్తికి సమాచారం ఇచ్చింది. ఇద్దరూ కలిసి హైదరాబాద్ చేరుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. చిలుకా గోరింకల్లా వారి సంసారం హాయిగా సాగిపోతున్నది. ఈ క్రమంలోనే వారి ప్రేమకు గుర్తుగా ఓ పాప పుట్టింది. తన కడుపులో అమ్మే పుట్టిందని గావురంగా పెంచుకోసాగింది జయమ్మ. కానీ కూతురుతో పాటే కష్టం కూడా పుట్టిందని తెలుసుకోలేకపోయింది. 'నాకు వేరే సంబంధాలు వస్తున్నాయి. అది ఒప్పుకుంటే నాకు కట్నం కింద డబ్బులు వస్తాయి. అనవసరంగా నిన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాను' అని రోజూ తిట్టడం, కొట్టడం మొదలుపెట్టాడు భర్త. డబ్బుల కోసం వేధించడం మొదలుపెట్టాడు. 'దందా చేసైనా సరే.. డబ్బులు తీసుకు రా.. లేకపోతే బిడ్డను చంపేస్తా' అని బెదిరించసాగాడు. బిడ్డను చంకన ఎత్తుకుని మేనమామ ఇంటికి వెళ్లిపోయింది. వాళ్లు కనీసం మొహం కూడా చూడకుండా తలుపులేసుకున్నారు. ఎవరికీ చెప్పుకోలేని బాధ. బిడ్డను కాపాడుకోవాలన్న తాపత్రయం. ఆమెను మళ్లీ పట్నం బాట పట్టించాయి. ఇంటికి వచ్చింది. భర్త చెప్పినట్టు చేస్తే బిడ్డ ప్రాణాలు దక్కుతాయనుకున్నది.

పునర్జన్మ: వేరే దిక్కు లేక.. కనీసం బాధను పంచుకునే మనుషులు లేక ప్రతిరోజూ ఏడుస్తుండేది జయమ్మ. దాదాపు మూడు నెలలు వ్యభిచారకూపంలో నలిగిపోయింది. ఒకానొక సమయంలో 'నాలాగే ఎంతోమంది ఈ నరకాన్ని అనుభవిస్తున్నారు. వారందరినీ ఏకతాటిపైకి తెస్తే నాతోపాటు వారు కూడా ఈ నరకంలోంచి బయటపడుతారు' అనుకుంది. ఎంతోమందిని కలిసింది. తన బాధను చెప్పుకుంది. వారి బాధలు కూడా విన్నది. 'అందరినీ కూడగట్టి ఏదైనా చేద్దామా' అని చైతన్యం నింపే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలోనే జయమ్మకు ఓ ఎన్జీవోలో పనిచేస్తున్న జయసింగ్ థామస్ పరిచయమయ్యాడు. ఆ ఎన్జీవో హెచ్ఐవీ నివారణ కోసం అవగాహనా కార్యక్రమాలు చేస్తున్నది. తన ఆలోచనను థామస్‌తో పంచుకున్నది. ఆ వృత్తిలోంచి బయటకు వచ్చి ఆ ఎన్జీవోలో వలంటీర్‌గా చేరింది. ఆ తర్వాత మెల్లగా 1999 చైతన్య మహిళా మండలి పేరిట తను కూడా ఓ ఎన్జీవో ప్రారంభించింది.

విజన్.. మిషన్..
వ్యభిచార కూపంలో చిక్కుకుని నలిగిపోతున్న మహిళలకు కొత్త జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిందే చైతన్య మహిళా మండలి. ఒక్కొక్కరినీ కలిసి ఆ వృత్తిలో కొనసాగితే ఉండే నష్టాల గురించి, వయసైపోయాక జీవితం ఎలా బుగ్గిపాలవుతుందో చెప్తూ, పిల్లల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేది. అలా మొదలైన చైతన్యం పద్దెనిమిదేండ్లుగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు దాదాపు 1500 మంది జీవితాల్లో వెలుగులు నింపింది జయమ్మ. వ్యభిచార కూపంలో చిక్కుకున్న వారి పిల్లలకు చదువు చెప్పిస్తున్నది. ఒక హోం ఏర్పాటు చేసి యాభై మంది పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్నది. వారి బాగోగులు చూసుకుంటున్నది. చైతన్య మహిళా మండలి బాలల హోమ్‌లో ఉండి చదువుకున్న పిల్లల్లో ఇప్పుడు పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఇంకా ఎంతోమంది మహిళలు, వారి పిల్లలు కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు పనిచేస్తా అంటున్నది జయమ్మ.



మార్పు రావాలి : జయమ్మ

వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళలను చాలా హీనంగా చూస్తున్నారు. కానీ వారంతా ఏదో కారణాల వల్ల ఆ వృత్తిలో చిక్కుకున్నారు. వారు మంచి జీవితాన్ని గడుపాలంటే వారిలో మార్పు రావాలి. వారితో ప్రవర్తించే తీరులో మార్పు రావాలి. అందుకోసం మా సంస్థ పనిచేస్తుంది. సమూలంగా మార్పు రావాలంటే మేం చేసేది సరిపోదు. ఇంకా చాలా ప్రయత్నం చేయాలి. ప్రభుత్వం కూడా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి.

నిమిషాల్లో దగ్గు మాయం..!!



చిట్కా 1
దీనికి కావాల్సింది పసుపు, తేనె. పసుపులో ఉండే కార్టూమాన్స్ అనే గుణాలు దగ్గును తగ్గించడంలో బాగా సహాయపడుతుంది. పసుపులో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉన్నాయి. పసుపులో ఉన్న యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చెస్ట్ లో ఉన్న ఇన్ఫెక్షన్ తగ్గించడంలో యంతగానో సహాయపడతాయి. కొద్దిగా పసుపు కొద్దిగా తేనె ఈ రెండు బాగా కలిపి ఈ మిశ్రమాన్ని తీసుకోవాలి. ఇది దగ్గు నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది.

చిట్కా 2
దీనికి కావల్సింది తేనె, శొంటి పౌడర్. శొంఠి పౌడర్ కొద్దిగా తేనె ఈ మిశ్రమాన్ని తరచూ తీసుకోవాలి. పొడి దగ్గు నుంచి త్వరగా ఉపశమనం కలుగుతుంది.

చిట్కా 3
దీనికి కావాల్సిన పదార్థాలు మిరియాల పొడి, గోరువెచ్చని పాలు. గోరువెచ్చని పాలల్లో కొద్దిగా మిరియాల పొడిని వేసుకోండి. బాగా కలిపి తాగడం వలన దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది.

చిట్కా 4
దీనికి కావల్సింది కట్ చేసి పెట్టుకున్న అల్లం ముక్కలు. స్టవ్ పై ఒక గిన్నె పెట్టుకొని దాంట్లో నీళ్ళు పోయాలి. కట్ చేసి పెట్టుకున్న అల్లం ముక్కలను నీళ్లలో వేసి బాగా మరిగించాలి. నీళ్లు సగం అయ్యేవరకు స్టవ్ పై ఉంచాలి. కాస్త చక్కెర కలిపి తాగితే దగ్గు తగ్గుతుంది.

అడుగండి చెబుతా

ఈ నొప్పి ఎందుకు?



మీరు తెలిపిన వివరాలను బట్టి చూస్తే మీరు స్పాండిలోలిస్థసిస్‌తో బాధపడుతున్నట్టు అనిపిస్తుంది. స్పాండిలోలిస్థసిస్ సమస్యలో వెన్నుపూసలు వాటి స్థానం నుంచి జారిపోతాయి. అందువల్ల వాటి పరిసరాలలో ఉన్న నాడుల మీద ఒత్తిడి కలుగుతుంది. ఫలితంగా నడుము నొప్పితో పాటు కాళ్లలో నొప్పి, తిమ్మిర్లు ప్రారంభమవుతాయి. కాస్త దూరం నడిచినా నడుములో నొప్పి మొదలవుతుంది. కాళ్లు బరువెక్కువతాయి. కాసేపు విశ్రాంతి తీసుకుంటే నొప్పి తగ్గిపోతుంది. ఈ స్థితి ని క్లాడికేషన్ అంటారు. ఈ దశలోనే నడుములో సమతౌల్యం తగ్గుతుంది. చికిత్స ప్రారంభించకపోతే నడుము మొత్తంగా ఒక పక్కకు కానీ, ముందుకు గాని వంగిపోతుంది. దీనిని గ్లోబల్ లాస్ ఆఫ్ బ్యాలెన్స్ అంటారు. కొద్ది సమయం నిలబడినా, నడిచినా నడుము, పిరుదులు, తొడ ఎముక భాగాల్లో నొప్పి వస్తుంది. ఈ నొప్పి క్రమంగా పెద్దదై లేవలేని స్థితికి తీసుకు వస్తుంది. కాబట్టి మీరు వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించండి. అవసరమైన పరీక్షల తర్వాత మీకు చికిత్స ప్రారంభిస్తారు. ఈ రకమైన సమస్యలో స్పైనల్ ఆస్టియేటమీ అనే సర్జరీ అవసరమవుతుంది. ఈ సర్జరీతో మీ సమస్య పూర్తిగా తగ్గిపోతుంది. అశ్రద్ధ చెయ్యకుండా వీలైనంత త్వరగా చికిత్స తీసుకోండి.



డాక్టర్ ప్రవీణ్ మేరెడ్డి
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

సిరిముగ్గు



నీలాపురం శ్రీదేవి
హన్మకొండ
వరంగల్ జిల్లా





ఎస్. వైదేహి
ఎర్రుపాలెం
ఖమ్మం జిల్లా



మా చిరునామా:
సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news,
zindagi.nt@gmail.com

మగవారికి నో ఎంట్రీ



మహిళల కోసం మహిళలే నిర్మించుకున్న గ్రామం అది . అక్కడ మగవాళ్లకు ఏ మాత్రం ప్రవేశం లేదు. గృహహింస, మగాళ్ల వేధింపులు, అత్యాచారాలు, అఘాయిత్యాలకు గురైన మహిళలు, భర్త వదిలేసిన వారు, వితంతువులకు ఈ గ్రామం రక్షణ కల్పిస్తుంది. ఈ గ్రామం కెన్యాలో ఉంది. దాని పేరు ఉమోజా!!

కెన్యా ఉత్తర ప్రాంతంలో రెబెకా అనే మహిళ 25ఏళ్ల క్రితం కేవలం మహిళల కోసమే ఉమోజా అనే గ్రామాన్ని ఏర్పాటుచేశారు. ఉమోజా గ్రామ ప్రస్తుత చీఫ్ రెబెకా. అక్కడి సంబూరు తెగకు చెందిన మహిళ. గతంలో అక్కడ బ్రిటీష్ సైనికులు శిక్షణ పొందేవారట. ఆ సమయంలో వారి అకృత్యాలకు హద్దు ఉండేది కాదు. అక్కడి పురుషులు కూడా మహిళలను విపరీతంగా కొట్టేవారు. ఓ రోజు గ్రామంలో వ్యక్తులు ఒకావిడను విపరీతంగా కొడుతుంటే ఆమె భర్త అడ్డుకోలేదట. ఇక పురుషులకు దూరంగా కొత్త గ్రామాన్ని నిర్మించుకోవాలని అనుకొని 1990లో ఉమోజా గ్రామం ఏర్పాటుకు మొదలుపెట్టారు. క్రమంగా ఎందరో బాధితులు ఆమెతో చేరిపోయారు. గ్రామం ఏర్పాటైంది. భర్త వేధింపులు తాళలేక వచ్చేసిన వారు, భర్త చనిపోయిన వారు, అత్యాచారాలకు గురైనవారు, అనాథలు, బలవంతపు పెళ్లిళ్లు వద్దనుకొని పారిపోయి వచ్చినవారు ఈ గ్రామంలో ఉంటున్నారు. గ్రామంలో మహిళలు బతుకుతెరువు కోసం రకరకాల ఆభరణాల తయారీ, ఇతర ఎన్నో పనులు చేస్తుంటారు. ఇలా వారు ఇళ్లు కట్టుకున్నారు. పిల్లలు చదువుకోవడానికి పాఠశాల కూడా నిర్మించుకున్నారు. పర్యాటకులకు వారు పెట్టిన కొన్ని నిబంధనలకు ఒప్పుకుంటే సందర్శనకు అనుమతి ఇస్తారు.

మచ్చలు పోవాలంటే..



- ఒక టీస్పూన్ గంధం పొడిని తీసుకొని అందులో ఆల్మండ్ ఆయిల్‌ను కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం పై మాస్క్ వేసి పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- పచ్చిపాలల్లో పసుపు కలిపి ముఖంపై రాయాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే మొటిమల మచ్చలకు గుడ్ బై చెప్పొచ్చు.
- ముల్తానీ మట్టిలో కొబ్బరి నూనె కలిపి మచ్చలపై ఈ మిశ్రమాన్ని రాయండి. ఇలా తరుచుగా చేయడం వల్ల మొటిమల మచ్చలు తగ్గిపోతాయి.
- బంతిపూల రెక్కలను మెత్తగా నూరి రోజ్‌వాటర్ కలుపాలి. మచ్చలున్న ప్రాంతంలో ఈ మిశ్రమాన్ని పూయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి.

ఉత్తమ ప్రిన్సిపాల్



మీకో ఉత్తమ ప్రిన్సిపాల్‌ను పరిచయం చేస్తున్నాం. ఎందుకు అంతగొప్పగా చెబుతున్నామంటే.. ఈమె దాదాపు ఏడేళ్లుగా మంచంపై నుంచే ఒక నేషనల్ పబ్లిక్ స్కూల్‌ను నిరంతరాయంగా నడిపిస్తున్నారు. ఏంటీ నమ్మశక్యంగా లేదా..? అయితే ఇటో లుక్కెయ్యండి.

భోపాల్‌కు చెందిన ఉమాశర్మ.. షహరాన్‌పూర్‌లో ఉన్న నేషనల్ పబ్లిక్ స్కూల్‌కు ప్రిన్సిపాల్. 64 ఏళ్లున్న ఉమాశర్మకు ఏడేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి ఆమె శరీరంలోని తల ఒక్కటి తప్పా మిగతా అవయవాలన్నీ పనిచేయవు. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. అయినా ఆమె ఏమాత్రం దిగులు చెందకుండా మంచంలోనే ఉంటూ టెక్నాలజీ సాయంతో ప్రిన్సిపల్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అయితే ఉమాశర్మకు కష్టాలు కొత్తేమీ కాదు. 1991లో ఆమె భర్త చనిపోయాడు. ఆ తర్వాత పదేళ్లకు 21 ఏళ్ల కొడుకు కన్నుమూశాడు. 2010లో తన చిన్నకూతురు రీచా కూడా చనిపోయింది. అన్ని కష్టాలను భరించిన ఉమాశర్మకు కొత్తగా వచ్చిన పక్షవాతంతో దిగులు చెందలేదంటున్నది. కళ్లముందే భర్తను, కన్న బిడ్డల్ని కోల్పోయిన ఉమాశర్మ.. ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా పిల్లలకు పాఠాలు చెబుతూ, పాఠశాల నిర్వహణ జాగ్రత్తగా చూసుకుంటూ ఆదర్శంగా నిలిచింది. పాఠశాలలో, ఇంట్లో డిష్ యాంటెన్నాలు ఏర్పాటు చేసి లైవ్, ఆడియో, వీడియోల ద్వారా సంభాషిస్తున్నారు. క్లాస్ రూం, స్టాఫ్ రూం, ప్లే గ్రౌండ్ ఇలా పాఠశాల మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ ప్రిన్సిపాల్‌గా తన గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నది. అందుకే ఉమాశర్మ ఉత్తమ ప్రిన్సిపాల్.

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 3 జనవరి 2018
టెక్నాలజీ 2.0

విటమిన్లు పంచే ఈ-సిగరెట్!

సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికర మని అందరికీ తెలుసు. కానీ ఈ- సిగ రెట్ వల్ల ఆరోగ్యానికి ముప్పు కూడా తక్కువ. పైగా విటమిన్లు కూడా లభిస్తాయి.

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ కంపెనీ అయిన షియోమీ సృజనాత్మక ఉత్పత్తులనూ తయారుచేస్తుంది. దీనికి మిజియాను ప్లాట్ ఫామ్ చేసుకుంది. పొగాకు ఆధారిత సిగరెట్‌లకు ప్రత్యామ్నాయంగా ఈ-సిగరెట్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఆరోగ్యానికి తక్కువ హానిచేస్తుంది. ఈ షియోమీ మిజియా సిగరెట్ స్టెయిన్‌లెస్ స్టీల్ మెటీరియల్‌తో తయారుచేయబడింది. ఇది 12 సెం.మీల పొడవు, ఒక సెంటీమీటర్ వెడల్పు కలిగి ఉంటుంది. పొగను పీల్చుకోవడానికి, ఎయిర్ ఫ్లో కంట్రోల్ కోసం ఈ సిగరెట్ టెక్నాలజీ ఉపయోగించుకుంటుంది. మామూలుగా అయితే ఈ-సిగరెట్‌లో నికోటిన్, నాన్‌నికోటిన్ ఫ్లేవర్‌లు ఉంటాయి. ఈ సిగరెట్ గ్రీన్ ఆపిల్, ద్రాక్ష, స్వీట్ వెనిలా, మెంథాల్ మింట్ ఫ్లేవర్‌లలో లభిస్తుంది. ఈ-సిగరెట్‌లలో లిక్విడ్ ఉంటుంది. దానిని వేడి చేయడం ద్వారా ఈ సిగరెట్ వెలిగించబడుతుంది. అది ఒక ఎరోజెల్‌ని ఏర్పరుస్తుంది. సిగరెట్ తాగేవారు ఈ ఎరోజల్‌ను పీలుస్తారు. ఈ ప్రక్రియను వాపింగ్ అంటారు. షియోమీ మిజియా ద్వారా దాదాపు 500 వాపింగ్‌లు చేయొచ్చు. స్కెచ్ పెన్‌లా కనిపించే ఈ- సిగరెట్‌లు జీరో క్యాలరీలను కలిగి ఉంటుంది. పైగా విటమిన్ సి, ఎ, బి6, బి12లను కో-ఎంజైమ్‌లతో కలిపి లోడ్ చేయబడి ఉంటుంది. ఈ సిగరెట్‌లో అన్ని భాగాలు ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. దీన్ని రీఫిల్ చేసుకోలేం. దీని ధర సుమారు 1800 రూపాయల వరకు ఉంటుంది.



ఇంటిని మార్చేయండి గురూ!

వంటకు ఉపయోగించే ఓవెన్‌ను ఎంత సేపటికి వంట పూర్తవుతుందో ఎప్పుడైనా అడిగారా?! వేడి వేడి మైక్రో ఓవెన్‌ను చిన్న సైజు కూలింగ్ ఫ్రిడ్జ్‌లా ఎప్పుడైనా వాడారా?! వాషింగ్ మెషీనే బట్టలు ఉతికి, ఆరేసి, ఇస్త్రీ కూడా చేసి పెడితే?! ఇవన్నీ ఇప్పట్లో జరిగేవి కాదులే.. కబుర్లు చెబుతున్నారని కొట్టిపారేయకండి. మీకోసం ఆ గ్యాడెట్స్‌ను పరిచయం చేస్తున్నాం.



స్మార్ట్ డుయో డ్రై..

డబుల్ కాట్‌కు వాడే దుప్పట్లు, రగ్గులు, బొంతలు, బెడ్‌షీట్‌లను ఉతుకాలంటే ఎంతో కష్టం. అలాంటిది వాటిని పిండి ఆరెయ్యాలంటే.. మరెంతో కష్టపడాలి. అయితే ఈ స్మార్ట్ డుయో డ్రైతో ఆ పనంతా చాలా సులభం అవుతుంది. కేవలం అతికొద్ది సమయంలోనే బెడ్‌షీట్లను ఉతికి ఆరేస్తుంది. అంత కెపాసిటీతో ఈ డుయో డ్రై మిషన్‌ను రూపొందించారు. ఇది వైఫై ఆధారంగా కూడా పనిచేస్తుంది. దుస్తులు పూర్తిగా ఎండిన తర్వాత మనకు సందేశాలు కూడా పంపుతుంది. అయితే ఇలాంటి మెషీన్లను శాంసంగ్ కంపెనీ 'యాక్టివ్ డ్రై' పేరుతో యూఎస్‌లో మాత్రమే అమ్మకాలు చేపట్టింది. ఈ ఏడాది మన మార్కెట్‌ను కూడా ఈ డ్రై మెషీన్లు పలుకరించనున్నాయి.





రోబో వ్యాక్యూమ్ క్లీనర్..

ఈకాలంలో ప్రతి ఇంటిలోనూ పెంపుడు జంతువులు కామన్ అయ్యాయి. వాటిని జాగ్రత్తగా పెంచుకుంటున్నా.. వాటి గదులను శుభ్రం చేయాలంటే చాలా ఇబ్బందిగానే ఉంటుంది. అలాంటి వారికి ఈ రోబో వ్యాక్యూమ్ క్లీనర్ బాగా ఉపయోగపడుతుంది. ఇది గోడ మూలల్లో దాగివున్న మురికిని కూడా శుభ్రం చేస్తుంది. డీ7 సిరీస్‌లో వచ్చిన ఈ రోబో వ్యాక్యూమ్ క్లీనర్ గృహిణులకు బాగా ఉపయోగపడుతుంది. దీనిని స్మార్ట్ ఫోన్ నుంచి కూడా ఆపరేట్ చేయవచ్చు. యాప్ సాయంతో మనం నిర్ణయించిన సమయానికి ఇది రూమ్‌ను క్లీన్ చేయడంతో పాటు.. సువాసనలు వెదజల్లే జెల్‌ను కూడా స్ప్రే చేస్తుంది. వైఫై ఆధారంగా కూడా ఇది పనిచేస్తుంది. దీని ధర 40వేల రూపాయల నుంచి ప్రారంభమవుతుంది.

టు ఇన్ వన్..




మైక్రోవేవ్‌ను చాలా మంది ఏదైనా పదార్థాన్ని, వస్తువును వేడి చేయడానికి ఉపయోగిస్తుంటారు. మైక్రోవేవ్ అంటే కేవలం వేడి చేయడమే అనే నానుడికి ఇక చరమగీతం పాడాల్సిందే. ఎందుకంటే ఫ్రిగాండాస్ మైక్రోవేవ్‌తో రెండు ఉపయోగాలున్నాయి. అవేంటంటే ఏదైనా పదార్థాన్ని, వస్తువును వేడి చేయవచ్చు, కూల్ చేయవచ్చు. ఇది టు ఇన్ వన్ అన్నమాట. స్పానిష్-కొరియన్ కంపెనీ దీనిని తయారు చేసింది. నిమిషాల్లోనే డ్రింక్స్‌ను ఇది కూల్ చేస్తుంది. అతి త్వరలోనే దీనిని యూఎస్ మార్కెట్‌కు పరిచయం చేయనున్నారు. ఆ తర్వాత దీని పనితీరును బట్టి అంతర్జాతీయ మార్కెట్‌లో విడుదల చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. దీని ధర వెయ్యి డాలర్ల నుంచి ప్రారంభమవుతుంది.



ట్రిపుల్ ధమకా..

కొత్త సాంకేతికతతో బట్టలు ఉతికే కాలానికి వాషింగ్ మెషీన్‌తో స్వస్తి చెప్పాం. అయితే వాషింగ్ మెషీన్‌లో నుంచి బట్టలు తీసి, ఆరేసి, ఇస్త్రీ చేయాలి. ప్రస్తుతం వచ్చిన టెక్నాలజీతో ఈ విధానానికి కూడా స్వస్తి చెబుతున్నారు. ఎందుకంటే బట్టలు ఉతికి, ఆరబెట్టి, మంచిగా ఇస్త్రీ చేసే పెడుతుంది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఎల్‌జీ, శాంసంగ్ కంపెనీలకు చెందిన వాషింగ్ మెషీన్లు బట్టలను ఉతికి, ఆరబెట్టడం మాత్రమే చేస్తాయి. యూఎస్‌కు చెందిన ఈ వాషింగ్ మెషీన్ ఆ రెండు పనులతో పాటు ఇస్త్రీ కూడా చేస్తుంది. దీంతో లాండ్రీ పనికూడా తప్పినట్లే.

క్లీనింగ్ స్టిక్..



ప్రముఖ నగరాల్లో ఎక్కడ చూసినా పెద్ద అద్దాల మేడలే కనిపిస్తున్నాయి. అవి అంత అందంగా కనిపిస్తున్నాయంటే.. వాటి వెనుక ఎంతో శ్రమ దాగివున్నది. ఎత్తులో ఉన్న అద్దాలు శుభ్రం చేయాలంటే నానా యాతన పడేది. ఆ పని నిత్యం చేసేవాళ్లు ఒళ్లు నొప్పులకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఇలాంటి సమస్యలకు క్లీనింగ్ స్టిక్ చెక్ చెబుతున్నది. దీనితో ఎత్తులో ఉన్న అద్దాలను కూడా చాలా సులువుగా శుభ్రం చేయవచ్చు. ఇవి యూరప్‌లో బాగా పాపులర్ అయ్యాయి. ప్రస్తుతం యూఎస్ మార్కెట్‌లో ఇవి విపరీతంగా అమ్ముడుపోతున్నాయి. అతి త్వరలోనే మన మార్కెట్‌లోకి రానున్నాయి.

గడ్డి కత్తిరించే రోబోలు..



మారిన జీవన పరిస్థితుల కారణంగా కాలుష్యాన్ని తట్టుకునేందుకు ఇంటిముందు గ్రీనరీ ఉండేలా ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకుంటున్నారు. అయితే గడ్డి కత్తిరించేందుకు చాలా కష్టపడుతున్నారు. కొంతమందైతే ఎంత కష్టమైనా, ఖర్చైనా వెనుకాడకుండా గడ్డిని కత్తిరించేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో గడ్డి కత్తిరించే రోబోలు అందుబాటులోకి వచ్చాయి. అవే 'లాన్ మూవర్స్ రోబో'లు. చాలా తక్కువ ఖర్చుతో మనకు నచ్చిన విధంగా గ్రాస్ కట్ చేయవచ్చు. రిమోట్ ఆధారంగా.. వివిధ ఆకారాల్లో కూడా గడ్డిని కత్తిరించి.. అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. బొమ్మ కార్ల ఆకారంలో ఉండే ఈ రోబోలు.. కష్టమైన పనిని కూడా చాలా సులువుగా చేస్తున్నాయి. వీటి వాడకం వల్ల సమయం, ధనం ఆదా అవుతున్నాయి. ఇవి కూడా అతి త్వరలోనే మార్కెట్‌లోకి రానున్నాయి.

చిన్న నెస్‌ప్రెస్‌సో మెషీన్

కాఫీ, టీ వంటి పానియాలు కలిపేందుకు ఇప్పటి వరకు పెద్ద నెస్‌ప్రెస్ యంత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇవి చాలా చిన్న పరిమాణంలో అందుబాటులోకి వచ్చాయి. చుట్టాలు, స్నేహితులు వచ్చినప్పుడు అప్పటికప్పుడు టీ, కాఫీ వంటివి తయారు చేయడం కొంచెం కష్టం. దీనంతో అప్పటికప్పుడూ వేడి వేడి పాయసం మనవారికి అందించవచ్చు. దీని ఎత్తు కేవలం 12 అంగుళాలు.



డైలాగ్ ఓవెన్..

వంట వండే పాత్ర.. మన మాటలకు సమాధానం చెపితే ఎలా ఉంటుంది..? ఆహా ఏదో పాత సినిమా గ్రాఫిక్స్‌లో చూశాం.. ఆ కబుర్లు ఇప్పుడెందుకులే అనుకుంటున్నారా? అయితే మీ ఆలోచన మార్చుకోవాల్సిందే. ఎందుకంటే మన మాటలకు సమాధానం చెప్పే 'డైలాగ్ ఓవెన్' వచ్చేసింది. వంట పూర్తవ్వడానికి ఎంత సమయం పడుతుంది.. అందులోకి ఏవేమి కావాలో కూడా చెప్పేస్తుంది. ఇలా అలనాటి కలను ఈ డైలాగ్ ఓవెన్ నిజం చేసింది. అందివచ్చిన టెక్నాలజీతో ఇది సాధ్యమైంది. ఇంకో విషయం ఏంటంటే.. మనకు ఎంత సమయంలో వంట పూర్తవ్వాలో చెబితే.. అదే సమయంలో వంట చేసి పెడుతుంది ఈ డైలాగ్ ఓవెన్. వైఫై ఆధారంగా కూడా ఇది పని చేస్తుంది. ఇది ప్రస్తుతం మన మార్కెట్‌లో లేదు. ఆస్ట్రేలియా, జపాన్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నది. అతి త్వరలోనే దీనిని అమెరికాకు పరిచయం చేయనున్నారు. దీని ధర 9505 డాలర్లు.



నయా మాల్

ఫుల్‌స్క్రీన్ డిస్‌ప్లేతో..



చైనా స్మార్ట్‌ఫోన్ దిగ్గజం లెనోవో మొట్టమొదటి ఫుల్ స్క్రీన్ డిస్‌ప్లే ఫోన్‌ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. పాలీ కార్బొనేట్ బాడీతో వచ్చే ఈ ఫోన్ అమ్మకాలు రేపటి నుంచే మొదలు కానున్నాయి. మరి దాని ఫీచర్స్ పై ఓ లుక్కేయండి..

ఫోన్	: లెనోవో కే320టీ
సిమ్	: డ్యూయల్
డిస్‌ప్లే	: 5.7 అంగుళాల ఐపీఎస్
రిజల్యూషన్	: 720X1440 పిక్సెల్స్
ఓఎస్	: ఆండ్రాయిడ్ 7.1 నౌగట్
ప్రాసెసర్	: 1.3గిగాహెడ్జ్ క్వాడ్ కోర్ స్ప్రెక్ట్రమ్
ర్యామ్	: 2జీబీ
స్టోరేజ్	: 16జీబీ (128జీబీ వరకు పెంచుకోవచ్చు)
బ్యాటరీ	: 3000ఎమ్ఏహెచ్
కెమెరా	: ఫ్రంట్ 2 మెగా పిక్సెల్, రియర్ 8 మెగా పిక్సెల్
స్పెషలైజేషన్	: హారిజాంటల్ డ్యూయల్ రేర్ ఫేసింగ్ కెమెరా,ఫింగర్ ప్రింట్ సెన్సార్
బరువు	: 153.8 గ్రా.
ధర	: రూ. 9, 774

'వోక్ టైల్' కావాలా నాయనా!



మందుల్లో అన్ని రకాల పేర్లు విన్నాం.. కాక్‌టైల్ కూడా తీసుకున్నాం.. మరీ ఈ 'వోక్‌టైల్' ఏంటని ఆశ్చర్యపోతున్నారా? ఇది కూడా మద్యమే కానీ హానికరమైనది కాదు.. ఆరోగ్యకరమైనది.

మీరు విన్నది నిజమే.. టెక్నాలజీతో ఏదైనా సాధ్యమేనని నిరూపించడానికి ఇలాంటి మచ్చుతునకలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా సున్నా కేలరీలతో 'వోక్‌టైల్' రూపొందించారు. చాలామంది మద్యం తాగితే వాళ్ల ఇంద్రియాలు అదుపులో ఉండవు. ఏం మాట్లాడుతారో, ఏం చేస్తారో వారికే తెలియదు. కానీ ఈ వోక్‌టైల్ మాత్రం అలా కాదు. దీన్ని తాగితే మీరు కంట్రోల్ తప్పే చాన్సే లేదు. మరి దీనిని ఎలా తయారు చేస్తారనే కదా మీ డౌటు.. మీ స్మార్ట్‌ఫోన్‌లో 'వర్చువల్ కాక్‌టైల్' యాప్ ఉంటే.. అది మీ ఆలోచన, దృష్టి, మీరు పీల్చిన వాసన ఆధారంగా, మీ శరీరం ఎలాంటి అనారోగ్యం పాలు కాకుండా ఎలాంటి మద్యం కావాలో, అందులో ఏమేమి కలుపాలో సూచిస్తుంది. దీంతో మీరు మీ అభిరుచికి తగ్గట్లుగా ఆరోగ్యకరమైన మద్యాన్ని సేవించవచ్చు. మీకు ఇష్టమైన పానియాలను ఇందులో కలుపడం వల్ల ఇది జీరో కేలరీలను అందిస్తుంది. జీరో కేలరీలు ఎలా అవుతుందంటే.. ఈ మొబైల్ యాప్‌కు అనుంధానంగా 'వర్చువల్ కాక్‌టైల్'నే గ్లాసుగా రూపొందించారు శాస్త్రవేత్తలు. అందులో ఏ మద్యం పోసినా, ఎన్ని రకాల బ్రాండ్‌లు కలిపినా అవి జీరో కేలరీల్లోకి మారిపోయి రుచికరమైన 'వోక్‌టైల్' అవుతుంది.

లోడింగ్ స్పీడెంత?



ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సెర్చ్ ఇంజిన్లకు లోడింగ్ టైమ్ ఆధారంగానే ర్యాంకింగ్ ఉంటుంది. అలానే యూజర్ ఎక్స్‌పీరియన్స్ ఆధారంగానే రేటింగ్‌లు ఇవ్వడం జరుగుతుంది. సాధారణంగా వెబ్ పేజీకి సంబంధించిన లోడింగ్ స్పీడ్ అనేది బ్యాండ్ విడ్త్ క్వాలిటీ, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌ను బట్టి ఆధారపడి ఉంటుంది. గూగుల్ బ్రౌజర్ ద్వారా ఏదైనా వెబ్ సైట్‌కు సంబంధించిన లోడింగ్ స్పీడును తెలుసుకోవాలనుకుంటే ఈ సింపుల్ ప్రాసెస్‌ను ఫాలో అవ్వండి.

- గూగుల్ క్రోమ్ బ్రౌజర్ ద్వారా ఏదైనా వెబ్‌సైట్‌కు సంబంధించిన లోడింగ్‌స్పీడ్‌ను టెస్ట్ చేసే ముందు మీ బ్రౌజర్‌లోని క్యాచీ అలానే హిస్టరీని క్లియర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల లోడింగ్ స్పీడ్ మరింత కచ్చితంగా తెలుస్తుంది. క్రో బ్రౌజర్‌లో సెర్చ్ హిస్టరీని క్లీన్ చేసుకొనేందుకు సెట్టింగ్స్, హిస్టరీలోకి వెళ్లి క్లియర్ బ్రౌజింగ్ డాటా మీద క్లిక్ చేయాలి.
- బ్రౌజింగ్ సెట్టింగ్స్‌లోని హిస్టరీ విభాగంలోకి వెళ్లి క్లియర్ బ్రౌజింగ్ డాటా ఆప్షన్‌పై క్లిక్ చేసిన తర్వాత బ్రౌజింగ్ హిస్టరీ, కుకీస్ అండ్ అదర్ సైట్ డేటా, క్యాచిడ్ ఇమేజెస్ అండ్ ఫైల్స్ పేర్లతో మూడు ఆప్షన్లు మీకు కనిపిస్తాయి. వాటిలో బ్రౌజింగ్ హిస్టరీతో పాటు క్యాచ్డ్ ఇమేజెస్ అండ్ ఫైల్స్ ఆప్షన్లపై టిక్ మార్క్ చేసి క్లియర్ డేటా ఆప్షన్‌పై క్లిక్ చేసినట్టయితే మీ బ్రౌజర్‌లోని క్యాచీ అలానే హిస్టరీ ఫైల్స్ క్లియర్ అయిపోతాయి.
- మరొక ప్రాసెస్‌లో బ్రౌజింగ్ హిస్టరీని క్లియర్ చేసుకోకుండానే వెబ్‌సైట్‌కు సంబంధించిన లోడింగ్ స్పీడ్‌ను తెలుసుకోవచ్చు. అయితే ఈ ప్రక్రియ మొత్తం incognito మోడ్‌ను యాక్టివేట్ చేసుకోవడం ద్వారా జరుగుతుంది.
- క్రోమ్ బ్రౌజర్‌లోని క్యాచీ అలానే హిస్టరీని పూర్తిగా క్లియర్ చేసుకున్న తర్వాత కంట్రోల్, షిఫ్ట్ ప్లస్ సి ప్రెస్ చేయడం ద్వారా క్రోమ్ కన్సోల్ టూల్స్ ఓపెన్ అవుతాయి. వాటిలో నెట్‌వర్క్ టూల్‌పై క్లిక్ చేయండి.
- నెట్‌వర్క్ టూల్‌లోని ఫిల్టర్ ఆప్షన్‌లో మీ డొమైన్ నేమ్‌ను ఎంటర్ చేసి బటన్‌పై హిట్ చేసినట్టయితే వెబ్‌పేజీకి సంబంధించిన పూర్తి సమాచారం డిస్‌ప్లే అవుతుంది. అందులో వెబ్‌పేజీ లోడింగ్‌కు సంబంధించిన మొత్తం డేటాను తెలుసుకొనే వీలుంటుంది.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
బుధవారం 3 జనవరి 2018

సినిమాకు రెండు కోట్లు?

'భానుమతి ఒక్కటే పీస్ హైబ్రీడ్ పిల్లా..' అంటూ తొలి సినిమా 'ఫిదా'తోనే తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసింది తమిళ సోయగం సాయి పల్లవి. ఈ చిత్రంతోనే తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో మంచి స్థానాన్ని సొంతం చేసుకున్న ఆమెకు చిత్ర వర్గాల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. ఆ క్రేజ్‌కు తగ్గట్లే సాయి పల్లవి అధిక మొత్తం డిమాండ్ చేస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. ఇటీవల నానితో కలిసి నటించిన తాజా చిత్రం 'ఎంసీఏ' కూడా భారీ విజయాన్ని సాధించడంతో ఆమెకు వరుస ఆఫర్‌లు వస్తున్నాయి. ప్రస్తుతం శర్వానంద్ కథానాయకుడిగా హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న చిత్రంలో నటిస్తున్న సాయి పల్లవి ఒక్కో సినిమాకు రెండు కోట్ల పారితోషికం డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. కాగా ఆమె డేట్స్ సర్దుబాటు కాని కారణంగా శర్వానంద్ తను సుధీర్‌వర్మతో చేస్తున్న సినిమా తొలి షెడ్యూల్‌ను వాయిదా వేసి, ఆ స్థానంలో హను రాఘవపూడి సినిమా అనుకున్న దాని కన్నా ముందుగానే మొదలుపెడుతున్నారు. దీన్ని బట్టే హీరోయిన్ సాయి పల్లవి డిమాండ్ ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు.


సాయిపల్లవి

'అందరూ ఇష్టపడే సినిమాలు చేయాలన్నదే నా అభిమతం. పదేళ్ల తర్వాత నేను నటించిన సినిమా చూసుకుంటే మంచి ప్రయత్నం చేశానని గర్వపడేలా ఉండాలి. ఇంకా బాగా చేయాల్సింది అనే ఆలోచన మాత్రం రాకూడదు. నటుడిగా అదే నా లక్ష్యం' అని అన్నారు బెల్లంకొండ శ్రీనివాస్. అల్లుడుశీను, స్పీడున్నోడు, జయజానకి నాయక చిత్రాలతో మంచి నటుడిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు. మాస్, యాక్షన్ కథల్లో ఒదిగిపోయే హీరోల్లో ఒకరిగా నిరూపించుకున్నారు. నేడు బెల్లంకొండ శ్రీనివాస్ జన్మదినం. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో తన సినీ ప్రయాణాన్ని, కొత్త సినిమా విశేషాల్ని శ్రీనివాస్ పాత్రికేయులతో పంచుకున్నారు.


బెల్లంకొండ శ్రీనివాస్

ఆ విషయంలో నేను అదృష్టవంతుణ్ణి!

ఈ పుట్టిన రోజు ప్రత్యేకత ఏమిటి? కెరీర్ పరంగా ఈ ఏడాదిని ఎలా ప్లాన్ చేసుకుంటున్నారు?

• ప్రస్తుతం 'సాక్ష్యం' సినిమాపైనే నా దృష్టంతా ఉంది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలతో పోలిస్తే కథాపరంగా ఉత్తమ చిత్రంగా నిలుస్తుందనే నమ్మకముంది. మంచి కాన్సెప్ట్‌తో దర్శకుడు శ్రీవాస్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ ఏడాది నాకో పెద్ద విజయాన్ని తెచ్చిపెడుతుందనే విశ్వాసముంది.

ఈ సినిమా నేపథ్యమేమిటి? ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?

• ప్రకృతి, పంచభూతాల చుట్టూ సాగే కథ ఇది. ఇందులో అమెరికాలో పుట్టిపెరిగిన ఓ వీడియో గేమ్ డైరెక్టర్‌గా నేను కనిపిస్తాను. అతడి అన్వేషణ దేని కోసం అనేది సినిమాలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. కొత్తదనాన్ని నమ్మి మేము చేస్తున్న మంచి ప్రయత్నమిది. వైవిధ్యతను కోరుకునే ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది. సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. పతాక ఘట్టాలు, కొన్ని కీలక సన్నివేశాలతో పాటు మూడు పాటలను చిత్రీకరించాల్సివుంది. ఏప్రిల్ లేదా మే నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం.

మీ గత చిత్రాలతో పోలిస్తే కథాపరంగా ఎలాంటి వైవిధ్యత కనిపిస్తుంది. ?

• ప్రేమ, ప్రతీకారం, త్యాగం ఈ మూడు అంశాల చుట్టే కథలన్నీ తిరుగుతుంటాయి. ఈ సినిమా ప్రతీకార నేపథ్యంలో సాగుతుంది.'లక్ష్యం' తర్వాత శ్రీవాస్ సొంతంగా కథను తయారుచేసుకొని తెరకెక్కిస్తున్న చిత్రమిది. సహజత్వానికి దగ్గరగా ఉంటుంది.

మీ ప్రతి సినిమాలో పోరాట ఘట్టాలకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తుంటారు. ఈ సినిమాలో యాక్షన్స్ సీక్వెన్స్ కోసం ఎలా సన్నద్ధమయ్యారు?

• ఈ సినిమాలో పోరాట ఘట్టాలన్నీ కథానుగుణంగానే ఉంటాయి. ఈ యాక్షన్స్ సీక్వెన్స్ కోసం ఫైట్‌మాస్టర్ పీటర్‌హెయిన్స్ అరవై రోజులుగా పని చేస్తున్నారు. సవాలుగా తీసుకొని వాటిని తెరకెక్కిస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం దుబాయ్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. ఫ్లైబోర్డింగ్, జెట్‌స్కీ, బీఎమ్ఎక్స్ సైక్లింగ్ లాంటి సాహసోపేత సన్నివేశాల్లో డూప్ లేకుండా స్వయంగా నటించాను. భారతీయ తెరపై అడ్వెంచరస్ గేమ్స్‌తో కూడిన ఇలాంటి సన్నివేశాల్ని తొలిసారి మా సినిమాలోనే కనిపిస్తాయి. ఒక్కో సన్నివేశాన్ని చిత్రీకరించడానికి ఐదారు రోజులు పట్టింది. రాత్రిబంవళ్లు కష్టపడి ఈ పోరాట ఘట్టాల్లో నటించాను.

కెరీర్ తొలినాళ్లలోనే అగ్ర దర్శకులతో సినిమాలు చేసే అవకాశాన్ని సొంతం చేసుకోవడం ఎలా అనిపిస్తున్నది?

• ఆ విషయంలో నిజంగా నేను అదృష్టవంతుణ్ణి. దేవుడి అండతో పాటు ఇండస్ట్రీలో నాన్నకున్న పేరు నాకు కలిసొచ్చాయి. అలాగని వచ్చిన అవకాశాల్ని ఎప్పుడూ సులభంగా తీసుకోలేదు. నటుడిగా ప్రతి పాత్రకు న్యాయం చేయడానికే తపించాను. 'స్పీడున్నోడు' తర్వాత 'జయజానకి నాయక' సినిమా కోసం ఆరు నెలల్లో ఇరవై కిలోలు పెరిగాను. మళ్లీ 'సాక్ష్యం' కోసం బరువు తగ్గాను. చాలా కష్టపడ్డాను. అదే నటుడిగా నాకంటూ ప్రత్యేకతను తీసుకొచ్చింది. అవకాశాల్ని తెచ్చిపెట్టింది.

మాస్ ఇమేజ్ ఆశించే యాక్షన్ కథలను ఎంచుకుంటున్నారా?

• ఇమేజ్‌ల కోసం ఎప్పుడూ ప్రయత్నించలేదు. ప్రేమకథలతో కెరీర్‌ను ప్రారంభించిన చాలా మంది హీరోలు మాస్ బాటనే అనుసరించారు. ఎలాంటి సినిమాలు చేసినా చివరకు అందరి గమ్యం మాస్ సినిమానే. తొలి సినిమాతోనే మాస్ హీరోగా నాకు గుర్తింపు దక్కడం లక్కీగా భావిస్తున్నాను.

మీలోని తప్పొప్పుల్ని ఎలా విశ్లేషించుకుంటారు? విమర్శల్ని ఎలా స్వీకరిస్తారు?

• ఇండస్ట్రీతో పోలిస్తే బయటివారే ఎక్కువ మంది స్నేహితులు ఉన్నారు. వారే నా సినిమాలకు విమర్శకులు. నా ప్రతి సినిమా కథలను వారితో చర్చిస్తుంటాను. వారు నిర్మొహమాటంగా అభిప్రాయాల్ని చెబుతుంటారు. సోషల్‌మీడియాలో ఎక్కువ యాక్టివ్‌గా ఉండను. ట్విట్టర్, ఫేస్‌బుక్‌లలో వచ్చే వార్తలను చదవను. నాపై వచ్చే విమర్శల గురించి ఎక్కువగా ఆలోచించను. వాటిని పాజిటివ్‌గానే తీసుకుంటాను. అదే పనిగా విమర్శల గురించి ఆలోచిస్తే ముందుకు సాగలేము. నాన్న నిర్మాత కావడంలో సులభంగా అవకాశాలు వస్తున్నాయని అందరూ అనుకుంటారు. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నేను పడే కష్టమే ఎక్కువగా ఉంటుంది. దాని గురించి చాలా మంది మాట్లాడుతుంటారు. అలాంటివి వింటున్నప్పుడు ఆనందం కలుగుతుంది.



• **తదుపరి సినిమా ఏదీ ఖరారు కాలేదు. కొత్త, పాత దర్శకులు అనే తేడా నాకు లేదు. మంచి కథతో వస్తే దర్శకుడు ఎవరనే దానికి ప్రాధాన్యమివ్వను. ఇతర భాషల్లో సినిమాలు చేసే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు.**

సినిమాలకు సంబంధించి మీ నాన్నగారు ఏమైనా సలహాలు, సూచనలు ఇస్తుంటారా?

• మంచి సినిమాలు వస్తే వాటి గురించి నాన్న నాతో చెబుతుంటారు. కథలు, వాటిలో నటీనటుల అభినయం గురించి విశ్లేషిస్తుంటారు. నేను నటించిన ప్రతి సినిమా ఆయనకు ఇష్టమే. నా దగ్గరకు వచ్చే కథలను మొదట నాన్న విని అభిప్రాయం చెబుతారు. ఆయన బాగుందంటే నేను వింటాను. లవ్‌స్టోరీస్ అయితే నేనే తొలుత వింటాను.

5న 'చిలుకూరి బాలాజీ'


'చిలుకూరి బాలాజీ' చిత్రంలో ఓ దృశ్యం

ఫిల్మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై అల్లాణి శ్రీధర్ దర్శకత్వంలో రూపొందిన భక్తిప్రధాన చిత్రం 'చిలుకూరి బాలాజీ' ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ 'దిల్‌రాజుగారు ఈ సినిమాను చూసి ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాగారి సౌజన్యంతో ఈ చిత్రాన్ని ప్రేక్షకులముందుకు తీసుకొస్తున్నాం. తరతరాలుగా భక్తులచే ఆరాధింపబడుతున్న చిలుకూరి బాలాజీ ప్రశస్తతను, ఆలయ స్థలపురాణాన్ని ఓ దృశ్యకావ్యంలా ఈ సినిమాలో ఆవిష్కరించాం. చినజీయర్‌స్వామి విడుదల చేసిన ఆడియోకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. పాటలు సంగీతప్రియుల్ని అలరిస్తున్నాయి. పాటలు విన్నవారంతా భక్తితన్మయత్వంలో తేలిపోతున్నారు. ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్న దిల్‌రాజుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అన్నారు. సాయికుమార్, సుమన్, యస్.పి.బాలసుబ్రహ్మణ్యం, భానుశ్రీమెహ్రా తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన, నిర్మాణం, దర్శకత్వం: అల్లాణి శ్రీధర్.


రాజ్‌తరుణ్, చిత్రాశుక్లా

రాజ్ తరుణ్ 'రంగుల రాట్నం'

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. శ్రీరంజని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. చిత్రా శుక్లా కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. కాగా ఈ చిత్రానికి 'రంగుల రాట్నం' అనే పేరును ఖరారు చేశారు. గతంలో రాజ్ తరుణ్‌ను కథానాయకుడిగా పరిచయం చేస్తూ 'ఉయ్యాల జంపాల' చిత్రాన్ని నిర్మించాం. అది మంచి విజయాన్ని సాధించింది. కొంత విరామం తరువాత మళ్లీ రాజ్ తరుణ్ హీరోగా తాజా చిత్రాన్ని నిర్మిస్తున్నాం. కాగా ఈ చిత్రానికి 'రంగుల రాట్నం' అనే టైటిల్‌ని ఖరారు చేశాం. సరికొత్త నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ప్రేమకథా చిత్రమిది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సంక్రాంతికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్ర బృందం తెలిపింది. సితార, ప్రియదర్శి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఆర్ట్: ఎం. పురుషోత్తం, దర్శకత్వం: శ్రీరంజని.

ప్రేమకు కృతజ్ఞురాలిని!

ప్రచారానికి దూరంగా వుంటుంది మలయాళీ ముద్దుగుమ్మ నయనతార. తాను నటించిన సినిమాలకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కూడా పెద్దగా ఆసక్తిని చూపించదు. అలాంటి ఈ అమ్మడు తాజాగా అభిమానులకు ఓ లేఖ రాయడం విశేషం. గత ఏడాది నయనతార నటించిన తమిళ చిత్రాలు చక్కటి విజయాల్ని సొంతం చేసుకున్నాయి. ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఈ నేపథ్యంలో అభిమానులకు కృతజ్ఞతాపూర్వకమైన లేఖను రాసింది నయనతార. అందులో 'మీ దీవెనలే నన్ను ముందుకు నడిపిస్తున్నాయి. మీ పవిత్రమైన ప్రేమవల్లే నా జీవితానికి సార్థకత చేకూరింది. జీవితం చాలా అందమైనదని, అంకితభావం..పవిత్ర హృదయంతో పనిచేస్తే మిగతా అన్ని విషయాల్ని ఆ భగవంతుడే చూసుకుంటాడని నేను విశ్వసిస్తాను. నా నమ్మకానికి అభిమానులే ఆలంబనగా భావిస్తున్నాను. మీరు అందిస్తున్న స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాల్ని సాధించడానికి కృషి చేస్తాను. గత ఏడాది నాకు అపూర్వ విజయాలు దక్కాయి. ఇదే ఆత్మవిశ్వాసంతో నూతన సంవత్సరంలో కూడా పని చేస్తాను. మీ హృదయాల్లో చోటిచ్చినందుకు సదా కృతజ్ఞురాలిని' అని నయనతార లేఖలో పేర్కొంది.


నయనతార

వెండితెరపైకి వై.ఎస్. రాజశేఖరరెడ్డి జీవితం?

తెలుగులో బయోపిక్‌ల పరంపర మొదలైంది. మహానటి సావిత్రి జీవిత కథ ఆధారంగా 'మహానటి' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. త్వరలో ఎన్టీఆర్ జీవిత కథ ఆధారంగా రామ్‌గోపాల్‌వర్మ ఓ చిత్రాన్ని, తేజ మరో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ జాబితాలోనే మరో బయోపిక్‌ని తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల 'ఆనందోబ్రహ్మ' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న దర్శకుడు మహి. వి. రాఘవ్ తన తదుపరి చిత్రంగా దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి జీవిత కథని తెరకెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించనున్నారని, ఇందులో వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాత్రలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి నటించనున్నట్లు సమాచారం. గతంలో వై.ఎస్.జీవిత కథ ఆధారంగా 'రాజశేఖరరెడ్డి' పేరుతో పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించాలని ప్రయత్నాలు చేశారు. రాజశేఖర్ హీరోగా తెరకెక్కాల్సిన ఈ చిత్రం కొన్ని అనివార్య కారణాలవల్ల కార్యరూపం దాల్చలేదు.


మమ్ముట్టి


శ్రీనివాసరావు

శీనుగాడి ప్రేమకథ

శ్రీనివాసరావు, ప్రణవి, కావేరి, చాందిని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'శీనుగాడిప్రేమ'. 'సిన్సియర్ రా మామా' ఉపశీర్షిక. ఆర్.కె. డి. దర్శకుడు. ధరిమిశెట్టి సత్యేశ్వరి నిర్మాత. నిర్మాత మాట్లాడుతూ 'ప్రేమ, యాక్షన్, వినోదం, భావోద్వేగాలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. తన ప్రేమకు ఎదురైన అవరోధాల్ని శీను అనే యువకుడు ఎలా అధిగమించాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ప్రేమ గొప్పతనాన్ని చాటిచెప్పే చిత్రమిది. అరకు, వైజాగ్, కాణిపాకం, తిరుపతి, చెన్నై, హైదరాబాద్‌లలో చిత్రీకరణ జరిపాం.నిర్మాణానంతర కార్యక్రమాల్ని పూర్తిచేసి త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. రాంపల్లి వెంకటరమణ, రమ్య, భవాని, వెంకట సుబ్బారావు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్, సంగీతం: రమణ.


HAPPY
BIRTHDAY
BELLAMKONDA
SAI SREENIVAS
BEST WISHES FROM
ABHISHEK NAMA SRIWASS
AND SAAKSHYAM TEAM
FIRSTLOOK ON THIS PONGAL
design anil&bhanu

- రాష్ట్ర రూపురేఖలను మార్చనున్న కాళేశ్వరం
- రికార్డు సమయంలో ప్రాజెక్టుకు అనుమతులు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతుల సాధనలో కీలకపాత్ర పోషించిన అధికారులను సన్మానించిన మంత్రి హరీశ్‌రావు

పంజాబ్, హర్యానాలకు దీటుగా తెలంగాణ



కాళేశ్వరం ప్రాజెక్టుకు వేగంగా అనుమతులు రావడంలో కీలకపాత్ర పోషించిన అటవీశాఖ, ఈపీటీఆర్ఐ అధికారులకు గ్రాండ్ కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రానున్నకాలంలో వ్యవసాయరంగంలో పంజాబ్, హర్యానాలకు దీటుగా తెలంగాణ నిలుస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర సాగునీటి రూపురేఖలను మార్చనుందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌కు తాగునీటితోపాటు, పాత ఆరు జిల్లాలకు కాళేశ్వరం ద్వారా సాగునీరు అందుతుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తును ఖరారు చేస్తుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వేగంగా అనుమతులు రావడంలో కీలకపాత్ర పోషించిన అటవీశాఖ, ఈపీటీఆర్ఐ అధికారులను మంత్రి మంగళవారం గ్రాండ్ కాకతీయ హోటల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 60 శాతం తెలంగాణ భవిష్యత్తు కాళేశ్వరం ప్రాజెక్టుపైనే ఆధారపడి ఉన్నదని చెప్పారు. ఒక్కోరోజు దాదాపు 12-14 గంటలు కాళేశ్వరంపై సీఎం కేసీఆర్ సమీక్షించారని గుర్తుచేశారు.'అటవీ, పర్యావరణ తదితర పదికిపైగా కీలకమైన అనుమతులను తక్కువకాలంలో సాధించడం సాధారణ విషయం కాదు. కోర్టు కేసులు ఎదుర్కొన్నాం. వాటిని తిప్పి కొట్టగలిగాం. జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు పూర్తిగా సహకరించారు. అటవీశాఖ ఉన్నతాధికారులు గొప్పగా పని చేశారు' అని హరీశ్‌రావు కొనియాడారు. సీఎం పట్టుదల వల్ల అనుమతులు అత్యంత త్వరగా వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జోషి, ఈఎన్సీ మురళీధర్‌రావు, పీసీసీఎఫ్ ఝా, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ చక్రవర్తి, కాళేశ్వరం సీఈ హరిరాం పాల్గొన్నారు.

రాత్రి ఉష్ణోగ్రతల్లో స్వల్ప పెరుగుదల

ఆదిలాబాద్/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతల్లో స్వల్ప పెరుగుదల నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. చలిగాలుల తీవ్రత కాస్త తగ్గడమే ఉష్ణోగ్రతలు పెరుగడానికి కారణమని తెలిపింది. ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత మినహా, రాష్ట్రంలోని మిగితా అన్నిప్రాంతాల్లోనూ 12 డిగ్రీలు, ఆ పైనే నమోదైనట్టు చెప్పారు. ఆదిలాబాద్‌లో సోమవారం 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, మంగళవారం ఒక డిగ్రీ పెరిగి 7.5 డిగ్రీలుగా నమోదైందని, హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే ఒక డిగ్రీ పెరిగి 16 డిగ్రీలుగా నమోదైంది. మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 33 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయిందని పేర్కొన్నది.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	29.5	7.5
నిర్మల్	29.5	7.5
మంచిర్యాల	29.5	7.5
కుమ్రంభీం ఆసిఫాబాద్	29.5	7.5
జగిత్యాల	29.5	10.0
వికారాబాద్	29.8	11.7
పెద్దపల్లి	30.5	13.3
కరీంనగర్	34.3	13.3
జనగామ	30.0	14.0
వరంగల్ రూరల్	31.0	14.0
ఖమ్మం	32.0	14.0
నిజామాబాద్	31.4	14.9
కామారెడ్డి	31.4	14.9
సూర్యాపేట	29.0	15.0
జయశంకర్ భూపాలపల్లి	30.0	15.0
హైదరాబాద్	28.0	16.0
రంగారెడ్డి	28.0	16.0
మేడ్చల్	28.0	16.0
యాదాద్రి భువనగిరి	29.0	16.0
రాజన్న సిరిసిల్ల	30.0	16.0
వరంగల్ అర్బన్	31.0	16.0
నాగర్‌కర్నూల్	31.0	16.0
మహబూబాబాద్	31.0	16.0
భద్రాద్రి కొత్తగూడెం	32.0	16.0
మెదక్	30.2	16.3
సంగారెడ్డి	30.2	16.3
సిద్దిపేట	30.2	16.3
నల్లగొండ	29.8	17.0
జోగులాంబ గద్వాల	31.0	17.1
వనపర్తి	31.0	17.4
మహబూబ్‌నగర్	31.8	18.0

ఏపీ హైకోర్టుకు భవనాలు ఎంపికచేశాం

- పరిశీలించి ఈ నెల చివరివారంలోగా నిర్ణయం చెప్పండి
- ప్రస్తుతానికి తాత్కాలిక భవనాల్లో ఏపీ హైకోర్టు ఏర్పాటు
- ఫిబ్రవరి నుంచి భవనాల పనులు మొదలుపెడుతాం
- జూన్ నుంచి ప్రారంభానికి సిద్ధం చేస్తాం.. ఏసీజేకు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ
- లేఖ నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తుల సమావేశం నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వీలైనంత త్వరగా ఏపీ హైకోర్టును ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారు. ఏపీ హైకోర్టు ఏర్పాటుపై ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు చంద్రబాబు లేఖ రాశారు. హైకోర్టు నిర్వహణ కోసం ఎంపికచేసిన తాత్కాలిక భవనాలను పరిశీలించి, ఈ నెల చివరివారంలోగా నిర్ణయం చెప్పాలని విజ్ఞప్తిచేశారు. ఏపీ సర్కార్ తరపున ఆ రాష్ట్ర అడ్వొకేట్‌జనరల్ (ఏజీ) దమ్మలపాటి శ్రీనివాస్ రెండురోజుల కిందట ఈ లేఖను ఏసీజేకు అందించారు. 'సొంత రాష్ట్రంలో ఏపీ హైకోర్టును త్వరితగతిన ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నూతన రాజధాని అమరావతిలో శాశ్వత హైకోర్టు భవనాల నిర్మాణం (జస్టిస్ సిటీ) కొలిక్కి రానందున.. ప్రస్తుతానికి తాత్కాలిక భవనాల్లోనే ఏపీ హైకోర్టును ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా హైకోర్టు కార్యకలాపాల నిర్వహణ, న్యాయమూర్తులకు, హైకోర్టు సిబ్బందికి వసతి సౌకర్యాలపై కసరత్తు చేశాం. హైకోర్టు నిర్వహణ కోసం కొన్ని భవనాలను ఎంపికచేశాం' అని లేఖలో పేర్కొన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలు, హైకోర్టు విభజనపై ఉమ్మడి హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంలో వెలువడిన ఉత్తర్వుల ప్రకారం ఏపీలో హైకోర్టు భవనం తదితర విషయాలపై హైదరాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కలిసి సంప్రదింపులు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకోవాల్సిందిగా పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటుచేసి, ఏపీలో భవనాలను ఈ నెల రెండోవారంలో పరిశీలించి చివరివారంలోగా అభిప్రాయాలు, నిర్ణయాలు చెప్పాల్సిందిగా పేర్కొన్నట్టు సమాచారం. కమిటీ ఎంపిక చేసిన భవనాల విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాక.. హైకోర్టు నిర్వహణ కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరించారు. ఫిబ్రవరి నుంచి పనులు మొదలుపెడుతామని, మే నెల వరకు పూర్తిచేస్తామని చెప్పారు. సౌకర్యాల కల్పనపై మరోసారి ఏప్రిల్‌లో న్యాయమూర్తుల కమిటీ పరిశీలించి, మార్పులుచేర్పులు ఉంటే తెలియజేయాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వ సిఫారసుల మేరకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తర్వాత, ఈ ఏడాది జూన్‌లో ఏపీ హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభించేందుకు రాష్ట్ర సర్కార్ తరపున తమ వంతు కృషి చేయనున్నట్టు చంద్రబాబు లేఖలో వివరించారు.

రెండు లక్షల చదరపు అడుగుల స్థలం ఎంపిక

తాత్కాలిక భవనాల్లో ఏపీ హైకోర్టు నిర్వహణ కోసం రెండు లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఆ రాష్ట్ర సర్కారు ఎంపిక చేసినట్టు తెలిసింది. కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల చాంబర్లు, పరిపాలన భవనం, న్యాయమూర్తులు, న్యాయవాదుల లైబ్రరీలు, న్యాయవాద సంఘం, న్యాయవాదుల క్లర్కులు, రికార్డు రూంలు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని స్థలాన్ని ఎంపికచేసినట్టు సమాచారం. ఉమ్మడి హైకోర్టులో నిష్పత్తి ప్రకారం ఏపీ హైకోర్టులో 37 కోర్టు హాళ్లను ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. న్యాయమూర్తుల అందుబాటు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే 25కోర్టు హాళ్లు రెగ్యులర్‌గా పనిచేసే అవకాశముంది. 50వేల చదరపు అడుగులకు పైగా స్థలం కోర్టు హాళ్లకే సర్దుబాటు అవుతుంది. వీటికి అదనంగా జడ్జీల చాంబర్లు, సమావేశ మందిరం, సీనియర్ న్యాయవాదులకు చాంబర్లు, కేసుల ఫైళ్లను భద్రపర్చే స్థలంతోపాటు హైకోర్టు నిర్వహణ కోసం పరిపాలన భవనం, హైకోర్టు న్యాయవాదుల సంఘాలకు అదనంగా స్థలం కావాల్సి ఉంది.

నేడు ఫుల్‌కోర్టు సమావేశం

ఏపీ సర్కార్ తరపున చంద్రబాబు రాసిన లేఖ విషయాన్ని సీజేఏ జస్టిస్ రమేశ్ రంగనాథన్ మంగళవారం సహచర న్యాయమూర్తులకు తెలియజేశారు. న్యాయమూర్తులు తమ నిర్ణయాలు తెలిపేందుకు వీలుగా బుధవారం ఫుల్‌కోర్టు (హైకోర్టు న్యాయమూర్తులందరితో) సమావేశం నిర్వహించనున్నారు.

ఏసీజేకు ఏపీ న్యాయవాదుల వినతి

ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుపై చర్యల నేపథ్యంలో మంగళవారం ఏపీ రాష్ట్రానికి చెందిన న్యాయవాదులు పెద్దసంఖ్యలో ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్‌ను కలిశారు. హైకోర్టు ఏర్పాటు విషయంలో తమ అభిప్రాయాలు సైతం పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. దీనిపై వినతిపత్రం సమర్పించాలని న్యాయవాదులకు ఏసీజే సూచించారు.





మంగళవారం అరుణ్‌సాగర్ ఉత్తమ జర్నలిస్టు అవార్డ్ కార్యక్రమంలో సాహితీ పురస్కారం అందుకున్న ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి పత్రికల సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి, కే శ్రీనివాస్ తదితరులు. పక్కన.. సభలో గోరటి వెంకన్న ఆటాపాట

అరుదైన జర్నలిస్ట్ అరుణ్‌సాగర్

- కొందరి గొప్పతనం మరణించిన తర్వాతనే సమాజానికి తెలుస్తుంది: మంత్రి హరీశ్‌రావు
- అరుదైన ఆదివాసీ జీవితాలను అధ్యయనం చేసిన అరుణ్‌సాగర్: మంత్రి తుమ్మల
- తెలంగాణ మీడియా అకాడమీ సారథ్యంలో అరుణ్‌సాగర్ అవార్డుల సభ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కొందరి గొప్పతనం వారు మరణించిన తర్వాతే సమాజానికి తెలుస్తుందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సాహిత్యంతోపాటు, పాత్రికేయ రంగంలోనూ తన విలక్షణమైన ప్రతిభతో సమాజానికి గొప్ప సందేశాన్నిచ్చిన అరుణ్‌సాగర్ జీవితం మహోన్నతమైనదని పేర్కొన్నారు. అలాంటి అరుదైన జర్నలిస్ట్ దురదృష్టవశాత్తూ చిన్న వయసులోనే మరణించడం బాధాకరమని..ఆయన చనిపోయిన తర్వాత మరింత గొప్పవాడిగా వర్ధమాన పాత్రికేయులకు ఆదర్శంగా నిలిచారని మంత్రి నివాళి అర్పించారు. ప్రఖ్యాత జర్నలిస్ట్, కవి, అరుణ్‌సాగర్ జయంతి సందర్భంగా మంగళవారం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అవార్డులు, సాహిత్య అవార్డు సభ నిర్వహించారు. తెలంగాణ మీడియా అకాడమీ సారథ్యంలో జరిగిన ఈ సభలో అరుణ్‌సాగర్ పేరిట ఏర్పరిచిన సాహితీ అవార్డును ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు ప్రదానం చేశారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లంనారాయణ సభకు అధ్యక్షత వహించారు. మంత్రి హరీశ్‌రావుతో పాటు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి, 'నమస్తే తెలంగాణ' ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్, టీవీ-5 వసంత్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి కే శివారెడ్డి పాల్గొన్నారు. ప్రింట్ మీడియా విభాగంలో నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ వరకాల కృష్ణయ్యకు అరుణ్‌సాగర్ జర్నలిస్ట్ అవార్డుల విభాగంలో ప్రథమ బహుమతి లభించింది..'మరణమూ నేరమేనా?' అనే వార్తా కథనానికి గాను ఈ పురస్కారాన్ని ప్రకటించారు. నవతెలంగాణలో పనిచేస్తున్న జర్నలిస్ట్ జీ శివరామకృష్ణయ్య రాసిన 'తెలంగాణ ఎడారి బతుకుచిత్రం' కథనానికి ద్వితీయ బహుమతి ఇచ్చారు. సాక్షి పత్రిక పెద్దపల్లి జర్నలిస్ట్ కట్టా నరేంద్రాచారి రాసిన 'వారికి ఒకరోజు వెలుగులు', కోలా నాగేశ్వర్‌రావు (ఆంధ్రజ్యోతి) రాసిన గిరిజనుల కన్నీటిసాగరం కథనాలకు తృతీయ బహుమతి లభించింది. తృతీయ బహుమతికి ఇద్దరిని ఎంపిక చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో సాక్షి ఔట్‌పుట్ ఎడిటర్ యాజులుకు ప్రథమ బహుమతి, హెచ్ఎంటీవీ మహబూబ్‌నగర్ విలేకరి నరేంద్రచారికి ద్వితీయ, ఆదిలాబాద్ ఈటీవీ విలేకరి మాణికేశ్వర్‌కు మూడోబహుమతి లభించాయి. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ జర్నలిస్టులు పని ఒత్తిడితో తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపుతుంటారని, రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెచ్చినందున ఎప్పటికప్పుడు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండకపోవడం వల్లనే అరుణ్‌సాగర్ అకాలమరణానికి గురయ్యారని అభిప్రాయపడ్డారు. విద్య సామాజిక బాధ్యతను పెంచుతుందని చెప్పడానికి అరుణ్‌సాగర్ ఎప్పటికీ ఉదాహరణగా నిలిచి ఉంటారని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ముంపులో గురవుతున్న అరుదైన ఆదివాసీ కుటుంబాల జీవన స్థితిగతులను నిశితంగా అధ్యయనం చేసిన అరుణ్‌సాగర్ కృషి చాలా గొప్పదని ప్రశంసించారు. ఆయన సేవలను గుర్తిస్తూ టీవీ5 సంస్థ, తెలంగాణ మీడియా అకాడమీ అరుణ్‌సాగర్ పేరిట జర్నలిస్ట్ అవార్డులను, సాహిత్య పురస్కారాన్ని నెలకొల్పడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి అవార్డులు అరుణ్‌సాగర్ ఆత్మకు శాంతిని చేకూరుస్తాయని అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను పనిచేసిన చోట విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన జర్నలిస్ట్ అరుణ్‌సాగర్ అని నివాళులు అర్పించారు. సభాధ్యక్షత వహించిన అల్లంనారాయణ మాట్లాడుతూ అరుణ్‌సాగర్ కొద్దికాలంలోనే గొప్ప కవిత్వం రాసి సాహిత్యంపైన, జర్నలిజంపైన చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆయన సేవలను చిరస్మరణీయం చేయాలనే సంకల్పంతోనే అవార్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. చిన్నవయసులోనే మరణించిన అరుణ్‌సాగర్ సాహిత్యం, కళలు, సాంకేతిక పరిజ్ఞానం, జర్నలిజం వంటి అన్ని రంగాలలో విశేష ప్రతిభను కనబరిచారని చెప్పారు. టీవీ-5 వసంత్ మాట్లాడుతూ జర్నలిస్టులకు టీవీ-5 సంపూర్ణ అండదండలందిస్తుందని చెప్పారు. జ్యూరీ తరపున ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ మీడియా కన్నా ప్రాంతీయ మీడియా జర్నలిజం విలువలకు ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు.

కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో మీడియా: పాలగుమ్మి సాయినాథ్

జర్నలిజం భారతీయఆత్మను కోల్పోతున్నదని కార్యక్రమంలో గెస్ట్‌లెక్చర్ ఇచ్చిన పాలగుమ్మి సాయినాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మీడియా ఆదాయవనరులకే ప్రాధాన్యం ఇస్తున్నదని విమర్శించారు. దేశంలో 68శాతం ఉన్న గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులను కష్టాలను జాతీయ మీడియా పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రధాన మీడియా.. కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో ఉన్నదని ఉదాహరణలతో సహా వివరించారు. కేంద్ర క్యాబినెట్ మంత్రులుగా ఎవరుండాలనే విషయాలను కార్పొరేట్ శక్తులు నిర్ణయిస్తున్నాయన్నారు. అన్నార్తులను, కష్టజీవులను, వ్యవసాయరంగంలో వస్తున్న సంక్షోభాలను, ఆకలి మరణాలను, రైతుల మరణాలను జాతీయ మీడియా పట్టించుకోవడం లేదన్నారు. వాణిజ్య ప్రకటనలతో ముడిపడిన వార్తలకు మీడియాలో ప్రాధాన్యం లభిస్తున్నదని తెలిపారు. ఇటీవల జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు.1992 నుంచి 2017 వరకు 50 మందికి పైగా జర్నలిస్టులు హత్యకు గురయ్యారని చెప్పారు. సైద్ధాంతికంగా విభేదిస్తున్న జర్నలిస్టులను హతమార్చడం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని ఆరోపించారు. గౌరీలంకేశ్ హత్య ఇటువంటిదేనని స్పష్టంచేశారు. బీజేపీ, కాంగ్రెస్, ఇతర సంకీర్ణ ప్రభుత్వాలన్నీ జర్నలిస్టులను వేధిస్తున్నాయని చెప్పారు. హత్యకు గురైన 50 మంది జర్నలిస్టులలో 27 మంది వారు రాసిన వార్తాకథనాల కారణంగానే హత్యకు గురయ్యారని, ఇందుకు ఆధారాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

గజల్ శ్రీనివాస్ గలీజ్!

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ యువతి, గజల్ శ్రీనివాస్ ఖైరతాబాద్ ఆనంద్‌నగర్‌లో నిర్వహిస్తున్న 'సేవ్ టెంపుల్' అనే సంస్థ పేర నిర్వహిస్తున్న ఆలయవాణి రేడియోలో జాకీగా ఉద్యోగంలో చేరి ఇంచార్జి అయ్యింది. సంస్థ యజమానులు ఆమెరికాలో ఉండగా శ్రీనివాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహారాలు చూసుకుంటున్నాడు. యువతిపై గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపులు మొదలుపెట్టాడు. మసాజ్ చేయాలని వెకిలి ప్రవర్తనతో లైంగికవేధింపులకు గురిచేస్తూ వచ్చాడు. ఆమె ముందు బట్టలు విప్పి గంతులేశాడు. తాను చెప్పినట్టు చేస్తే ఆర్థికంగా ఆదుకుంటానని, మంచి పొజిషన్‌లోకి తెస్తానని ఆశ చూపాడు. గజల్ శ్రీనివాస్ వద్ద పీఏగా పనిచేసే పార్వతి అనే మహిళ తాను మసాజ్ చేస్తానని, నువ్వు కూడా మసాజ్ చేయాలని ఒత్తిడి తెచ్చింది. బాధితురాలు ఉద్యోగం మానేద్దామనుకోగా, గజల్ శ్రీనివాస్ అడ్డుచెప్పాడు. ఎక్స్‌పీరియెన్స్ సర్టిఫికెట్ కూడా ఇవ్వనని బెదిరించాడు. అవమానాలు, వేధింపులు దిగమింగుకుంటూ గజల్ వికృతచేష్టలపై సాక్ష్యాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడుగా గజల్ శ్రీనివాస్‌ను, అతనికి సహకరిస్తున్న అతని పీఏ పార్వతిని రెండో నిందితురాలిగా చేర్చారు. గజల్ శ్రీనివాస్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. పార్వతి పరారీలో ఉంది. గజల్ శ్రీనివాస్‌ను నాంపల్లి కోర్టులో హాజరు పరచడంతో 12వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. గజల్ శ్రీనివాస్‌ను విచారించేందుకు 7 రోజుల కస్టడీ ఇవ్వాలని పంజాగుట్ట పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

గజల్స్‌తో గిన్నిస్... రాసలీలలతో జైలుకు

ఏపీలోని శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన గజల్ శ్రీనివాస్ అసలు పేరు కేశరాజు శ్రీనివాస్. భీమవరంలో చదువుకునే సమయంలో సత్యసాయి సేవాసమితిలో, ఆలయాలలో భజనలలో పాల్గొనేవాడు. నాటకాలలో దుర్యోధనుడి వేషాలు కూడా వేసేవాడు. భీమవరంలో లైబ్రేరియన్‌గా, మ్యూజిక్ టీచర్‌గా పనిచేశాడు. కొన్నాళ్లు సైనిక్ స్కూళ్లలో కూడా పనిచేశాడు. 2000 సంవత్సరంలో వాటిని వదిలేసి ల్యాంకో గ్రూప్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారాడు. 2001లో ఆధ్యాత్మిక పాటలు పాడడం ప్రారంభించాడు. కేంద్ర, జిల్లా కారాగారాల్లో తన పాటల ద్వారా ఖైదీల్లో పరివర్తన కోసం కార్యక్రమాలిచ్చేవాడు. 2005లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారుగా నియమించింది. ఆ సమయంలో అప్పటి సంక్షేమ పథకాలైన వెలుగు పేరును మార్చి ఇందిరా క్రాంతి పథకంగా తానే మార్చినట్టు సొంత వెబ్‌సైట్‌లో రాసుకున్నాడు. 2005లో చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించాడు. 2008లో నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. 2006లో విచిత్రం, ఏ ఫిలిమ్ బై అరవింద్ వంటి తెలుగు సినిమాలలోనూ నటించాడు. 2008, 2009, 2010లో గజల్ కార్యక్రమాలతో మూడు గిన్నిస్ రికార్డులు సాధించాడు. వివిధ దేశాలలో కార్యక్రమాలు నిర్వహించి పలు అవార్డులు అందుకున్నాడు. ప్రస్తుతం సేవ్ టెంపుల్స్.ఓఆర్‌జీ నిర్వహిస్తున్న సేవ్ టెంపుల్స్ మిషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా, విజయవాడ రోటరీక్లబ్‌కు గౌరవసభ్యుడుగా, లయన్ ఇంటర్నేషనల్‌కు గౌరవ సలహాదారుగా, ఫలింనగర్ కల్చరల్ సెంటర్, ఆంధ్ర కల్చరల్ క్లబ్‌లకు జీవితకాల గౌరవసభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకున్న పలుకుబడితో ఓ నామినెటెడ్ పదవి పొందేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ సమయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీనివాస్ వ్యవహారంపై ఆరాతీసిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అతడు స్త్రీలోలుడని రహస్య నివేదికను ఇవ్వడంతో ఆ పదవి చేజారినట్టు సమాచారం.



గజల్ శ్రీనివాస్ మసాజ్ చేయించుకున్న దృశ్యం(ఫైల్)

ఆటబొమ్మలా చూస్తాడు: బాధితురాలు



ఆడపిల్లలంటే కోరిక తీర్చే ఆట బొమ్మలా చూస్తాడు. మాయ మాటలు చెప్పి లొంగదీసుకుంటాడు. బయట కనిపించే వ్యక్తికి, అతని నిజస్వరూపాని కి చాలా వ్యత్యాసం ఉంది. అతనో కామపిశాచి.. అంటూ బాధితురాలు తన ఆవేదనను మీడియాతో బాధితరురాలు పంచుకుంది. సాటి ఆడపిల్లకు భవిష్యత్తులో అన్యా యం జరుగకూడదనే గజల్ శ్రీనివాస్ కామలీలల వీడియోలను బయటపెట్టానని చెప్పింది. ఎనిమిది నెలల క్రితం ఈ సంస్థలో చేరానని, గత రెండునెలలుగా గజల్ శ్రీనివాస్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని తెలిపింది. త్వరలోనే ఓ రాష్ట్రానికి గవర్నర్ కాబోతున్నానని, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ ఇప్పిస్తానని ఆశ చూపాడని, నిరాకరించటంతో వేధించాడని వివరించింది. తన నుంచి తప్పించుకోలేనని, ఎక్కడికి వెళ్లినా వెంబడిస్తానని బెదిరించాడని వాపోయింది. భర్త, పిల్లలు ఉన్నా గుట్టుగా శ్రీనివాస్ చెప్పినట్టు చేస్తలేనా.. నువ్వు కూడా అలాగే చేయమంటూ తనపై ఒత్తిడి తెచ్చేదని తెలిపింది. అతని బాగోతాలను బయపెట్టేందుకు వీడియో తీశానని చెప్పింది.

ఫిజియోథెరపి చేయించుకున్నా

ఆమెను నా బిడ్డలా చూశాను. ఆధ్యాత్మిక సంస్థలో పెరిగిన అమ్మాయి ఆమె. ఆత్మసాక్షిగా చెబుతున్నా ఆమెను వేధించాననడం అవాస్తవం. ఆమె ఏ దృష్టితో అలా చేసిందో నాకు తెలియదు. ఇటీవల నాకు యాక్సిడెంట్ అయ్యింది. నాకు ఫిజియోథెరపి అవసరం. అప్పుడు ఆ అమ్మాయి వచ్చి నేను ఫిజియోథెరపీ చేస్తానని చెప్పింది. నాకు మందురాసి మసాజ్ చేసింది. అంతే తప్ప ఆమెను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదు. (కామలీలల వీడియోలు బహిర్గతం కాకముందు మీడియాతో నిందితుడు శ్రీనివాస్ చెప్పిన మాటలివి).

-గజల్ శ్రీనివాస్

సాక్ష్యాలు బలంగా ఉన్నాయి

గజల్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణల్లో సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. అన్నిరకాల ఆధారాలు సేకరించిన తర్వాతే అతన్ని అరెస్టు చేశాం. ఆడియో, వీడియో క్లిప్పింగ్స్ ఆధారంగా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన అనంతరమే అతడు నేరం చేసినట్టు వెలుగులోకి వచ్చింది. అతనితో లైంగిక సంబంధం కలిగి ఉన్న పార్వతిని ఏ2 నిందితురాలిగా పరిగణించి ఆమెపై కూడా కేసు నమోదు చేశాం. అతనిపై 354, 354(ఏ), 509 రెడ్ విత్ 109 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

- విజయ్‌కుమార్, పంజాగుట్ట ఏసీపీ

కీలక స్థానాల్లో సమర్థులైన ఐఏఎస్‌లు.. భారీగా బదిలీలు

మొదటిపేజీ తరువాయి...

పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు ఆ పదవిలో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్‌ను రిలీవ్ చేశారు. జలమండలి ఎండీగా ఉన్న దానకిశోర్‌కు మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఇప్పటివరకు వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారులు ఇళంబర్తి, చంపాలాల్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్న అరవింద్‌కుమార్‌కు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి బాధ్యతలతో పాటు సమాచార, ప్రజాసంబంధాలశాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంకా మెదక్,మహబూబాబాద్, జనగామ, భూపాల్‌పల్లి జిల్లాలకు కలెక్టర్లను నియమించాల్సి ఉన్నది. కాబట్టి మరి కొందరు ఐఏఎస్‌ల బదిలీలు కూడా జరుగవచ్చునని తెలుస్తున్నది.

బదిలీ, నియామకాల వివరాలు:

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సురేశ్ చందా (స్పెషల్ సీఎస్)	పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధిశాఖ	తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ
బీఆర్ మీనా(స్పెషల్ సీఎస్)	రెవెన్యూశాఖ	ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యదర్శి
రాజేశ్వర్ తివారి(స్పెషల్ సీఎస్)	వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ	రెవెన్యూశాఖ
ఏ శాంతికుమారి(ముఖ్యకార్యదర్శి)	సీఎంఓతో పాటు అదనంగా	వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ
అరవింద్‌కుమార్ (ముఖ్యకార్యదర్శి)	ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్	పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ, ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
అశోక్‌కుమార్ (ముఖ్యకార్యదర్శి)	బీసీ సంక్షేమశాఖ	తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్
బీ వెంకటేశం (కార్యదర్శి)	పర్యాటక, సాంస్కృతిక, యువజన వ్యవహారాలు, అదనంగా బీసీ సంక్షేమ(ఎఫ్ఏసీ)	
నవీన్ మిట్టల్ (కార్యదర్శి)	పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ	కాలేజీ విద్య, సాంకేతిక విద్య కమిషనర్
ఆర్వీ చంద్రవదన్(కార్యదర్శి)	ఆబ్కారి శాఖ కమిషనర్	రెవెన్యూడిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్
సోమేశ్‌కుమార్(ముఖ్యకార్యదర్శి)	రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖతోపాటు అదనంగా ఆబ్కారీశాఖ కమిషనర్(ఎఫ్ఏసీ)	
సందీప్‌కుమార్ సుల్తానియా(కార్యదర్శి)	ఆర్థికశాఖ	పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ
అనితా రాజేంద్ర(కార్యదర్శి)	హోంశాఖ	బీసీ సంక్షేమశాఖ కమిషనర్, బీసీ కమిషన్ సెక్రటరీ
సయ్యద్ ఉమర్ జలీల్ (కార్యదర్శి)	మైనార్టీ సంక్షేమశాఖ	వికారాబాద్ కలెక్టర్
దాన కిశోర్(కార్యదర్శి)	జలమండలి ఎండీ	మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ)
డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు	పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ	గిరిజన సంక్షేమశాఖ కమిషనర్
డాక్టర్ జ్యోతి బుద్ధప్రసాద్	వెయిటింగ్	ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి
వాకాటి కరుణ	ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ (బదిలీ చేసి ఎఫ్ఏసీగా కొనసాగిస్తున్నారు.)	సీసీఎల్ఏ డైరెక్టర్
కే ఇళంబర్తి	వెయిటింగ్	రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కార్యదర్శి
ఎం చంపాలాల్	వెయిటింగ్	హోం(సైనిక్ వెల్ఫేర్) జాయింట్ సెక్రటరీ
ఎం ఆర్ ఎం రావు	పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీ	నిజామాబాద్ కలెక్టర్
ఎ.శ్రీ దేవసేన	కలెక్టర్ జనగామ	కలెక్టర్ పెద్దపల్లి
అనితా రామచంద్రన్	కలెక్టర్ యాద్రాది-భువనగిరితో పాటు జనగామ జిల్లా కలెక్టర్‌గా(ఎఫ్ఏసీ)	
ఏ మురళి	కలెక్టర్ జయశంకర్- భూపాల్‌పల్లి	స్టేట్ ఆర్కీవ్స్ డైరెక్టర్
ఆర్.వి కర్నన్	కలెక్టర్ మంచిర్యాల జిల్లాతో పాటు జయశంకర్-భూపాల్ పల్లి జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసీ)	
భారతి హోళికెరి	కలెక్టర్ మెదక్ జిల్లా	జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్
మాణిక్యరాజ్	కలెక్టర్ సంగారెడ్డితో పాటు మెదక్ కలెక్టర్‌గా (ఎఫ్ఏసీ)	
డాక్టర్ ప్రీతిమీనా	కలెక్టర్ మహబూబాబాద్ మహబూబాబాద్ కలెక్టర్ బాధ్యతలను ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఎఫ్ఏసీగా ఇచ్చారు	ఎయిడ్స్‌కంట్రోల్ సొసైటీ డైరెక్టర్
కిల్లు శివకుమార్‌నాయుడు	మహబూబ్‌నగర్ జేసీ (మహబూబ్‌నగర్ జేసీ బాధ్యతలను అంతర్గతంగా సర్దుబాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు)	రాష్ట్ర ప్రణాళికాబోర్డు కార్యదర్శి
కర్నాడే ఖాళీ చరణ్ సుదమ్‌రావు	సీసీఎల్ఏ కార్యదర్శి	ఢిల్లీ తెలంగాణ భవన్ ఓఎస్‌డీ
సిక్తా పట్నాయక్	బోధన్(నిజామాబాద్) సబ్ కలెక్టర్	జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్
ఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ	మెట్‌పల్లి(జగిత్యాల) సబ్ కలెక్టర్	జీహెంఎంసీ అదనపు కమిషనర్
అనురాగ్ జయంతి	--	బోధన్ సబ్ కలెక్టర్
గౌతం పొత్రు	--	మెట్‌పల్లి సబ్ కలెక్టర్
పమేలా సత్పతి	--	భద్రాచలం సబ్ కలెక్టర్
రాహుల్ రాజ్	--	బెల్లంపల్లి సబ్ కలెక్టర్



పీఆర్టీయూ డైరీని ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతిభవన్‌లో పీఆర్టీయూ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్దన్‌రెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు సర్వోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎస్‌కు ఉద్యోగ సంఘాల నేతల శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను మంగళవారం సచివాలయంలో పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐఏఎస్ అధికారులు తమశాఖల ఉన్నతాధికారులతో కలిసి వచ్చి సీఎస్‌కు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్‌రావు, తెలంగాణ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివశంకర్ తమ సంఘాల నాయకులతో వచ్చి సీఎస్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం కేసీఆర్‌కు హోంగార్డుల సంఘం నేతల శుభాకాంక్షలు

ప్రగతిభవన్‌లో మంగళవారం సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర హోంగార్డుల సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కే దయానంద్, సైబరాబాద్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, హరి, కుమారస్వామి తదితరులు

రామప్పకు యునెస్కో గుర్తింపు సాధించాలి

- తెలంగాణలోని పురావస్తు కట్టడాలను అభివృద్ధిపర్చాలి
- లోక్‌సభలో ఎంపీలు సీతారాంనాయక్, బూర నర్సయ్యగౌడ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని చారిత్రక కట్టడాలను గుర్తించడంలో వివక్షను సరిచేసి వాటిని అభివృద్ధి చేయాలని టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం లోక్‌సభలో చారిత్రక, పురావస్తు కట్టడాలు, ప్రాచీన స్మారకచిహ్నాల చట్టసవరణపై జరిగిన చర్చలో రాష్ట్రానికి చెందిన మహబూబాబాద్ ఎంపీ సీతారాం నాయక్, భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు. ఈ చట్టం ప్రకారం పురావస్తు కట్టడాలకు 100 మీటర్ల పరిధిలోపు ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ప్రజల కనీస అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా ఇప్పుడు చట్ట సవరణ చేపట్టారు. ఈ సవరణపై చర్చ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ ఈ బిల్లుకు మద్దతు తెలుపుతున్నదన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో మొత్తం 130 చారిత్రక, పురావస్తు కట్టడాలు ఉండగా విభజనలో తెలంగాణ వంతుకు 8 కట్టడాలు మాత్రమే వచ్చాయని, మిగిలినవి ఏపీలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో అనేక పురావస్తు కట్టడాలు ఉన్నాయని, వాటిలో 24 కట్టడాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని, ఇంతవరకు కేంద్రం నుంచి ఎలాంటి వర్తమానం రాలేదని చెప్పారు. రాష్ట్రంలో రామప్ప, వేయిస్తంభాలగుడి, ఖిలా వరంగల్ , కోటగుళ్ల దేవాలయాల వంటి అనేక కట్టడాలకు చారిత్రక నేపథ్యం ఉందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ధూళికట్ట బౌద్ధస్తూపం, అలంపూర్ శక్తిపీఠం లాంటివి తెలంగాణలో ఉన్నాయన్నారు. వేయిస్తంభాల దేవాలయంలోని మండపాన్ని 2005లో తొలగించినా ఇప్పటివరకు పునర్నిర్మాణం కొనసాగుతూనే ఉందన్నారు. గత సంవత్సరం రామప్ప దేవాలయాన్ని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా ప్రతిపాదించారని, కనీసం ఈ సంవత్సరమైనా ఎంపికయ్యే విధంగా ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పురావస్తుశాఖ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సీతారాం నాయక్ సూచించారు. చారిత్రిక కట్టడాల పరిరక్షణకు ఎంపీ నిధులను కేటాయించేందుకూ సిద్ధంగా ఉన్నామన్నారు.

అరుదైన కోట భువనగిరి

తెలంగాణలో పురావస్తు సంపద అపారంగా ఉన్నదని భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ భువనగిరి కోట అరుదైనరీతిలో ఏకశిలతో ఏర్పడిందన్నారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థిని మలావత్ పూర్ణ పర్వతారోహణను ఇక్కడే ప్రాక్టీస్ చేసిందని గుర్తుచేశారు. 13 సంవత్సరాల వయస్సులోనే ఆ అమ్మాయి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిందన్నారు. అందుకు తోడ్పడిన భువనగిరి కోటను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

స్టాండింగ్ కమిటీకి మెడికల్ కమిషన్ బిల్లు పంపండి

నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించాలని మంగళవారం లోక్‌సభలో భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ స్థానంలో ప్రవేశపెట్టనున్న ఎన్ఎంసీపై అనేక సందేహాలు, అనుమానాలు ఉన్నాయని, వీటన్నింటిని నివృత్తి చేయడానికి బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించడమే సరైన మార్గమని పేర్కొన్నారు.

198 కోట్లతో కేజీబీవీలకు భవనాలు

- ఈ నెల 15 లోపు 61 అకడమిక్ బ్లాకులు, 34 భవనాలకు శంకుస్థాపన
- నిర్మాణాల పూర్తికి ఈ ఏడాది అక్టోబర్ తుది గడువు
- విద్యార్థులకు హెల్త్ కిట్ల పంపిణీ
- కేజీబీవీలపై సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం కడియం



కేజీబీవీల బలోపేతంపై మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు (కేజీబీవీ) రూ.198 కోట్ల వ్యయంతో 61 అకడమిక్ బ్లాకులు, 34 నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి వెల్లడించారు. ఈ నెల 15 లోపు వీటికి శంకుస్థాపన చేస్తామని.. ఈ ఏడాది అక్టోబర్ లోగా నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీల బలోపేతంపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని కేజీబీవీలు దేశంలోనే అత్యుత్తమంగా కొనసాగుతున్నాయన్నారు. వీటిని మరింత బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని గురుకులాల్లో మొత్తం 1,03,000 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా అందించే ఉచిత హెల్త్‌కిట్ల పంపిణీని ఈ నెల 9 లోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం ఏటా రూ.12 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. దేశంలోని మరే రాష్ట్రంలో కూడా హెల్త్‌కిట్లను అందించడంలేదన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో అమలు చేస్తున్న భోజన పట్టికను దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి అన్నిరకాల గురుకులాల్లో ఒకే రకమైన భోజన పట్టికను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఉదయం 6 గంటలకు పాలు, ఆ తర్వాత అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనం అందిస్తున్నామని చెప్పారు. నెలకు నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్, ప్రతిరోజు గుడ్డు, నెయ్యి కూడా పెడుతున్నట్టు వివరించారు. శాస్త్రీయంగా పోషక విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందజేస్తున్నట్టు తెలిపారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ల నేతృత్వంలో ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు జీ కిషన్, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ విజయ్‌కుమార్, కేజీబీవీ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి, మోడల్ స్కూల్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి...

ఆహ్వానించడంతోపాటుగా ప్రస్తుతమున్నవాటిని ప్రోత్సహించడానికి మంత్రి కేటీఆర్ ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఇప్పటికే ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌కు సంబంధించిన కార్యాలయం ఏర్పాటు, సీఈవో, సలహాదారుతోపాటు, పరిమిత సంఖ్యలో సిబ్బందిని నియమించారు. వెబ్‌సైట్, లోగోను కూడా మంత్రి కేటీఆర్ ఇప్పటికే ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర ఎమ్మెస్ఎంఈ మంత్రిత్వశాఖ ప్రశంసించింది. కేంద్రం తనవంతు సాయంగా రూ.50 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్నది. రూ.100కోట్ల కార్పస్ ఫండ్‌తో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.10కోట్లు ఇప్పటికే విడుదలచేసింది. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే తొలి ఎన్బీఎఫ్‌సీ ఇదే కావడం గమనార్హం. దేశంలోనే పరిశ్రమలకు కోఫైనాన్సింగ్ అందించే తొలి ఎన్బీఎఫ్‌సీ ఇదే అవుతుంది. వివిధ కారణాలతో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులకు చెల్లించాల్సిన నెలసరి వాయిదాలు చెల్లించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉద్దేశపూర్వక కారణాలు లేకపోయినా సరుకులు, వస్తువులు సరఫరా చేసిన సంస్థల నుంచి బకాయిలు రాకపోవడంతో నష్టాలపాలై మూతపడుతున్నాయి. ఇలాంటి వాటికి పరిష్కారం చూపేందుకు టీఐహెచ్‌సీని ఏర్పాటుచేశారు. ఈ సంస్థ ద్వారా సహాయం పొందాలనుకునే సంస్థలు షేర్ క్యాపిటల్‌ను తీసుకోవాల్సిఉంటుంది. కనీసం రూ.10వేలుగా, గరిష్ఠంగా రూ.2లక్షలు షేర్ క్యాపిటల్‌గా చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో భాగస్వామ్యం కావడానికి పలు బ్యాంకులు ముందుకొచ్చాయి. సాయం కావాల్సిన సంస్థలు మొదట సంస్థకు దరఖాస్తు చేసుకుంటే డయాగ్నస్టిక్ స్టడీ చేస్తారు. అవసరమైతే సాంకేతిక నివేదికను రూపొందిస్తారు. బ్యాంకుల ద్వారా తలెత్తే సమస్యలను పరిష్కరిస్తారు. అప్పటికీ అవసరమైతే కోఫైనాన్సింగ్ చేస్తారు.



మంగళవారం సచివాలయంలో జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి

ఎరువుల కొనుగోలులో ఆధార్ కీలకం

- ఆధార్ ప్రాముఖ్యంపై రైతులకు అవగాహన కల్పించండి
- అధికారులకు వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం ఎరువుల కొనుగోలులో ఆధార్ ప్రాముఖ్యాన్ని రైతులకు వివరించాలని జిల్లా అధికారులను వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి ఆదేశించారు. జనవరి 1 నుంచి అమలు చేస్తున్న ఈపాస్ (ఈ-పీవోఎస్) విధానం అమలుపై మంగళవారం సచివాలయం నుంచి పార్థసారథి జిల్లా వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 6,656 మంది రిటైల్ డీలర్ల వద్ద ఈ-పాస్ మిషన్లతో ఎరువుల విక్రయాలు జరుపుతున్నట్టు చెప్పారు. ఎరువుల కొనుగోలు సమయంలో ఆధార్‌కార్డే కీలకమని, దానిపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ఈ పాస్ మిషన్లతో ఎరువుల విక్రయాలు జరిపిన వెంటనే.. సరుకు వివరాలను పీవోఎస్ మిషన్లలో డీలర్లు అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాల్లో అవసరమైనచోట అదనపు పీవోఎస్ మిషన్లను త్వరితగతిన తెప్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఈ-పాస్ విధానం అమలులో తలెత్తే సమస్యలను వ్యవసాయశాఖ సంచాలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. అంతర్‌జిల్లాల ఎరువుల బదలాయింపులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని, దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మాస్‌కాపీయింగ్‌పై నిర్లక్ష్యం సరికాదు

- మాస్‌కాపీయింగ్ చట్టం అమలు చేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పబ్లిక్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ నిరోధానికి కఠిన చర్యలు చేపట్టకపోవడంపై తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలపై ఉమ్మడి హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పబ్లిక్ పరీక్షల చట్టం 1997 ప్రకారం కేసులు నమోదుచేసి ప్రాసిక్యూషన్ చేస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మాస్‌కాపీయింగ్ నిరోధానికి చేపడుతున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తప్పుడు పనిచేస్తే చర్యలు తప్పవన్న భయం ఉంటేనే వ్యవస్థ సక్రమంగా ఉంటుందని పేర్కొన్నది. పబ్లిక్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ పేట్రేగిపోవడానికి అందరూ కారకులేనని స్పష్టం చేసింది. తమ పిల్లలకు తక్కువ మార్కులు వచ్చినా పర్వాలేదు.. నిజాయితీగా వస్తేచాలు అన్న భావన తల్లిదండ్రుల్లో లోపించిందని, మాస్‌కాపీయింగ్‌కు సహకరించే ఉపాధ్యాయులను దేవుళ్లుగాను, సహకరించని ఉపాధ్యాయులను దయ్యాలుగా పిల్లలు భావిస్తున్నారని వ్యాఖ్యానించింది. పబ్లిక్ పరీక్షల్లో కొన్ని పరీక్షా కేంద్రాల్లో పుస్తకాలు పెట్టి విద్యార్థులతో పరీక్షలు రాయిస్తున్న విషయంపై హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలనే పిటిషనర్ అభ్యర్థనపై ధర్మాసనం స్పందిస్తూ.. ఆ విధంగా తాము ఎలా ఆదేశించగలమో తెలియజేయాలని ప్రశ్నించింది. సీసీ కెమెరాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతాయని, ఒకవేళ సీసీ కెమెరాలు పనిచేయడంలేదని చెప్పినా ఏమిచేయలేని పరిస్థితి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఒక ఏడాది పిల్లలు ఫెయిలయితే జీవితం కోల్పోయినట్లు కాదని, ఒక్క సంవత్సరం లేట్‌గా కెరీర్ ప్రారంభమవుతుందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వివరించారు. ఇందుకోసం అడ్డదార్లు తొక్కాల్సిన అవసరం లేదని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో తెలంగాణలో కేవలం నాలుగు కేసులు, ఏపీలో ఒకే ఒక్క కేసు నమోదు కావడంలోనే మాస్‌కాపీయింగ్‌ను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తేలిపోతున్నదని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 23 కు వాయిదా వేసింది.

సమావేశాల వేదికలను మేమెలా ఖరారుచేస్తాం?

- ఐఎస్‌సీని ఓయూలో నిర్వహించాలన్న పిటిషనర్‌కు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ఉస్మానియా యూనివర్సిటీలోనే నిర్వహించాలంటూ తాము ఆదేశాలు జారీ చేయలేమని మంగళవారం హైకోర్టు స్పష్టం చేసింది. ఒక సమావేశాన్ని నిర్దిష్టంగా ఒక స్థలంలోనే నిర్వహించాలని ఆదేశించే అధికారం కోర్టులకు ఎలా ఉంటుందని ప్రశ్నించింది. బుధవారం నుంచి ఏడో తేదీ వరకు ఉస్మానియాలో నిర్వహించ తలపెట్టిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను వాయిదా వేయాలని ఐఎస్‌సీఏ తీసుకొన్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఓయూ స్కాలర్ ఒకరు హైకోర్టులో పిటిషన్ వేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ సమావేశాల నిర్వహణ కోసం ఓయూ దాదాపు రూ. 50 కోట్లు ఖర్చు చేసిన తర్వాత.. రాష్ట్ర హోంశాఖ, పోలీసులు ఇచ్చిన నివేదిక ఆధారంగా సమావేశాలను ఇతర ప్రాంతాల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. సమావేశాలు నిర్వహిస్తున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ప్రభుత్వ సంస్థా? లేక ప్రైవేట్ సంస్థా? అన్న విషయాన్ని తెలుపాలని ఆదేశించింది. అయినప్పటికీ సమావేశాలు ఎక్కడ నిర్వహించాలన్నది తాము చెప్పజాలమని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 23కు వాయిదావేసింది.

తీగజాతి కూరగాయల సాగుకు

ఇనుప పందిళ్లు

- ఛత్తీస్‌గఢ్ తరహాలో అమలుచేయాలని నిర్ణయం
- పాలీహౌస్‌ల స్థానంలో ఏర్పాటుకు ప్రణాళికలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పాలీహౌస్‌ల (హరిత పందిళ్ల) స్థానంలో కొత్త తరహా పండ్లు, కూరగాయల సాగు విధానాల అమలుకు రాష్ట్ర ఉద్యానశాఖ ప్రణాళికలను సిద్ధంచేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో తరహా ఇనుపందిళ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. కొత్త విధానం వల్ల కూరగాయలు, పండ్ల దిగుబడి పెరుగడంతో.. ఇక్కడి కూడా అమలుచేయాలని నిశ్చయించింది. ఎకరా విస్తీర్ణంలో ఇనుప పందిళ్ల నిర్మాణానికి సుమారు రూ.6.20 లక్షల ఖర్చు కానున్నది. ఇందులో 50 నుంచి 75 శాతం వరకు రాయితీ ఇస్తే వీటిని తీసుకొనేందుకు రైతులు ముందుకొస్తారని ఉద్యానశాఖ అంచనా వేస్తున్నది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 నుంచి 100 శాతం రాయితీ ఇచ్చే అవకాశాలున్నాయి. పొలంలో 13 అడుగుల ఎత్తు వరకు సిమెంటు స్తంభాలు వేసి, వాటిపై జీఐ ఇనుపతీగను లాగి పరదాతో పందిరి వేస్తారు. ఇందులో 8 అడుగుల ఎత్తు వరకు కూరగాయలు లేదా పండ్ల మొక్కలు తీగగా ఎదిగే ఏర్పాటు ఉంటుంది. రాయ్‌పూర్ సమీపంలో ఓ ఆదర్శ రైతు ప్రయోగాత్మకంగా ఈ పందిరి వేసి మంచి ఫలితాలు సాధించడంతో ఇదే విధానాన్ని అక్కడి రైతులు పెద్దఎత్తున అనుసరిస్తున్నారు. తెలంగాణలో పాలీహౌస్ (హరిత పందిరి) పథకంలో రాయితీ అధికంగా ఉన్నందున ఎక్కువమంది రైతులకు ఇవ్వలేకపోతున్నామని ఉద్యానశాఖ ప్రభుత్వానికి సూచించింది. ఎకరా విస్తర్ణంలో హరితపందిరి నిర్మాణానికి రూ.35 నుంచి 40 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దీనిలో రూ.28 లక్షల దాకా రాయితీ ఇవ్వాల్సి ఉంది. హరిత పందిరికిచ్చే ఒక ఎకరా రాయితీతో.. ఇనుప పందిళ్లకు 9 ఎకరాల్లో ఇవ్వవచ్చనేది ఉద్యానశాఖ అంచనా. ప్రస్తుతం గ్రామాల్లో కూరగాయల పంటల సాగును పెంచేందుకు ఉద్యానశాఖ పంటల కాలనీలను ఏర్పాటు చేస్తున్నది. ఇందులోభాగంగా పందిరి నిర్మిస్తే సొర, బీర, కాకర, దొండ, పొట్ల వంటి తీగజాతి కూరగాయల దిగుబడి బాగా పెరుగుతుందని ఛత్తీస్‌గఢ్‌లో అధ్యయనం ద్వారా తెలుసుకుంటున్నట్టు ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రాంరెడ్డి చెప్పారు.

స్వచ్ఛభారత్‌లో సలాం హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

మలవిసర్జన నిషేధం అమలుతీరును స్వయంగా పరిశీలించారు. గ్రేటర్‌లోని అన్ని మున్సిపల్ వార్డులను ఓడీఎఫ్‌గా ప్రకటిస్తూ సంబంధిత కార్పొరేటర్లు ధ్రువీకరించిన లిఖితపూర్వక పత్రాలను గతంలోనే అధికారులు స్వచ్ఛభారత్ మిషన్‌కు అందజేశారు. పాఠశాలలు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లను ఓడీఎఫ్‌గా ప్రకటిస్తూ చేసిన తీర్మానాలను గతంలోనే స్వచ్ఛభారత్ మిషన్‌కు సమర్పించారు. కమర్షియల్ ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం ప్రతి కిలోమీటర్‌కు ఒక పబ్లిక్ టాయిలెట్ సౌకర్యం విధిగా ఉండాలి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ విజ్ఞప్తిమేరకు అన్ని పెట్రోల్ బంకులు, హోటళ్లు, రెస్టారెంట్లలోని టాయిలెట్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి సౌకర్యం ఉండాలి. లేనట్టయితే కమ్యూనిటీ టాయిలెట్ సౌకర్యం కల్పించాలి. ఈ అంశాలన్నింటినీ క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో అన్నీ సంతృప్తికంగా ఉన్నట్టు భావించిన స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు మన రాజధానిని ఓడీఎఫ్ నగరంగా ప్రకటించారు.

టాయిలెట్లు కాదు గౌరవగృహాలు

కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ టాయిలెట్లను 'ఇజ్జత్‌ఘర్'గా పేర్కొనాలని ఆదేశించిన నేపథ్యంలో మన నగరంలో టాయిలెట్లను గౌరవగృహాలుగా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు అన్ని పబ్లిక్ టాయిలెట్లకు ప్రత్యేకంగా రంగులు వేసి గౌరవ గృహాలుగా బోర్డులు ఏర్పాటుచేశారు. గతంలో నిర్మించినవాటికితోడుగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ తదితర మార్గాల ద్వారా మరికొన్ని.. ఇలా మొత్తానికి సుమారు 400 వరకు టాయిలెట్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వీటికితోడు హోటళ్లు, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లకు సంబంధించిన మరో 675 టాయిలెట్లు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాదు, ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటైన బస్తీల్లో సైతం అక్కడ ఉండేవారికోసం సామూహిక టాయిలెట్లను నిర్మించారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు కూడా జారీచేయడం విశేషం.

షీ-టాయిలెట్లకు మహిళా నిర్వాహకులు

షీ-టాయిలెట్ల నిర్వహణ మానవరహితమే అయినప్పటికీ మహిళలు అభద్రతా భావానికి లోనుకాకుండా ఉండేందుకు వాటివద్ద మహిళలను నియమించారు. వారికి ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను కల్పించారు. దీంతో మహిళలు ఎటువంటి భయంలేకుండా టాయిలెట్లను ఉపయోగించుకునే వీలు కలిగింది. నగరంలోని ఇతర టాయిలెట్లను సైతం పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వాటి నిర్వహణకు ప్రత్యేక నిర్వాహకులను నియమించి వారికీ డ్రెస్‌కోడ్‌ను నిర్ణయించారు. బూట్లు, ప్రత్యేక యూనిఫాం ఇచ్చారు.

జియో ట్యాగింగ్‌తో గుర్తింపు సులభం

నగరంలో ప్రజలకు అందుబాటులో ఉన్న టాయిలెట్లను జియో ట్యాగింగ్ చేసి జీహెచ్ఎంసీకి చెందిన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో ఎవరైనా తమకు సమీపంలో టాయిలెట్ ఎక్కడుందో సులభంగా గుర్తించే వీలు కలుగుతుంది.

మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ హర్షం

నగరాన్ని ఓడీఎఫ్ నగరంగా ప్రకటించడంపై మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి హర్షం ప్రకటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో నగరానికి మెరుగైన స్థానం లభించేందుకు ఇది దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని వారు తెలిపారు. పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ప్రత్యేక శ్రద్ధతో నగరాన్ని అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారని, ఇప్పుడు నగరానికి ఓడీఎఫ్ హోదా లభించడం తమకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందని వివరించారు.

మందకృష్ణకు వర్గీకరణ ఇష్టంలేదు

- మండిపడిన టీఎస్‌ఎమ్మార్పీఎస్ నేతలు
- దేవుడు అని కాళ్లుమొక్కిన కడియంపైనే విమర్శలా..
- వర్గీకరణను పక్కకుపెట్టి దీక్షల పేరిట మోసం
- టీఎస్‌ఎమ్మార్పీఎస్ నేతలు యాతాకుల, వంగపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: ఉనికి కోల్పోతామన్న భయంతోనే మంద కృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నవారిపై విమర్శలు చేస్తున్నారని, ఆయనకు అసలు ఎస్సీ వర్గీకరణ చేయడమే ఇష్టం లేదని టీఎస్‌ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ కోసం కృషిచేస్తున్న కడియం శ్రీహరిని గతంలో దేవుడని కాళ్లు మొక్కి, ఉప ముఖ్యమంత్రి అయితే స్వాగతించిన మంద కృష్ణ ఇప్పుడు స్వార్థ రాజకీయాల కోసం విమర్శలు చేయడం శోచనీయమన్నారు. మంగళవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. వర్గీకరణ ఇష్టంలేకనే మంద కృష్ణ ఆ విషయాన్ని పక్కకుపెట్టి అసెంబ్లీ సీట్లు, దీక్షలంటూ మాదిగలను మోసం చేస్తున్నారని విమర్శించారు. వెంకయ్యనాయుడు కాళ్లు మొక్కి మరీ వర్గీకరణ హామీ ఇప్పించుకున్న మంద కృష్ణ పార్లమెంట్‌లో ఆ బిల్లుకోసం ఒత్తిడి చేయకుండా వర్గీకరణ కోసం కృషిచేస్తున్న కడియం శ్రీహరిపై విమర్శలు చేయడం వెనుక మతలబేందని ప్రశ్నించారు. దీక్షల పేరుతో మరోసారి మాదిగలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అర్థంలేని ఆందోళనలకు మాదిగ బిడ్డలను ఉసిగొల్పి.. మందకృష్ణ, ఆయన అనుచరుడు మాత్రమే జైలు నుంచి బయటకు వచ్చి మిగతావారి విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకపాక దేవయ్య, దండు సురేందర్, కనకరాజు, పీ రమేశ్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

వర్గీకరణ తేల్చకపోతే బీజేపీ దిమ్మెలు కూలుస్తాం

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి
- 30న మాదిగ విద్యార్థి గర్జన



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ అంశాన్ని వెంటనే తేల్చకపోతే రాష్ట్రంలో ఆ పార్టీ దిమ్మెలను కూల్చివేస్తామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని న్యూసెమినార్ హాల్‌లో మంగళవారం మాదిగ జేఏసీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతూ 23 ఏండ్లుగా ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని ప్రకటించిన బీజేపీ మూడేండ్లుగా తాత్సారం చేస్తున్నదని మండిపడ్డారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే అంశంపై పార్లమెంట్‌లో కనీసం చర్చకూడా జరుగలేదని అన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ చేయిస్తామని హామీ ఇచ్చి ఆ తరువాత మాటతప్పారని మండిపడ్డారు. మాదిగలను తక్కువ చేసి చూసినా, ఎస్సీ వర్గీకరణను తేల్చకపోయినా బీజేపీకి పుట్టగతులుండకుండా చేస్తామని హెచ్చరించారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో మాదిగ విద్యార్థి గర్జనను నిర్వహించనున్నట్టు పిడమర్తి రవి తెలిపారు. కార్యక్రమంలో మాదిగ విద్యార్థి జేఏసీ చైర్మన్ గద్దల అంజిబాబు, మాదిగ యువజనజేఏసీ హైదరాబాద్ ఇంచార్జి రామగళ్ల సుందర్, నాయకులు బొమ్మెర సమ్మయ్య, బండారి వీరబాబు, గాదె వెంకట్, కే శేఖర్, మంద సురేశ్, ఎన్ రవి పాల్గొన్నారు.

వాణిజ్య

WWW.NTNEWS.COM

నమస్తే తెలంగాణ

సెన్సెక్స్	నిఫ్టీ
33,812	10,442
0	7

ముడి చమురు (బ్రెంట్) 66.42 డాలర్లు

బంగారం ధరలు	
ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	29,540
22 క్యారెట్లు	29,390
వెండి (కిలో)	38,720

విదేశీ మారకం		
కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	57.90	67.14
బహ్రెయిన్ దినార్	156.80	179.69
కువైట్ దినార్	174.10	216.73
సౌదీ రియాల్	15.37	18.25
యూఏఈ దిర్హామ్	15.75	18.42

చికెన్ ధరలు	(రూ.లలో)
ఫారం ధర	96.00
రిటైల్ లైవ్	118.00
డ్రెస్డ్	171.00
స్కిన్‌లెస్	195.00

నెక్ (వంద గుడ్లకు)	(రూ.లలో)
హైదరాబాద్	372-00
రంగారెడ్డి	372-00
మెదక్	372-00
కరీంనగర్	374-00
వరంగల్	374-00
రిటైల్ ప్రైస్	4-30

మీ సొమ్మెక్కడికీ పోదు!

ఎఫ్ఆర్‌డీఐపై ఆందోళనలు అక్కర్లేదు

డిపాజిటర్లకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అభయం

బిల్లుతో అదనపు ప్రయోజనాలు చేకూరుతాయని ప్రకటన

అసత్య ప్రచారం చేస్తున్నారంటూ ఆక్షేపణ

న్యూఢిల్లీ, జనవరి 2: ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై అసత్య ప్రచారం జరుగుతున్నదని, మీడియాలో ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వస్తున్నదంతా నిజం కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం స్పష్టం చేసింది. బ్యాంక్ డిపాజిటర్లు ఈ బిల్లుపై తీవ్ర ఆందోళనకు గురవుతున్న విషయం తెలిసిందే. కొన్ని బ్యాంకుల్లో ఖాతాదారులు తమ డిపాజిట్లనూ వెనుకకు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా స్పందించిన ఆర్థిక శాఖ.. ఎలాంటి భయాలు అక్కర్లేదని డిపాజిటర్లకు భరోసానిచ్చింది. 'ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్ (ఎఫ్ఆర్‌డీఐ)-2017.. మరింత పారదర్శక పద్ధతిలో డిపాజిటర్లకు అదనపు రక్షణల్ని చేకూరుస్తుంది' అని ఓ ప్రకటనలో వివరించింది. కాగా, డిపాజిటర్లకు ఇప్పుడున్న ప్రయోజనాల్ని ఎఫ్ఆర్‌డీఐ కాలరాస్తుందని, డిపాజిట్ చేసిన సొమ్మును ఖాతాదారుల అనుమతి లేకుండానే బ్యాంకులు వాడుకునే వెసులుబాటును ఇది కల్పిస్తుందని, చివరకు ఇదేమిటని? అడిగే హక్కు కూడా ఉండదంటూ మీడియాలో వార్తలు, సోషల్ మీడియాలో సందేశాలు రోజూ వస్తుండటాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రధానంగా బిల్లులోని 'బెయిల్-ఇన్' నిబంధనల్లో డిపాజిటర్ల రక్షణకు తూట్లు పొడిచే చర్యలున్నాయంటూ పెద్ద ఎత్తున కథనాలు ప్రచురితం, ప్రసారమవుతున్నాయి. దీంతో 'బెయిల్-ఇన్' అనేది కేవలం ఎఫ్ఆర్‌డీఐ బిల్లులోగల ఎన్నో రిజల్యూషన్లలో ఒకటేనని, ఈ నిబంధనతో డిపాజిటర్ల ప్రయోజనాలకు వచ్చిన ముప్పేమీ లేదని ఈ సందర్భంగా ఆర్థిక శాఖ తేల్చి చెప్పింది. డిపాజిటర్ల ప్రస్తుత ప్రయోజనాల్ని కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అదనపు ప్రయోజనాల్ని అందిస్తామే తప్ప, నష్టం చేకూర్చబోమని పేర్కొన్నది. ఇక ప్రస్తుతం లక్ష రూపాయల వరకున్న డిపాజిట్ బీమా పరిమితిని పెంచాలనేదే ఎఫ్ఆర్‌డీఐ బిల్లు, రిజల్యూషన్ కార్పొరేషన్ ముఖ్య ఉద్దేశమని చెప్పుకొచ్చింది. కాగా, గతేడాది ఆగస్టులో ఎఫ్ఆర్‌డీఐ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, ఇది ప్రస్తుతం పార్లమెంట్ సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్నది. ఈ బడ్జెట్ సెషన్ చివరి రోజుకల్లా కమిటీ తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించాల్సి ఉన్నది.

ఆ బాండ్లపై వడ్డీరేటునే తగ్గిస్తున్నాం

8 శాతం వడ్డీరేటునిస్తున్న ప్రభుత్వ సేవింగ్స్ (పన్నులు వర్తిస్తాయి) బాండ్లను కొనసాగిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. మంగళవారం నుంచి వీటిని ఆపేస్తున్నట్లు సోమవారం ప్రభుత్వ ప్రకటన విడుదలైన నేపథ్యంలో అలాంటిదేమీ లేదని, అయితే ఆర్బీఐ బాండ్ల పథకంగా కూడా పేరున్న ఈ బాండ్లపై వడ్డీరేటును మాత్రం 7.75 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పెట్టుబడులకు రిటైల్ మదుపరులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2003 ఏప్రిల్ 21న ఈ బాండ్లను కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టగా, ఆరేండ్ల నిర్ణీత కాలపరిమితితో వీటిని జారీ చేస్తున్నారు.



బిట్‌కాయిన్ ట్రేడింగ్ చట్టవ్యతిరేకం: జైట్లీ

బిట్‌కాయిన్‌తోపాటు ఎథేరియం ఇతర క్రిప్టో కరెన్సీల ట్రేడింగ్ చట్టవ్యతిరేకమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయం సందర్భంగా ఈ డిజిటల్ కరెన్సీల ట్రేడింగ్‌పై ఎంపీలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో జైట్లీ ఈ ప్రకటన చేశారు. ఈ లావాదేవీలు వారివారి విచక్షణపైనే ఆధారపడి ఉంటాయన్నారు. వర్చువల్ (అదృశ్య) కరెన్సీ ట్రేడింగ్‌లో అంతర్జాతీయంగా భారత్ వాటా 11 శాతానికిపైగా ఉండటంతో బిట్‌కాయిన్, ఎథేరియం తదితర క్రిప్టో కరెన్సీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులు అడిగిన ప్రశ్నలకు జైట్లీ సమాధానమిస్తూ.. 'ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి నాయకత్వంలో ఏర్పాటైన కమిటీ తగిన చర్యలను ప్రతిపాదించడానికి కసరత్తు చేస్తున్నది' అన్నారు. కాగా, ఈ సందర్భంగా బిట్‌కాయిన్ ట్రేడింగ్‌తోపాటు పనామా పేపర్లు, ప్యారడైజ్ పేపర్లలో పేర్లున్న వారికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని స్వతంత్ర అభ్యర్థి అమర్ సింగ్ డిమాండ్ చేశారు. 2017 ఆరంభంలో వెయ్యి డాలర్లు కూడా లేని బిట్‌కాయిన్ విలువ.. ఏడాది ఆఖర్లో మాత్రం దాదాపు 20 వేల డాలర్లను తాకిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమాయక మదుపరులు నష్టపోకుండా అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), ఇటు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసిన సంగతీ విదితమే. ఇప్పటికే ఆదాయ పన్ను (ఐటీ) శాఖ దేశవ్యాప్తంగా ఉన్న బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్‌ల్లో సోదాలను కూడా నిర్వహించింది.

నెట్‌వర్క్ కనెక్టివిటీలో వివక్షకు చోటివ్వరాదు

నిబంధనలు ఉల్లంఘిస్తే రోజుకు రూ.లక్ష జరిమానా

కొత్త నిబంధనలను జారీచేసిన ట్రాయ్



న్యూఢిల్లీ, జనవరి 2: దేశీయ టెలికం సర్వీస్ ప్రొవైడర్ల మధ్య ఇంటర్ కనెక్టివిటీకి సంబంధించిన నిబంధనలను మార్కెట్ నియంత్రణ సంస్థ ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) మంగళవారం జారీ చేసింది. ఇంటర్ కనెక్టివిటీ కోసం ఏదైనా ఆపరేటర్ మరో ఆపరేటర్‌ను కోరితే ఆ విజ్ఞప్తి వచ్చిన 30 రోజుల వ్యవధిలోగా అందుకు సంబంధించిన ఒప్పందాన్ని తప్పనిసరిగా కుదుర్చుకోవాలని, ఈ విషయంలో ఎటువంటి వివక్షకు తావు ఉండరాదని ట్రాయ్ ఆ నిబంధనల్లో పేర్కొంది. ఈ కొత్త నిబంధనలను ఉల్లంఘించిన ఆపరేటర్‌కు ఒక్కో సర్వీస్ ఏరియాలో రోజుకు లక్ష రూపాయల వరకూ జరిమానా విధించడం జరుగుతుందని ట్రాయ్ స్పష్టం చేసింది. 'టెలికం ఇంటర్ కనెక్టివిటీకి సంబంధించిన కొత్త నిబంధనలు జారీ చేశాం. ప్రారంభ దశల్లో ఆపరేటర్ల మధ్య ఇంటర్ కనెక్టివిటీకి వీలుకల్పించేలా నెట్‌వర్క్ కనెక్టివిటీ ఒప్పందాలను కుదుర్చుకోవడం, ఇంటర్ కనెక్ట్ పాయింట్లను పెంచుకోవడం తదితర అంశాలకు సంబంధించిన నిబంధనలు వీటిలో ఉన్నాయి. ఈ నిబంధనలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. దేశంలోని అన్ని టెలికం సర్వీస్ ప్రొవైడర్లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి' అని ట్రాయ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆపరేటర్ల మధ్య ఇంటర్ కనెక్టివిటీ విషయమై సంబంధిత పక్షాలతో ట్రాయ్ 2016 అక్టోబర్ నుంచి విస్తృత సంప్రదింపులు జరుపుతున్న విషయం విదితమే. ఈ సంప్రదింపుల్లో భాగంగా బహిరంగ చర్చలు నిర్వహించి ఆపరేటర్ల నుంచి లిఖితపూర్వక అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ట్రాయ్ ఈ కొత్త నిబంధనలు జారీ చేసింది. 2016లో మార్కెట్‌లో ప్రవేశించిన రిలయన్స్ జియోకి, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్ లాంటి ఇతర పాత ఆపరేటర్లకు మధ్య ఇంటర్ కనెక్టివిటీ విషయమై తీవ్రస్థాయిలో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాయ్ ఈ కొత్త నిబంధనలను జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇన్ఫీ పగ్గాలు చేపట్టిన పరేఖ్

ఆయన రాక సంస్థకు బలమన్న పాయ్



న్యూఢిల్లీ/బెంగళూరు, జనవరి 2: దేశీయ రెండో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ ఇన్ఫోసిస్ నూతన సీఈవో, ఎండీగా సలీల్ పరేఖ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ వేగంగా, ఎన్నో మార్పులకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో ఇన్ఫీ సారథ్యాన్ని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కాగా, తొలిరోజు కొందరు ఉద్యోగులతో కలిసి ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను చుట్టేసిన పరేఖ్.. ఆ దృశ్యాలను ట్విట్టర్ ద్వారా అందరితో పంచుకున్నారు. సంస్థ పురోగతికి నిబద్ధతతో పనిచేయాలని ఉద్యోగులకు ఓ వీడియో సందేశాన్ని కూడా ఇచ్చారు. ఇదిలావుంటే ఇన్ఫోసిస్ కొత్త సారథిగా సలీల్ పరేఖ్ రావడం సంస్థకు ఎంతో సానుకూలమని ఇన్ఫీ మాజీ సీఎఫ్‌వో టీవీ మోహన్‌దాస్ పాయ్ అన్నారు. క్యాప్‌జెమినీ నుంచి వచ్చిన ఈ టెకీ అనుభవం.. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌కు చాలా ఉపయోగపడగలదన్న విశ్వాసాన్ని పీటీఐతో వ్యక్తం చేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్‌వోజీసీ కాంప్లెక్స్

జామ్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన రిలయన్స్

న్యూఢిల్లీ, జనవరి 2: ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ ఆఫ్-గ్యాస్ క్రాకర్ (ఆర్‌వోజీసీ) కాంప్లెక్స్‌ను జామ్‌నగర్ వద్ద ఏర్పాటుచేసినట్లు మంగళవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తెలిపింది. దీని వార్షిక సామర్థ్యం 1.5 మిలియన్ టన్నులు. పెట్రో కెమికల్స్ తయారీకి వినియోగించే ఫీడ్‌స్టాక్ ఉత్పత్తి కోసం జరిగే ముడి చమురు శుద్ధి ప్రక్రియలో ఈ కాంప్లెక్స్ అవసరం ఉంటుంది. రూ.70,000 కోట్ల పెట్టుబడి వ్యయంలో భాగమైన ఆర్‌వోజీసీని.. ఇతర ప్రాజెక్టులతో పోల్చితే దాదాపు 40 శాతం తక్కువ ఖర్చుతో, రికార్డు సమయంలో నిర్మించామని ఓ పత్రికా ప్రకటనలో ఆర్ఐఎల్ తెలియజేసింది. కాగా, జామ్‌నగర్‌లో ఆర్ఐఎల్‌కున్న రెండు రిఫైనరీల నుంచి ఫీడ్‌స్టాక్‌గా గ్యాస్‌ను ఆర్‌వోజీసీ పొందుతుంది. మరోవైపు ఈ ఆర్‌వోజీసీతో తమ 16 బిలియన్ డాలర్ల విస్తరణ ప్రణాళిక పూర్తయిందని రిలయన్స్ వెల్లడించింది. అంతేగాక ఎథిలీన్ సామర్థ్యం రెండింతలై 40 మిలియన్ టన్నులకు చేరుకోగా, ప్రపంచంలోనే టాప్-5 పెట్రో కెమికల్ ఉత్పత్తిదారుల్లో ఒకటయ్యామని ఆర్ఐఎల్ వివరించింది.

చిల్లరకూ చిల్లు



కాసులు కురిపిస్తున్న కనీస బ్యాలెన్స్ ఖాతాలు

భారీగా లాభాలు దండుకుంటున్న బ్యాంకులు

అగ్రస్థానంలో ఎస్‌బీఐ.. ఆర్బీఐ నిబంధనలకు తూట్లు

న్యూఢిల్లీ, జనవరి 2: పొదుపు ఖాతాల్లో కనీస మొత్తాన్ని (మినిమం బ్యాలెన్స్) నిల్వ ఉంచని వారి నుంచి వసూలు చేసే చార్జీలు సహేతుకంగా, బ్యాంకులు అందించే సేవల సగటు ధరకు మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిబంధనలు స్పష్టం చేస్తుంటే ప్రస్తుతం పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కనీస బ్యాలెన్స్ ఉంచని ఖాతాదారులకు విధించే జరిమానా రూపంలో బ్యాంకులు భారీగా లాభాలను దండుకుంటున్నాయి. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అతిపెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఈ విషయంలో మిగిలిన అన్ని బ్యాంకుల కంటే ఎంతో ముందంజలో ఉంది. ఆరేళ్ల తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మళ్లీ ఇటువంటి చార్జీలను వసూలు చేయడం మొదలు పెట్టిన ఎస్‌బీఐ.. పొదుపు ఖాతాల్లో కనీస మొత్తాన్ని నిల్వ ఉంచని వారి నుంచి 2017 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో పెనాల్టీ చార్జీల కింద రూ.1,771 కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది జూలై-సెప్టెంబర్ మధ్య కాలంలో ఎస్‌బీఐ ఆర్జించిన రూ.1,581.55 కోట్ల నికర లాభం కంటే ఎక్కువగా ఉన్న ఈ పెనాల్టీ చార్జీలు.. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో ఎస్‌బీఐ ఆర్జించిన రూ.3,586 కోట్లలో నికర లాభంలో దాదాపు సగం మేరకు ఉండటం గమనార్హం. ఇదేవిధంగా గత ఏడాది ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.97.34 కోట్ల పెనాల్టీ వసూలు చేయగా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.68.67 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.62.16 కోట్ల చొప్పున వసూలు చేశాయి. కేవలం ప్రభుత్వ రంగ బ్యాంకులే కాకుండా ప్రైవేటు రంగంలోని బ్యాంకులు కూడా ఇదే బాటలో పయనిస్తున్నట్లు ఐఐటీ-ముంబైలో స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆశిష్ దాస్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. కనీస బ్యాలెన్స్‌లో తగ్గిన మొత్తంపై చాలా బ్యాంకులు భారీ మొత్తంలో సంవత్సరానికి 78 శాతం పెనాల్టీ విధిస్తున్నాయని, దీంతో రిజర్వు బ్యాంకు నిబంధనలకు అర్థం లేకుండా పోతున్నదని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పెనాల్టీ చార్జీల నుంచి బ్యాంకుల్లోని ప్రాథమిక పొదుపు ఖాతాలతో పాటు, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ఖాతాలను రిజర్వు బ్యాంకు మినహాయించింది.

ఏప్రిల్-నవంబర్‌లో వసూలు చేసిన పెనాల్టీ	
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ.1,771 కోట్లు
పంజాబ్ నేషనల్ బ్యాంక్	రూ.97.34 కోట్లు
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ.68.67 కోట్లు
కెనరా బ్యాంక్	రూ.62.16 కోట్లు

రెండున్నరేండ్ల గరిష్ఠానికి రూపాయి

20 పైసలు పెరిగిన మారకం



న్యూఢిల్లీ, జనవరి 2: దేశీయ కరెన్సీ విలువ రూపాయి రెండున్నరేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ 20 పైసలు పెరిగి 63.48 వద్ద ముగిసింది. డాలర్‌ను విక్రయించడానికి బ్యాంకర్లు, ఎగుమతిదారులు మొగ్గుచూపడంతో వరుసగా నాలుగో రోజూ ఎగువముఖం పట్టింది. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుండటంతో కరెన్సీపై సెంటిమెంట్ మరింత పెరుగడానికి దోహదపడిందని ఫారెక్స్ డీలర్ పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థపై అనుమానాలు వ్యక్తంకావడంతో ఇతర కరెన్సీలు మరింత బలోపేతమవడానికి పరోక్షంగా కారణమైంది. దీంతో జూలై 17, 2015న ముగిసిన 63.47 స్థాయికి చేరుకున్నట్లు అయింది. ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడం, మరిన్ని సంస్కరణలకు కేంద్రం ప్రకటించే అవకాశాలు ప్రాంతీయ కరెన్సీకి బలమిచ్చాయి. 63.65 వద్ద మంగళవారం ఉదయం ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 63.77 కనిష్ఠ స్థాయిని తాకింది. ఆ తర్వాత దిగుమతిదారులు, బ్యాంకర్లు డాలర్‌ను విక్రయించడానికి మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 63.41 గరిష్ఠ స్థాయిని తాకగా, చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 20 పైసలు లేదా 0.31 శాతం లాభపడి 63.48 వద్ద ముగిసింది. వరుసగా నాలుగు ట్రేడింగ్ రోజుల్లో రుపీ విలువ 67 పైసలు బలపడినట్లు అయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువను రిజర్వు బ్యాంక్ 63.6728గాను, యూరో విలువ 76.5856గా నిర్ణయించింది. రూపాయితో పోలిస్తే పౌండ్ విలువ 85.96కు, యూరో విలువ 76.61 వద్ద స్థిరపడింది. గతేడాది ఆరు శాతం లాభపడిన మారకం విలువ ఈ ఏడాది ప్రారంభం నుంచి పుంజుకోవడం విశేషం.

అమ్మకాల్లో టాటా హైజంప్

గత నెలలో 52 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 2: దేశీయ ఆటోమొబైల్ సంస్థ టాటామోటార్స్ విక్రయాల్లో భారీ వృద్ధి నమోదైంది. డిసెంబర్‌లో కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 52.48 శాతం పెరిగి 54,267 యూనిట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 35,825 యూనిట్లుగా ఉంది. ఈ సందర్భంగా కంపెనీ కమర్షియల్ వాహన విభాగ అధిపతి గిరీష్ వాగ్ మాట్లాడుతూ..నూతన ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయడం కలిసొచ్చిందని, అలాగే బీఎస్-4 ప్రమాణాలు కలిగిన పలు వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్యాసింజర్ వాహన విక్రయాల్లో వృద్ధి 30.96 శాతం నమోదైందన్నారు. 2012 తర్వాత ఒకే నెలలో ఇంతటి స్థాయిలో వాహనాలను అమ్మడం ఇదే తొలిసారని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరేఖ్ తెలిపారు. టియాగో, టిగోర్, హెక్సా, నెక్సాన్‌లకు డిమాండ్ ఉండటం ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు. అలాగే ఫోర్డ్ ఇండియా విక్రయాల్లో 27 శాతం వృద్ధి నమోదైంది. ఏడాది క్రితం 23,470 యూనిట్లుగా ఉన్న అమ్మకాలు.. 2017 డిసెంబర్‌లో 29,795కి పెరిగాయి. జీఎస్టీ అమలులోకి రావడం, ద్రవ్యోల్బణం, పెద్ద నోట్ల రద్దు, క్రూడాయిల్ భగ్గుమన్నప్పటికీ గతేడాది ఆటోమొబైల్ రంగం ఆశాజనక వృద్ధిని నమోదు చేసుకున్నదని ఫోర్డ్ ఎండీ అనురాగ్ మెహరోత్రా తెలిపారు. అశోక్ లేలాండ్ 19,253 యూనిట్ల విక్రయాలు జరిపింది. ద్విచక్ర వాహన ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ హీరో మోటో అమ్మకాలు 43 శాతం ఎగబాకి 4,72,731లకు చేరుకున్నాయి. గతేడాది మొత్తానికి సంస్థ రికార్డు స్థాయి 72,07,363 బైకుల అమ్మకాలు జరిపింది. మరో సంస్థ సుజుకీ మోటార్‌సైకిల్ 39,786లను, బజాజ్ ఆటో 2,92,547 వాహనాలను, రాయల్ ఎన్‌ఫీల్డ్ 66,968 యూనిట్లను విక్రయించాయి.



వాహన విక్రయాలు			
కంపెనీ	డిసెంబర్ 2017లో	డిసెంబర్ 2016లో	వృద్ధి శాతంలో
టాటా మోటార్స్	54,267	35,825	52.48
ఫోర్డ్ ఇండియా	29,795	23,475	27
అశోక్ లేలాండ్	19,253	10,731	79.41
ద్విచక్ర వాహన సంస్థలు			
హీరో మోటోకార్ప్	4,72,731	3,30,202	43
బజాజ్ ఆటో	2,92,547	2,25,529	29.72
రాయల్ ఎన్‌ఫీల్డ్	66,968	57,398	16.67
సుజుకీ మోటార్‌సైకిల్	39,786	26,495	50.16

జీఎస్టీ ఎగవేతదారులపై నిఘా

వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ డ్రైవ్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీఎస్టీ తదితర బకాయిలను వసూలు చేయడానికి ఈ నెల 3 నుంచి 18వ వరకు వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించనున్నది. ఈ మేరకు వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ వీ అనిల్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. పన్ను ఎగవేతదారులను ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. బకాయిలను చెల్లించని వారిపై జరిమానా విధించడంతో పాటు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులను జప్తు చేస్తామని ఆయన హెచ్చరించారు. జీఎస్టీ కింద 2.40 లక్షల మంది డీలర్లు, ట్రేడర్లు నమోదుకాగా వారి నుంచి పన్నును వసూలు చేసేందుకు వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశాల మేరకు ప్రతీ రెండువందల మంది డీలర్లకు ఒక ఆఫీసర్ స్థాయి ఉద్యోగిని నియమించారు. దీంతో వ్యాపారులు సకాలంలో రిటర్న్‌లను దాఖలు చేసేందుకు, పన్నులను వసూలు చేసేందుకు వీలు కలుగుతున్నది. కొందరు అధికారులు జీఎస్టీ వసూలు చేసినా ఖజానాకు జమ చేయడం లేదన్న ఫిర్యాదులపై ప్రత్యేక నిఘాపెట్టాలని నిర్ణయించారు.

తగ్గిన కంపోజిషన్ స్కీం పన్నురేటు

జీఎస్టీ ప్రక్రియను సరళతరం చేయడంలో భాగంగా ప్రవేశపెట్టిన కంపోజిషన్ స్కీం కింద తయారీదారులపై పన్ను రేటును తగ్గించింది కేంద్ర ప్రభుత్వం. ఇంతకుముందు 2 శాతంగా ఉన్న జీఎస్టీని 1 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయానికి అనుగుణంగా ఈ మేరకు ప్రభుత్వం సవరణలు చేసింది. జీఎస్టీ కింద నమోదైన వ్యాపారులు 90 లక్షలకుపైగా ఉంటే, ఇందులో 15 లక్షలకుపైగా వ్యాపారులు కంపోజిషన్ స్కీంలో ఉన్నారు. కంపోజిషన్ స్కీంతో రాయితీ రేటుకు పన్నులను చెల్లించడానికి వీలుంటుంది.

బీఎస్ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 317.95(317.4)10099
Ace Software Exp 26.75(25.5)1800
Aci Infocom 9.8(9.89)1
Aditya Ispat 6.96(6.63)1820
Aditya Spin 8.81(9.1)40
Agro Tech Foods 699.7(711.3)2439
Aishwarya Telcom 7.47(7.38)36101
Alphageo 906.4(916.75)3194
Alufluoride 135.45(133.75)11624
Amara Raja 829.5(833.6)25380
Andhra Bank 57.35(58.35)123896
Andhra Cements 13.67(13.9)79793
Andhra Petroch 60.95(64.15)117610
Andhra Sugars 523.15(535.25)1275
Anjani Portl 233.3(240.0)1078
Astra Micro 118.25(118.75)100223
Aurobindo Phar 671.85(685.15)129200
Avantel 467.45(466.55)5369
Avanti Feeds 2587.5(2586.1)7407
Avon Organics 15.7(14.96)3377
B N Rathi Sec 53.75(54.15)16632
B2b Software 14.55(14.0)335
Balaji Amines 622.55(631.55)8955
Bambino Agro 327.0(326.75)7737
Bartronics India 15.06(15.17)25838
Bgr Energy Sys 138.9(140.8)36046
Bhagiradha Chem 323.65(299.05)30214
Bhagyaind 51.25(52.1)25419
Bhagyanagar W. 29.45(28.05)1421
Bnr Udyog 28.65(27.75)163
Brilliant Secur11.63(11.08)47339
Cambridge Tech Ent81.4(79.85)750
Cat Tech 1.15(1.1)7090
Ccl Products 298.85(298.95)1270
Celestial Labs 21.9(22.3)350707
Cil Securities 36.7(37.9)11335
Coastal Trawlers 71.1(67.75)1
Color Chips 46.0(47.6)9042
Coromandel Fert 542.0(559.8)820571
Country Club 19.75(20.25)337464
Cubex Tubings 28.1(28.9)2350
Cybermate Inf. 3.5(3.62)170036
Danlaw Tech. 73.5(75.5)958
Deccan Cements 560.0(556.5)206
Denisons Hyd 1190.0(1180.0)62
Dhan Roto Sp 41.3(40.5)2976
Diamond Power Infra22.4(18.75)1230618
Divi's Lab 1079.2(1098.85)26750
Divyashakti Gr 104.9(101.2)110
Dolphin Med 1.91(1.82)31593
Dr Reddy`s 2407.7(2411.5)28178
Empee Sugars 5.33(4.95)80137
Everest Org 137.0(138.85)348
Facor Alloys 3.78(3.6)51712
Fenoplast 61.0(61.5)216
Firstobj 15.8(15.15)1620
Fortune Info 107.4(118.05)36486
Four Soft 93.3(91.6)9187
Galada Power 5.42(5.7)3214
Gati 133.25(134.95)230961
Gayatri 11.19(10.66)163075
Gayatri Proj 227.25(226.85)38319
Gennex 6.15(6.25)300312
Gmr Infra 21.65(22.3)7392075
Godavari Drugs 42.55(41.85)6575
Goldinfra 201.85(206.85)37507
Goldstone Tech 16.15(17.0)62365
Gowra Leasing & Fin 24.45(24.45)1400
Granules Ind 134.3(137.1)127217
Gss America Info28.9(28.7)13987
Gulf Oil Corp 577.3(571.3)1463
Gvk Pwr 18.6(19.4)786196
Hbl Power 73.05(73.6)253729
Heritage Food 803.1(821.55)7407
Hyderabad Ind 1514.2(1524.2)1929
I V R Cons 7.33(7.02)3046434
I.c.s.a. 4.25(3.92)223474
Incap 114.95(109.5)24071
Incon Engineers 5.7(6.0)112
Infotech Ent 573.25(577.5)1857
Intensive Air Sys 0.39(0.39)10027
Invinex Lab 89.3(87.55)413
Ivrcl Infrastruc 7.33(7.02)3046434
K C P 143.85(138.2)144552
Kabsons Ind 8.36(8.2)200
Kakatiya Cement 396.3(396.9)11392
Kallam Spin23.6(23.95)35532
Kaveri Seed 539.3(548.4)66793
Kernex Mic. 45.4(46.5)6304
Knr Constru 308.85(319.8)29212
Krebsbio 153.75(146.45)6654
Lanco Ind 391.95(398.2)23320
Lanco Infratech 1.48(1.41)9195610
Livewell Home Fin 77.75(78.45)246
Lokesh Mach 71.95(72.7)29739
Madhucon Projects 35.8(35.9)85726
Maytas Infra 53.8(55.0)11206
Mhril 335.4(337.35)10402
Mic Electronics 9.42(9.66)126783
Moldtek 75.5(76.8)1527
Moschip Semi 39.35(39.55)97812
Msr India Ltd 34.7(36.6)4456
N C L Ind 251.3(249.9)10360
Nagarjuna Agri 59.65(57.05)367365
Nagarjuna Agri Tech 7.7(7.35)2300
Nagarjuna Con 130.45(131.55)1317637
Natco Pharma 967.6(987.85)28683
National Min 148.6(140.75)1188258
Nbventure 153.65(151.65)175403
Ncc Finance 1.4(1.38)500
Neha Int9.94(10.05)177791
Neha Int9.94(10.05)177791
Neocure Thera 3.9(3.91)30163
Nettlinx 80.7(79.55)48629
Neuland Lab 886.35(886.55)3647
Niharinf 14.8(14.9)600
Nile 895.65(905.3)3969
Oil Country 54.75(53.95)37386
P L Enterprise 3.25(3.31)126
P.m. Telelinnks 3.15(3.18)100
Padmalaya Tel 5.76(5.88)19119
Pankaj Polymers 23.0(21.95)25202
Panyam Cem 60.7(62.15)26027
Peeti Securities 11.9(11.9)1
Pennar Ind 67.2(68.2)82503
Pflinfotc 8.4(8.2)9721
Phaarmasia 26.55(26.65)655
Phyto Chem 75.8(73.8)22761
Pitti Lamin 102.0(102.85)19403
Pokarna 218.8(214.3)11917
Prajay Eng 15.21(15.32)50097
Premier Expl 430.25(430.55)1667
Prism Cement 115.5(116.45)13975
Raj Packaging 39.4(40.0)756
Rajvir Industries 40.4(38.5)50
Ram Informatics 43.0(41.85)742
Ras Finance 24.7(23.6)15
Regency Ceramic 9.37(8.97)32776
Restile Ceramics 9.85(9.44)36531
Roopa Industries 13.49(13.5)200
Rubra Medicaments 5.69(5.56)249
Sagar Cements 912.75(887.85)6760
Sai Wires India 2.5(2.55)3406
Salguti Plast 12.09(11.52)100
Samkrg Pistons 347.6(348.9)8052
Sampre Nutritions 95.15(88.3)95807
Sanghi Ind 135.5(135.1)95601
Sanjeevni Indust 27.0(27.45)10592
Sark Sys 71.4(64.55)205052
Sathavahana Ispat 33.85(34.8)7543
Saven TechnLtd 25.3(24.8)16924
Sks MicrofinLtd 993.3(991.5)33682
Sms Pharma101.9(102.95)12026
Softpro Sys 5.01(4.78)650
Southern Online Bio 3.37(3.41)20830
Sr Ray Alkalies 72.95(71.4)573748
Sree Rayalaseema 216.4(218.7)2488
Srinivasa Shipp 84.9(88.9)11574
Starchik Sp 25.0(25.0)100
Steel Exchange 46.35(44.15)91129
Sujana 0.88(0.9)145550
Sujana Towers 4.84(4.82)13426
Sujanametal 1.82(1.74)114946
Surana Telecom 6.27(6.18)42050
Suryaamba 70.85(70.85)3353
Suryachakra Power Corp1.3(1.24)6343
Suryalak Cott 95.1(96.0)6474
Suryalata Spin 161.2(160.8)3768
Suvarna Cem 171.45(172.85)300
Suven 202.4(205.05)44630
Taj Gvk 178.3(175.8)8586
Tanla Solutions 38.55(40.5)384709
Tci 1070.0(1080.0)130
Tci Fin 27.5(26.15)171039
Transcorp Int57.95(57.8)51557
Transgene Biotek 2.3(2.37)29607
Transport Co 287.2(291.6)2235
Trendy Knitwear 0.21(0.21)72933
Tyche 134.8(138.1)20779
Unisocks 3.38(3.5)53995
Usher 8.59(8.63)9050
V B C Ferro 44.05(42.0)1598
V S T Ind 3157.8(3167.35)388
Vamshi Rubber 54.85(52.65)1187
Viceroy Hotels 18.3(17.9)105482
Victory Proj 7.17(7.54)2150
Vijay Textiles 43.75(42.95)8641
Vimta Labs 167.75(167.45)8202
Virat Crane 45.0(44.9)1079
Virnichiq 125.35(125.5)77549
Visaka Ind 647.75(655.6)4485
Vista Pharma 40.65(41.2)10226
Vivmed Labs 105.0(105.9)120081
Vivo Bio Tech 50.0(51.85)4493
Vjil Consulting 21.05(22.15)3055
Vmf Softech 104.25(103.3)12739
Waterbase 401.7(397.65)1642548
Xl Energy Ltd 4.0(4.0)12117
Ybrant Digital 6.13(6.27)2302462
Yenkey Drug 4.01(3.94)151
Zen TechLtd 147.95(153.0)97569
Zenotech 47.0(47.05)14400



వటపత్రశాయిగా లక్ష్మీనృసింహుడు

అధ్యయనోత్సవాల్లో భాగంగా యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి మంగళవారం ఉదయం వటపత్రశాయిగా రాత్రి శ్రీమహావిష్ణువుగా భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

-యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ



ఖాందేవ్ జాతరలో నువ్వుల నూనె తాగుతున్న తొడసం వంశీయుల ఆడపడుచు అనవంతుబాయి

ఖాందేవ్ జాతర ప్రారంభం

రెండు కిలోల నువ్వుల నూనె తాగిన తొడసం వంశీయుల ఆడపడుచు

నార్నూర్ : పుష్య పౌర్ణమి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఖాందేవ్ జాతర ప్రారంభమైంది. సోమవారం అర్ధరాత్రి మహా పూజలతో ప్రారంభమైన జాతర 15 రోజుల పాటు కొనసాగనుంది. మంగళవారం ఉదయం తొడసం వంశీయులు ఆరాధ్యదైవమైన ఖాందేవ్‌కు సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వారు తమ ఇంటి వద్ద శుద్ధమైన రెండు కిలోల నువ్వుల నూనెను తయారు చేశారు. ఆ నూనెను తొడసం వంశీయుల ఆడపడుచు అనవంతుబాయి తాగారు. కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు అందించేలా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వచ్చే జాతర వరకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు.



దూడకు ఘనంగా నామకరణమహోత్సవం

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోగల శ్రీవాసవీ కన్యకా పరమేశ్వర ఆలయంలో లేగదూడకు బారసాల నిర్వహించారు. గ్రామానికి చెందిన గన్నారపు రాజేందర్ ఓ ఆవును ఆలయానికి బహుమానంగా ఇచ్చారు. అది గత నెల సంకటహర చతుర్థి రోజు దూడకు జన్మనిచ్చింది. దీంతో గోదానం చేసిన గన్నారపు రాజేందర్ దంపతులు మంగళవారం ఆలయంలో తొట్లె ఉత్సవాన్ని నిర్వహించి దూడకు గణేశ్ అని నామకరణం చేశారు. **- ఖానాపూర్**

యాదాద్రికి పెరిగిన ఆదాయం

గతేడాది కన్నా 24.57 కోట్లు అధికం

బాలాలయానికీ భారీగా భక్తులు

గొట్టిపర్తి భాస్కర్‌గౌడ్, యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ :

యాదాద్రీశుడి ఆదాయం గణనీయంగా పెరిగింది. రికార్డు స్థాయిలో 2017లో రూ.108.88 కోట్ల ఆదాయం సమకూరింది. శ్రీవారి ఆదాయం వంద కోట్లు దాటడం ఇదే ప్రథమమని అర్చకులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో అర్చకులు శతమానంభవతి అంటూ ఖజానా తల్లికి, కుబేరునికి ఆరాధన జరిపారు. యాదాద్రిని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ కంకణ బద్ధులవటంతోపాటు పనులు సైతం ప్రారంభించడంతో భక్తుల రద్దీ కూడా పెరిగింది. హుండీ ఆదాయంతోపాటు ఆర్జిత సేవలు, కైంకర్యాల ద్వారా గతేడాది కన్నా రూ.24.57 కోట్ల ఆదాయం అధికంగా సమకూరింది. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఖజానా ఏడాదిలో వంద కోట్లు దాటడం ఇదే ప్రథమం. యాదాద్రీశుడిని తెలంగాణకు తలమాణికంగా తీర్చిదిద్దుతున్న క్రమంలోనే బాలాలయంలోనే దర్శనాలు జరుగుతున్నప్పటికీ ఇంత పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని ఎవరూ ఊహించలేదు. ఆలయ పునర్నిర్మాణ పనులు సాగుతున్నా సౌకర్యాలు అంతగా లేకున్నా బాలాలయంలో కవచామూర్తుల దర్శనమే జరుగుతున్నా, భక్తుల సంఖ్య పెరుగుతుండటం విశేషం. 2016లో స్వామివారికి రూ.84.31 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 1,900 కోట్లు వెచ్చిస్తున్న విషయం తెలిసిందే. పునర్నిర్మాణం పూర్తయితే భక్తుల రాక భారీగా పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.



యాదాద్రిలోని బాలాలయం వద్ద భక్తుల రద్దీ

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక ఆదాయ వివరాలు (రూపాయలలో)

ఆదాయ విభాగం	2017లో..	2016 లో..
ప్రధాన బుకింగ్	2,95,10,462	2,89,26,041
ప్రత్యేక దర్శనాలు	5,75,48,450	5,15,08,150
శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు	3,24,98,500	2,90,17,500
గదుల విచారణ	2,30,03,813	2,46,69,339
కల్యాణకట్ట	1,02,97,290	81,01,670
ప్రసాదాల విక్రయం	17,10,45,445	15,71,19,775
శాశ్వత పూజలు	61,87,034	62,46,472
హుండీ కానుకలు	10,62,15,629	10,90,59,484
ఇతరత్రా ఆదాయ పద్దులు	65,25,52,691	42,84,72,429
మొత్తం	108,88,59,313	84,31,20,860

సీఎం కేసీఆర్‌తోనే బహుళ ప్రచారం



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఏడాది ఆదాయం రూ.108.88 కోట్లు దాటడం సరి కొత్త రికార్డు. భక్తుల్లో మన రాష్ట్రం.. మన యాదాద్రి అనే భావన విస్తృతమైంది. సీఎం కేసీఆర్‌తో సంకల్పంతోనే యాదాద్రికి మహర్దశ వస్తున్నది. యాదాద్రికి వెళితే కోరిన కోర్కెలు తీరడంతోపాటు సీఎం చేపట్టిన అభివృద్ధి పనులను కూడా చూడవచ్చని భక్తులు తరలివస్తున్నారు. **- కిషన్‌రావు, వైటీడీఏ వైస్ చైర్మన్**

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం



యాదాద్రికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం వల్ల బాలాలయంలో దర్శనాలు సాఫీగా సాగుతున్నాయి. గతంలోని ప్రధానాలయం క్యూలైన్లలో గల సౌకర్యాలన్నీ బాలాలయం క్యూలైన్లలో ఏర్పాటు చేశాం. ఫలితంగా భక్తులు సులభంగా దర్శనాలు చేసుకుంటున్నారు. ఆర్జిత సేవలు చేసుకునే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. వచ్చే భక్తుల సంఖ్య గతం కన్నా రెండు రెట్లు పెరిగింది. సీఎం కేసీఆర్ తొమ్మిది సార్లు పర్యటించి అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో అందరి దృష్టి ఇప్పుడు యాదాద్రిపై ఉంది. **- ఎన్ గీత, ఆలయ ఈవో, యాదాద్రి**



మాందాపూర్‌లో వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

వ్యవసాయానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి

పాన్‌గల్: రాష్ట్రంలో 80శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నందున ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ రంగానికి అధిక నిధులను కేటాయిస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చింతకుంటలో మంత్రి జూపల్లి రైతు లు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. 24 గంటల విద్యుత్ అందించడం తెలంగాణ ప్రభుత్వం సాధించిన మహాద్భుత విజయమన్నారు. అనంతరం మాందాపూర్ గ్రామ సమీపంలో వేరుశనగ పంటను కోత పడుతున్న కూలీల చెంతకు వెళ్లి ముచ్చటించారు.

ఆదివాసీలంటే గౌరవం

సమస్య పరిష్కారం దిశగా చర్యలు: మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఇటీవల కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తన పర్యటన సందర్భంగా ఆదివాసీల ఆందోళనల వెనుక మాజీ మావోయిస్టుల హస్తం ఉందని ఓ పత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని, తాను అసలు ఆ విషయాన్ని మాట్లాడనేలేదని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లో టీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. సదరు పత్రికలో వచ్చిన తప్పుడు వార్త కారణంగా ఆదివాసీలు తన దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నారని, ఇందుకు తాను చాలా బాధపడుతున్నట్టు పేర్కొన్నారు. తప్పుడు కథనం ప్రచురించిన ఆ పత్రికపై పరువు నష్టం దావా వేస్తానన్నారు. జిల్లాలోని ఆదివాసీలంటే తనకు చాలా గౌరవం ఉందని, జిల్లా వాసిగా వారి సమస్యలు తనకు తెలుసునని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.



వనపర్తి జిల్లా మోజర్లలో విలేకరులతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

రైతాంగానికి పెద్దపీట

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి: రైతులకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో మంగళవారం పర్యటించి రైతులు, గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, కాంగ్రెస్ నేతలు బుద్దారం కుడి కాల్వకు సంబంధించి కొంత మంది నిర్వాసితులతో కోర్టులో కేసులు వేయించి పనులకు అడ్డుపడుతున్నారన్నారని విమర్శించారు. వాటినన్నింటినీ అధిగమించి త్వరలోనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన మొదటి ఏడాదినుంచే ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తుంటే.. గత పాలకులు ఈ ప్రాజెక్టులను తమ హయాంలోనే మొదలు పెట్టామనడం సిగ్గుచేటన్నారు.



ఖానాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రేఖానాయక్

ప్రజలకు అందుబాటులో ఉండేందుకే..

ఖానాపూర్: ప్రజలకు అందుబాటులో ఉండేందుకే సీఎం కేసీఆర్ అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు నిర్మించి ఇచ్చారని స్థానిక ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో రూ. 66 లక్షలతో నిర్మించిన ఈ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమైక్య పాలనలో ఎమ్మెల్యేలను ప్రజలు కలువాలంటే ఎన్నో ఇబ్బందులు ఉండేవన్నారు. స్వరాష్ట్రంలో ప్రతి రోజు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు.



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం స్థానిక ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జ్వరం, తలనొప్పితో బాధపడుతున్న ఆయన ప్రభుత్వ దవాఖానకు వచ్చి వైద్యం చేయించుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇక్కడ వైద్యం చేయించుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. **- నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ**





క్షీరాభిషేకం చేస్తున్న విద్యుత్ అధికారులు, ఉద్యోగులు.. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో కేసీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

ప్రత్యేక ఇంక్రిమెంట్‌పై హర్షాతిరేకాలు

పలుచోట్ల విద్యుత్ ఉద్యోగుల సంబురాలు

సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: తెలంగాణ రైతాంగానికి పంటల సాగుకు 24గంటల కరెంటును సరఫరా చేసేందుకు కష్టపడి పనిచేసిన విద్యుత్ ఉద్యోగుల శ్రమను గుర్తించి సీఎం కేసీఆర్ ప్రత్యేక ఇంక్రిమెంట్ ప్రకటించినందుకు సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. నిజామాబాద్ పవర్ హౌస్ కాంపౌడ్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు సంబురాలు చేసుకొన్నారు. నిజామాబాద్‌తో పాటు బోధన్, ఎడపల్లి, ఆర్మూర్, మాక్లూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వరంగల్ రూరల్ జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్యుత్ శాఖ పరకాల సబ్-డివిజన్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి విద్యుత్ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. నర్సంపేటలోని డీఈ కార్యాలయంలోనూ సీఎం, ఎంపీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అభిమానాన్ని చాటారు. జనగామలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి విద్యుత్ ఉద్యోగులు, తెలంగాణ జాగృతి నాయకులు వేర్వేరుగా క్షీరాభిషేకాలు చేశారు. కరీంనగర్‌లోని ఎస్‌ఈ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలు ఆనందంగా గడుపుతున్నాయనీ, సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను గణనీయంగా పెంచి ఉద్యోగ భద్రత కల్పించారని తెలిపారు.

సంబురాల్లో అన్నదాతలు

వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరాపై హర్షం వ్యక్తం చేస్తూ రైతులు మంగళవారం కూడా సంబురాలు చేసుకొన్నారు. పలు చోట్ల సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని తెలంగాణ చౌరస్తాలో రైతులు, టీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో గుండ రవీందర్ ఇంటి ఆవరణలోని గుడిలోని కేసీఆర్ విగ్రహానికి టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం, పదరల్లో రైతులు సీఎం కేసీఆర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఖమ్మం నగరంలోని అల్లిపురంలో టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బేగ్ ఆధ్వర్యంలో రైతులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అభిమానాన్ని చాటారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో రైతులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. మంగళవారం కూడా పెద్ద ఎత్తున చేరారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో 48 కుటుంబాలకు చెందిన పూసల కులస్థులు 250 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి పోచారం కండువాలు కప్పారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలానికి చెందిన వివిధ పార్టీలనాయకులు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ వార్డు సభ్యుడితో పాటు ఐదుగురు నేతలు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల టీడీపీ,సీపీఐ, కాంగ్రెస్ నేతలతోపాటు నలుగురు రేషన్ డీలర్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. చర్ల మండలంలో సుమారు 30 మంది టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తెల్లం వెంకట్రావ్ సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



సిద్దిపేట జిల్లా మద్దూర్‌కు చెందిన కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నాయకులకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



కామారెడ్డి జిల్లా దేశాయిపేట్‌లో ఇంటింటికీ నల్లా నీటిని ప్రారంభిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

ఆడబిడ్డలకు నీటి తిప్పలు తప్పినట్టే

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం

కామారెడ్డి, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఇంటింటికీ నల్లా నీరు సరఫరా అయితే ఆడబిడ్డలకు నీటి తిప్పలు తప్పినట్టేనని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని దేశాయిపేట్ గ్రామంలో మిషన్ భగీరథ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇకనుంచి నెత్తిన బిందెలు ఎత్తుకొని వెళ్లే కష్టాలు, బిందెల కొట్లాటలు ఉండవన్నారు. ఈ గ్రామంలో 704 కుటుంబాలుంటే ఇక్కడి అన్ని ఇండ్లల్లో నల్లాలు బిగించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దంపతుల దారుణ హత్య

మడికొండ(వరంగల్): వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం సోమిడిలో దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం వెలుగుచూసింది. ఆస్తి తగాదాలే ఈ ఘటనకు కారణమని తెలుస్తున్నది. పోలీసుల కథనం ప్రకారం.. సుంచు ఎల్లయ్య(75) రైల్వే రిటైర్డ్ ఉద్యోగి. భార్య ఎల్లమ్మ చనిపోవడంతో పూలమ్మ(45)ను పదేండ్ల కిందట రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు కుమారులు. రెండో భార్యకు సంతానం లేదు. మంగళవారం ఉదయం పాలు పోసేందుకు ఓ మహిళ వీరి ఇంటికి వచ్చింది. అప్పటికే రక్తపు మడుగులో ఉన్న దంపతుల్ని చూసి స్థానికులకు సమాచారం అందించింది. మృతులపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. ఆస్తి తగాదాల కారణంగానే ఈ హత్యలు జరిగి ఉంటాయని అనుమానిస్తున్నట్టు డీసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మద్యం మత్తులో తల్లితో అసభ్యకర ప్రవర్తన

రోకలితో మోదడంతో కొడుకు మృతి


మంథని, నమస్తే తెలంగాణ: మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తించిన కొడుకును రోకలితో మోదడంతో మృతి చెందాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా మంథనిలోని ఎరుకల గూడెంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రామగుండం ఏసీపీ అపూర్వారావు కథనం ప్రకారం.. ఈర్నాల లక్ష్మణ్-రేణుక దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. వీరిలో చిన్న కుమారుడు దినేశ్(26) గంజాయి, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో చోరీలు సైతం చేసేవాడు. జులాయిగా తిరిగే దినేశ్ డబ్బుల కోసం కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. తండ్రి లక్ష్మణ్ అనారోగ్యంతో గతేడాది మృతి చెందాడు. అప్పటి నుంచి దినేశ్ ఆగడాలు మితిమీరాయి. సోమవారం రాత్రి తల్లితో గొడవ పడి డబ్బులు తీసుకుని మద్యం తెచ్చుకొని తాగాడు. ఆ తర్వాత తల్లితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో రేణుక పక్కనే ఉన్న రోకలితో కొడుకు దినేశ్ తలపై మోదడంతో ప్రాణాలు వదిలాడు. అనుకోకుండా జరిగిన ఈ ఘటనతో ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది.

కూతురికి విషం తాగించి.. ఆపై తాను తాగి

అడ్డువచ్చిన అత్త గొంతుకోసిన అల్లుడు

చింతలపాలెం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి 13 నెలల కూతురికి ఎలుకల మందు తాగించాడు.. ఆపై తానూ తాగాడు.. అంతటితో ఆగకుండా అత్తతో గొడవ పడి ఆమె గొంతు కోశాడు. ఈ ఘటనలో ఎలుకల మందు తాగిన ఇద్దరికి ప్రాణాపాయం తప్పగా, అత్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం తమ్మారంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..చిల్లా నర్సింహారావు, లావణ్య దంపతులు. వీరికి నవ్యశ్రీ అనే 13నెలల కూతురు ఉంది. ఇతను మేళ్లచెర్వులోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రెండురోజులు సెలవులు రావడంతో సొంతూళ్లోనే ఉండే అత్తగారింటికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. భార్యాభర్తల మధ్య గొడవ జరుగడంతో మంగళవారం ఉదయం పాలల్లో ఎలుకల మందు కలిపి తన కూతురికి తాగించి తానూ తాగాడు. విషయం తెలుసుకున్న అతని భార్య లావణ్య చిన్నారిని స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా.. అంతలోనే అత్త లక్ష్మితో గొడువపడ్డాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. రక్తపు మడుగులో ఉన్న ఆమెను దవాఖానకు తరలించారు.

జాగృతి మహిళా నేత దారుణ హత్య



సారక్క (ఫైల్)

వెంకటాపురం: తెలంగాణ జాగృతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏదుల సారక్క(42) దారుణహత్యకు గురయ్యారు. ఎస్సై పోగుల శ్రీకాంత్ కథనం ప్రకారం.. వెంకటాపురం మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన ఏదుల సారక్క కొంతకాలంగా జాగృతి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. శనివారం సారక్క మచ్చల మల్లక్క అనే మహిళతో కలిసి చీపురుపుల్లల సేకరణకు అడవికి వెళ్లారు. మల్లక్క తిరిగి వచ్చినా.. సారక్క రాకపోవడంతో ఆమె తల్లి లక్ష్మీదేవి పోలీసులను ఆశ్రయించారు. అడవిలో మృతదేహం ఉన్నట్టు సమాచారం రావటంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలిపోయి ఉన్న మృతదేహాన్ని పరిశీలించి సారక్కగా గుర్తించారు. సమీప బంధువులే హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సచివాలయంలో కే జీవసాగర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న హోం మంత్రి నాయిని

హోంమంత్రితో కువైట్ భారత రాయబారి భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కువైట్‌లో భారత రాయబారిగా నియమితులైన కే జీవసాగర్ మంగళవారం సచివాలయంలో హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డితో సమావేశమయ్యారు. కువైట్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ సంస్థ పెద్దమొత్తంలో భారతీయ నర్సులను నియమించుకుంటున్నదని, ప్రభుత్వ నియామక ఏజెన్సీ అయిన టాంకాం గురించి అక్కడ తెలిసేలా చర్యలు తీసుకోవాలని నాయిని కోరారు. కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్, టాంకాం చైర్మన్ పీ రంగారెడ్డి, జీఎం నాగభారతి, డైరెక్టర్ కేవై నాయక్‌లు పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో నిలిచిన ఏకైక ప్రభుత్వం



విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి రమణప్రసాద్

24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా సంతోషకరం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి రమణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగుతుందని చెప్పారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయనివిధంగా వ్యవసాయ రంగానికి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం సంతోషకరమన్నారు. సీఎం కేసీఆర్ రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని స్పష్టంచేశారు. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు నూతన ఫలాలు అందుతాయని చెప్పడానికి సీఎం కేసీఆర్ నిర్ణయమే గొప్ప నిదర్శనమని అన్నారు.

పోలీస్ సెక్టార్లకు జియో ఫెన్సింగ్

- ప్రతి పోలీస్‌స్టేషన్‌కు పరిధి నిర్ధారణ
- సెక్టార్ల వారీగా విభజన.. జియో ఫెన్సింగ్ ఏర్పాటు
- నేరాల కట్టడిపై క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు
- 'గస్తీ' సిబ్బంది పనితీరుపై పరిశీలన
- టెక్నాలజీతో జవాబుదారీతనం పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జియో ఫెన్సింగ్‌తో రాష్ట్రవ్యాప్తంగా నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కసరత్తు మొదలు పెట్టారు. ఈ విధానం క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బందిపై సునిశిత పరిశీలన ఉండటంతోపాటు అధునాతంగా ఉండేందుకు పనిచేస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి సిబ్బంది రోజువారీ పనితీరును టెక్నాలజీ పర్యవేక్షణలోకి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం ఈ విధానం హైదరాబాద్‌లో అమలు ఉన్నది. ప్రస్తుతం ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెడుతున్నారు. ఈ కార్యక్రమానికి డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. పూర్తిస్థాయిలో టెక్నాలజీని ఉపయోగించుకొని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సెక్టార్లకు వేర్వేరుగా జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. ముందుగా పోలీస్‌స్టేషన్ల సరిహద్దులను గుర్తించి సెక్టార్లను ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత గస్తీ సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఈ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, నేరాలను కట్టడి చేయడంలో ఇప్పటి వరకు హైదరాబాద్ ముందంజలో ఉన్నది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దీనిని ప్రవేశపెడుతున్నారు. ఈ టెక్నాలజీతో పెట్రోలింగ్ చేసే సిబ్బంది పనితీరును పై అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఈ విధానం అమలుతో రాష్ట్రంలో నేరాలు అదుపులో ఉండటంతోపాటు సత్ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

సరిహద్దు వివాదాలు ఉండవు..

గతంలో పక్కపక్కనే ఉండే పోలీస్‌స్టేషన్ల మధ్య సరిహద్దుల వివాదం కొన్ని నేరాలు జరిగిన సమయంలో బయటపడుతుండేది. ఈ ప్రాంతం తమ పరిధిలోకి రాదంటే.. తమ పరిధిలోకి రాదంటూ.. పోలీస్‌స్టేషన్ల మధ్య వివాదం ఏర్పడేది. ఈ పరిస్థితి రాకుండా హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి క్రైం మ్యాపింగ్ అప్లికేషన్‌ను తయారు చేయించారు. జీపీఎస్‌తో పోలీస్‌స్టేషన్ పరిధిని నిర్ధారించారు. ఆ స్టేషన్ పరిధికి అనుగుణంగా సెక్టార్లుగా విభజించారు. పెట్రోలింగ్ మొబైల్స్‌కు జీపీఎస్ లింక్‌ను ఏర్పాటు చేసి.. దానిని క్రైమ్ మ్యాపింగ్ అప్లికేషన్‌కు అనుసంధానించారు. దీంతోపాటు వాహనాలకు కూడా జీపీఎస్ ఏర్పాటు చేసి ప్రధాన కంట్రోల్ రూంతో అనుసంధానించారు. దీనిద్వారా సిబ్బంది సెక్టార్ వారీగా విధులు నిర్వహిస్తున్నారా లేదా అన్నది తెలుస్తుంది.



మంగళవారం సచివాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

ప్రాధాన్యక్రమంలో ప్రాజెక్టుల భూసేకరణ

- కలెక్టర్లు, ఇంజినీర్లకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జోషి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యక్రమంలో చేపట్టాలని జిల్లాకలెక్టర్లు, నీటిపారుదలశాఖ ఇంజినీర్లను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సాగునీటి ప్రాజెక్టుల కోసం జరిగిన భూసేకరణ, నిధుల వినియోగంపై మంగళవారం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ప్రాజెక్టుల పూర్తికి అవరోధంగా ఉన్న భూసేకరణ సమస్యలను గుర్తించి వాటిని ముందుగా పరిష్కరించాలన్నారు. ప్రాజెక్టు ఆయకట్టును గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. ప్రాజెక్టులు, జిల్లాలు, మండలాలు, గ్రామాలు, సర్వేనంబర్ల వారీగా భూసేకరణ ప్రగతి, నిధుల వినియోగంపై బుధవారం కల్లా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. వచ్చే మార్చి 31లోగా ప్రాజెక్టుల భూసేకరణకు అవసరమయ్యే నిధుల వివరాలను కూడా ఇప్పుడే సమర్పించాలన్నారు. నిధుల ఖర్చు విషయంలో ప్రాధాన్యాలను ముందుగానే గుర్తించాలని, కొత్త జిల్లాలకు బదిలీ చేసిన నిధుల వివరాలు కూడా పంపాలని సూచించారు. భూసేకరణకు పత్రికల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అయితే ఇందుకు ఎక్కువ మొత్తంలో ఖర్చు పెట్టరాదని ఆదేశించారు. నీటిపారుదలశాఖ కార్యదర్శి వికాస్‌రాజ్, ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, చీఫ్ ఇంజినీర్లు భగవంతరావు, హరిరాం, శ్యాంసుందర్, సురేశ్, ఖగేందర్‌రావు, లింగరాజు, శంకర్, సునీల్, మధుసూదన్‌రావు, ఎస్‌ఈ రమేశ్, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే తదితరులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

గవర్నర్‌తో బీజేపీ నేతల సమావేశం

- గల్ఫ్ బాధితుల సంక్షేమానికి వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వలసవెళ్లిన వారి సంక్షేమానికి చర్యలు తీసుకునేలా కృషిచేయాలని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాజ్‌భవన్‌లో బీజేపీ నేతలు గవర్నర్‌తో సమావేశమై వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నారై పాలసీని త్వరగా తీసుకురావాలని కోరారు.


టేకులపల్లి ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

- గవర్నర్‌కు వామపక్షాల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మేడ వాగు గ్రామంలో డిసెంబర్ 14న జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వామపక్షాలు రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌కు విజ్ఞప్తిచేశాయి. ఎనిమిది వామపక్ష పార్టీల నాయకులు మంగళవారం రాజ్‌భవన్‌లో నరసింహన్‌ను కలిశారు. టేకులపల్లి ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నందున సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని వినతిపత్రం అందజేశారు. గవర్నర్‌ను కలిసినవారిలో పోటు రంగారావు (సీపీఐ ఎంఎల్ -న్యూడెమోక్రసీ), చాడ వెంకటరెడ్డి (సీపీఐ), డీజీ నర్సింహారావు (సీపీఎం), కే గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్), సీహెచ్ మురళి (ఎస్‌యూసీఐ), తాండ్ర కుమార్ (సీపీఐఎం -యూ), బీ సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్), ఆర్ గోవింద్ (ఆరెస్పీ) ఉన్నారు.

తమిళనాట రాజకీయ విప్లవం రావాలి


- మీడియా ప్రతినిధులతో రజినీకాంత్
- తొలినాళ్లలో మీడియాలో పని చేశానన్న తలైవర్
- ఆధ్యాత్మికత అంటే కుల, మత, విశ్వాసాలకతీతం అని వ్యాఖ్య



చెన్నై, జనవరి 2: తమిళనాడులో నెలకొన్న పరిస్థితుల్లో రాజకీయ విప్లవం రావాల్సిన అవసరం ఉన్నదని సినీ నటుడు రజనీకాంత్ పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం రాజకీయ పార్టీ ఏర్పాటుచేస్తానని ప్రకటించిన రజనీ.. మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత వ్యవస్థలోని తప్పిదాలను సరి చేసేందుకు తాను స్థాపించే రాజకీయ పార్టీ సహాయకారిగా ఉంటుందన్నారు. 'జాతీయోద్యమం నుంచి ఇప్పటి వరకు తమిళనాడు పలు పోరాటాల్లో ముందు వరుసలో నిలిచింది. మరోసారి మనం అదే పరిస్థితిలో ఉన్నాం. రాజకీయ విప్లవం రావాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. కొద్ది రోజులుగా సరైన దిశలో తన ప్రయాణం సాగుతున్నదన్న సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పినందుకు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. తాను సినీ రంగంలో అడుగు పెట్టక ముందు కేవలం ఒక బస్ కండక్టర్‌గా పనిచేశానని అందరికీ తెలుసుగానీ, కొంతకాలం మీడియాలో కూడా పని చేశానని రజినీ చెప్పారు. పాఠశాల విద్యాభ్యాసం పూర్తయ్యాక కొన్ని నెలల పాటు ఒక మీడియా సంస్థలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేశానని తెలిపారు. తాను మీడియాను వాడుకోలేదని రజినీ వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మిక రాజకీయాలంటే నిజాయితీతో కూడిన యదార్థమైన రాజకీయాలన్నారు. కుల, మత, విశ్వాసాలకు అతీతంగా పని చేయడమేనన్నారు.

ప్రముఖ ఉర్దూ కవి అన్వర్ జలాల్‌పురి కన్నుమూత

- భగవద్గీతను ఉర్దూలోకి అనువదించిన కవి



లక్నో, డిసెంబర్ 2: సంస్కృత భగవద్గీతను ఉర్దూలోకి అనువాదం చేసిన ప్రముఖ ఉర్దూ కవి అన్వర్ జలాల్‌పురి (71) కన్నుమూశారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న ఆయన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ దవాఖానలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. యూపీ అంబేద్కర్‌నగర్ జిల్లాలోని అన్వర్ స్వగ్రామమైన జలాల్‌పూర్‌లో బుధవారం అంత్యక్రియలు జరుగనున్నాయి. జలాల్‌పురికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. మత సామరస్యాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో సంస్కృత భగవద్గీతలోని 700లకుపైగా శ్లోకాలను ఉర్దూలోకి అనువాదం చేశారు. 'అక్బర్ ది గ్రేట్' టీవీ సీరియల్‌కు మాటలు రాశారు.

జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారుగా రాజిందర్ ఖన్నా నియామకం

న్యూఢిల్లీ, జనవరి 2: భారత్ గూఢచార సంస్థ 'రా' మాజీ అధిపతి రాజిందర్ ఖన్నాను జాతీయ భద్రత డిప్యూటీ సలహాదారుగా (డిప్యూటీ ఎన్‌ఎస్‌ఏ) నియమిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది ఆగస్టు నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉన్నది. 1978 బ్యాచ్‌కు చెందిన రా అధికారిగా పలు ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లను రాజిందర్ పర్యవేక్షించారు. ఖన్నాను డిప్యూటీ ఎన్‌ఎస్‌ఏగా నియమిస్తూ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకున్నది.

మధ్యాహ్న భోజనంలో పాల పంపిణీ

- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ: మధ్యాహ్న భోజనం వంటి పథకాల్లో పాలు పంపిణీ చేసి, వాటి వినియోగాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. పాల సహకార సంస్థలు రైతులనుంచి పాల సేకరణను పెంచుకోవాలని తెలిపింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. పాల పంపిణీని ప్రజా పంపిణీ వ్యవస్థ కింద చేపట్టాలని ఆహార మంత్రిత్వశాఖ విజ్ఞప్తి చేసిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

రెవెన్యూ టార్గెట్ల దిశగా రవాణాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ టార్గెట్లను పూర్తిచేసే దిశగా రవాణాశాఖ ముందుకు సాగుతున్నదని ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధానకార్యాలయంలో శాఖాపరమైన ప్రగతి, ఉద్యోగుల పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. 2016-17లో నవంబర్ వరకు రూ.1767.97 కోట్లను రాబట్టి 10.65 శాతం వృద్ధిరేటును సాధిస్తే.. 2017-18 నవంబర్ వరకు 2136,61 కోట్లను రాబట్టి 24.54 శాతం వృద్ధిరేటును సాధించగలిగామన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ జేటీసీలు రమేశ్, పాండురంగనాయక్, ఖైరతాబాద్ డీటీవో రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పీ మధుసూదన్‌రెడ్డి వరుసగా నాలుగోసారి ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాబురావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధుసూదన్‌రెడ్డి మూడేండ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. బాబురావు ఈ పదవికి ఎన్నికవడం ఇది రెండోసారి. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని మధుసూదన్‌రెడ్డి చెప్పారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
బుధవారం 3 జనవరి 2018

బౌన్స్‌తో ప్రమాదమే

అనవసరపు షాట్లు వద్దు.. భారత టాప్ బ్యాట్స్‌మన్ పుజార వ్యాఖ్య

కఠినమైన వాతావరణ పరిస్థితులు.. నాణ్యమైన పేసర్లు.. బౌన్సీ పిచ్‌లు.. సొంతగడ్డ అనుకూలత.. గతంలో ఎన్నడూ గెలువలేదన్న ఒత్తిడి... ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా పర్యటనలో రాణించాలంటే ఏం చేయాలి..? గతంలో ఇక్కడ పర్యటించిన రెండుసార్లు పరుగుల వరద పారించిన పుజార.. ఇప్పుడు ఎలా సన్నద్ధమవుతున్నాడు..? టీమ్ఇండియా విజయవంతం కావాలంటే అతను ఇచ్చే సూచనలు ఏంటీ..? ఓవరాల్‌గా మరో రెండు రోజుల్లో మొదలయ్యే తొలి టెస్టు కోసం విరాట్ సేన ప్రాక్టీస్ ఎలా సాగుతుందో చూద్దాం..!



పుజార



కేప్‌టౌన్:

బౌన్సీ పిచ్‌లపై రాణించాలంటే ఎంత వీలైతే అంతగా బంతిని వదిలేయాలని భారత టాప్ బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజార అన్నాడు. సఫారీ పర్యటనలో ఇది చాలా ప్రధానమైందన్నాడు. అనవసరపు షాట్లకు పోకుండా బంతి గమనాన్ని అంచనా వేస్తూ ఆడటానికి వీల్లేకపోతే వదిలి వేయడమే మంచిదన్నాడు. 'ఆసియాను దాటి బయటకు వెళ్లామంటే.. కచ్చితంగా బౌన్స్ ఎదురవుతుంది. అందుకే విదేశాల్లో బంతిని ఎంత బాగా వదిలేస్తే అంత మంచిది. ఇక్కడ బాగా ఆడాలంటే సాంకేతికంగా, మానసికంగా కాస్త సర్దుబాటు చేసుకోవాలి. వ్యక్తిగతంగా నేను రెండుసార్లు ఇక్కడ పర్యటించా. నా గేమ్, పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది' అని మంగళవారం ప్రాక్టీస్ అనంతరం పుజార పేర్కొన్నాడు. లంకతో టెస్టు సిరీస్ జరుగుతున్నప్పుడే సఫారీ టూర్ సన్నాహకాలు మొదలుపెట్టామన్నాడు. అప్పుడే కొన్ని అంశాలకు సంబంధించిన కసరత్తులు చేశామన్నాడు. కోల్‌కతా, ధర్మశాలలో లంక బౌలింగ్‌ను ఎదుర్కొవడానికి భారత బ్యాట్స్‌మెన్ ఇబ్బందిపడ్డా.. ఇక్కడ అలాంటి పరిస్థితి ఉండబోదన్నాడు. ఇక్కడ కేవలం బౌన్స్ మాత్రమే ఉంటుందని చెప్పాడు.



అనుభవం ముఖ్యం..

గతంలో ఆడిన చాలా మంది ప్రస్తుత జట్టులో ఉండటం లాభించే అంశమని పుజార అన్నాడు. 'ఈ పర్యటన కోసం మేం అన్నిరకాలుగా సన్నద్ధమయ్యాం. మా ప్రణాళికలను సమర్థంగా అమలు చేస్తే సరిపోతుంది. ఇక్కడ ఆడిన అనుభవం కూడా మా జట్టులో చాలా మందికి ఉంది. మేం మూడు నెట్ సెషన్లలో పాల్గొన్నాం. రోజుకు రెండుసార్లు ప్రాక్టీస్ చేస్తున్నాం. విజయవకాశాలపై మాకు నమ్మకం ఉంది' అని పుజార వ్యాఖ్యానించాడు. గతంతో పోలిస్తే ఈసారి తమ పేస్ అటాక్ చాలా బలంగా ఉందన్నాడు.

ప్రాక్టీస్ ముమ్మరం..

తొలి టెస్టుకు సమయం దగ్గరపడుతుండటంతో టీమ్ఇండియా ప్రాక్టీస్‌ను మరింత ముమ్మరం చేసింది. బ్యాట్స్‌మన్ కచ్చితమైన ప్రణాళికతో నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నారు. నిర్దేశించిన ప్రాంతంలోనే బంతులు వేసే విధంగా బౌలర్లకు సూచనలిస్తున్నారు. ముందుగా విజయ్, రాహుల్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా, మిగతా వారు వాళ్లను అనుసరించారు. కోచ్ రవిశాస్త్రి, ఇతర సహాయక సిబ్బంది ఫీల్డింగ్, క్యాచ్ ప్రాక్టీస్‌లను పర్యవేక్షించారు.

స్టెయిన్ అనుమానమే..!



దక్షిణాఫ్రికా పేసర్ డేల్ స్టెయిన్ తొలి టెస్టులో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. స్టెయిన్ ఫిట్‌నెస్ సాధించినా.. అందుబాటులో ఉండే అవకాశాలు చాలా స్వల్పమని సఫారీ కోచ్ ఒటిస్ గిబ్సన్ తెలిపారు. 'గాయంతో దాదాపు ఏడాది పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. కాబట్టి ముగ్గురు పేసర్లలో అతన్ని తీసుకుంటారో లేదో చూడాలి. ఒకవేళ తీసుకున్నా.. మధ్యలో సమస్య వస్తే జట్టు విజయంపై ప్రభావం పడుతుంది' అని గిబ్సన్ పేర్కొన్నాడు.

అవధ్ వారియర్స్ హ్యాట్రిక్

లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్(పీబీఎల్)లో లక్నో అవధ్ వారియర్స్ విజయ పరంపర కొనసాగుతూనే ఉన్నది. మంగళవారం సొంతగడ్డపై అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో 4-3తో ఉత్కంఠ విజయం సాధించింది. మొదట జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో లక్నో జోడీ మన్, పెడర్సన్ 2-1తో హిమ్, జుల్వ్ ద్వయంపై గెలిచిది. పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో కశ్యప్ 2-1తో సౌరభ్ వర్మపై, మరో సింగిల్స్‌లో అహ్మదాబాద్ ఆటగాడు ప్రణయ్ 2-0తో శ్రీకాంత్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్ ట్రంప్ గేమ్‌లో నెహ్వాల్ 0-2తో యింగ్ చేతిలో ఓడింది. నిర్ణయాత్మక పురుషుల డబుల్స్‌లో లక్నో జంట మన్, సెతివన్ 2-0తో రెజినాల్డ్, నందగోపాల్ జోడీపై గెలిచింది.

















అసోంపై తెలంగాణ విజయం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గచ్చిబౌలీ స్టేడియంలో జరుగుతున్న 65వ జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ మహిళల జట్టు గెలుపు బాట పట్టింది. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌పై ఓటములు చవిచూసిన తెలంగాణ..అసోంపై బోణీ కొట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మన రాష్ట్ర జట్టు 44-40 తేడాతో అసోంపై ఉత్కంఠ విజయం సాధించింది. మహేశ్వరి, అఖిల, నౌశిన్ తెలంగాణ తరపున అద్భుతంగా రాణించారు.

యుకీ ముందంజ

పుణె: మహారాష్ట్ర ఓపెన్‌లో మంగళవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తన తొలి రౌండ్లో యుకీ భాంబ్రీ 6-3, 6-4తో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఆటగాడు అర్జున్ ఖడేపై అలవోక విజయం సాధించాడు. తరువాతి రౌండ్లో పియరీ హ్యూజెస్ (ఫ్రాన్స్)తో యుకీ తలపడనున్నాడు. మరోవైపు యువ ఆటగాడు సుమిత్‌నాగల్ వరుసగా ఏడు విజయాల పరంపరకు బ్రేక్ పడింది. తన మొదటి రౌండ్‌లో నాగల్ 3-6, 3-6తో క్వాలిఫయర్ ఇవాష్క చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

'బ్రిస్బేన్'కు ముర్రే దూరం..

బ్రిస్బేన్: బ్రిటన్ టెన్నిస్ స్టార్ ప్లేయర్ ఆండీ ముర్రే.. సీజన్ తొలి టోర్నీ బ్రిస్బేన్ ఇంటర్నేషనల్‌కు దూరమయ్యాడు. దీంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ సన్నాహకాలపై తీవ్ర ప్రభావం పడనుంది. గతేడాది వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో క్వెరీ చేతిలో ఓడిన ముర్రే.. అప్పట్నించి ఆటకు దూరంగా ఉన్నాడు.

విద్య, ఉద్యోగ సమాచారం

'ఆర్మీ ఆర్డినెన్స్'లో 818 పోస్టులు

ఆర్మీ ఆర్డినెన్స్ క్రాప్స్ (ఏవోసీ) సదరన్ కమాండ్ (పుణె)లోని ఏవోసీ యూనిట్/డిపోల్లో ఖాళీగా ఉన్న లోయర్ డివిజన్ క్లర్క్, ట్రేడ్స్‌మ్యాన్‌మేట్ తదితర గ్రూప్ సీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, పదోతరగతి అభ్యర్థులకు అవకాశం
- కేంద్ర రక్షణశాఖలో కొలువులు
- మంచి జీతభత్యాలు, ప్రత్యేక అలవెన్స్‌లు

వివరాలు:

హెడ్‌క్వార్టర్ సదరన్ కమాండ్ (ఆర్డినెన్స్)లో ఈ ఖాళీలు ఉన్నాయి.

- **పోస్టు పేరు:** మెటీరియల్ అసిస్టెంట్ (సూపరింటెండెంట్ స్టోర్)
- మొత్తం ఖాళీల సంఖ్య - 11 (జనరల్-5, ఓబీసీ-3, ఎస్సీ-1, ఎస్టీ-2)
- **అర్హత :** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ/ మెటీరియల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా లేదా ఏదైనా బ్రాంచిలో డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- ఫైర్‌మ్యాన్-61 ఖాళీలు (జనరల్-34, ఓబీసీ-16, ఎస్సీ-7, ఎస్టీ-4)
- **అర్హత:** మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు కనీసం 165 సెం.మీ. ఎత్తు, ఛాతీ - 81.5 సెం.మీ. ఉండాలి (గాలి పీల్చినపుడు 85 సెం.మీ వ్యాకోచం చెందాలి), బరువు కనీసం 50 కేజీలు ఉండాలి. ఆరు నిమిషాల్లో 1.6 కి.మీ. పరుగెత్తాలి.
- **పోస్టు పేరు:** లోయర్ డివిజన్ క్లర్క్
- మొత్తం ఖాళీల సంఖ్య - 110 (జనరల్-65, ఓబీసీ-25, ఎస్సీ-9, ఎస్టీ-11)
- **పేస్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 1,900/-
- **అర్హతలు:** ఇంటర్ లేదా తత్సమానకోర్సు ఉత్తీర్ణత. ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి 35 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి. అంటే గంటకు కనీసం 10500/9000 కీ డిప్రెషన్స్ చేసే సామర్థ్యం ఉండాలి.
- **వయస్సు:** 18- 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పోస్టు పేరు:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్
- మొత్తం ఖాళీల సంఖ్య - 561 (జనరల్-304, ఓబీసీ-176, ఎస్సీ-42, ఎస్టీ-39)
- **పేస్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 1,800/-
- **అర్హతలు:** గుర్తింపు పొందిన సంస్థ / బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదోతరగతి ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 - 25 ఏండ్ల మధ్య ఉండాలి
- గ్రేడ్ 2 స్టెనో-2, కుక్-5, సఫాయివాలా-26, మెసెంజర్-14, వాషర్‌మ్యాన్-2, గార్డెనర్-1, ఫిమేల్ సర్చర్-4, ఆర్మరర్-2, టెలి ఆపరేటర్-2, సీఎండీ (ఓజీ)-2, సడ్లర్-1, ఫిట్టర్ (ఎంవీ)-1, వెండర్-3, బార్బర్-1, టిన్ అండ్ కాపర్ స్మిత్-1, వెహికిల్ మెకానిక్-1, టైలర్-1, కార్పెంటర్-3, ఎలక్ట్రీషియన్-2 పోస్టులు ఉన్నాయి.
- **పేస్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 1,800/- లేదా రూ. 1,900/- (పోస్టులను బట్టి ఉంటుంది)
- **పనిచేయాల్సిన ప్రదేశం:** హెడ్‌క్వార్టర్ సదరన్ కమాండ్ పరిధిలో
- **ఎంపిక:** ఆబ్జెక్టివ్ రాతపరీక్ష ద్వారా



- ట్రేడ్స్‌మెన్/ఫైర్‌మెన్ అభ్యర్థులకు రాతపరీక్షతో పాటు ఫిజికల్‌టెస్ట్ ఉంటుంది. కొన్ని పోస్టులకు స్కిల్ టెస్ట్ ఉంటుంది.
- ఆబ్జెక్టివ్ రాత పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. దీనికి కేటాయించిన సమయం రెండు గంటలు
- ఆబ్జెక్టివ్ రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్-25 మార్కులు, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ -25 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ & జనరల్ అవేర్‌నెస్-50 మార్కులు, సంబంధిత సబ్జెక్టు-50 మార్కులు వస్తాయి.
- రాత పరీక్ష ఇంగ్లిష్/హిందీ భాషల్లో ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** లేదు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన 21 రోజుల్లో పంపాలి.
- **వెబ్‌సైట్:** www.aocrecruitment.gov.in

ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ లిమిటెడ్) ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు:** ప్రొబేషనరీ ఆఫీసర్-32 ఖాళీలు
- **విభాగాల వారీగా..** అకౌంట్స్ - 5, లీగల్ - 5, కంపెనీ సెక్రటరీ - 1, ఆక్చువరి - 2, ఐటీ - 2, ఎకనామిక్స్ - 2, కామర్స్ - 3, జనరలిస్ట్ - 12 ఖాళీలు ఉన్నాయి.
- **పే స్కేల్:** రూ. 32,795 - 62,315/-
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. సీఏ, ఏసీఎస్, సీఎఫ్ఏలో సభ్యత్వం ఉండాలి లేదా ఎంబీఏ (ఫైనాన్స్) లేదా పీజీ ఎకనామిక్స్/ఇంటర్నేషనల్ ట్రేడ్ లేదా మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018, జనవరి 1 నాటికి 20 -30 మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామ్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.ecgc.in

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఖాళీగా ఉన్న మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.


- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ



- ఖాళీల సంఖ్య - 10
- **పేస్కేల్:** రూ. 50,000 - 1,60,000/-
- **అర్హతలు:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి సీఏ
- **వయస్సు:** 1989, డిసెంబర్ 31 నుంచి 1999, డిసెంబర్ 30 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామ్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 22
- **వెబ్‌సైట్:** www.concorindia.com

రిషికేశ్ ఎయిమ్స్‌లో 153 ఉద్యోగాలు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిషికేష్) ఖాళీగా గ్రేడ్ 1 స్టాఫ్ నర్స్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఎయిమ్స్ రిషికేష్ దేశంలోని ఏడు అత్యున్నత ఆరోగ్య ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటి. దీన్ని 2012 సెప్టెంబర్ 20న స్థాపించారు.

- మొత్తం పోస్టుల సంఖ్య- 153

విభాగాల వారీగా ఖాళీలు:

- **అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్**
- మొత్తం పోస్టుల సంఖ్య-28 (జనరల్-15, ఓబీసీ-7, ఎస్సీ-4, ఎస్టీ-2)
- **పే స్కేల్:** రూ. 15,600-39,100+ గ్రేడ్ పే రూ. 5,400/-
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్టు సర్టిఫికెట్)/ బీఎస్సీ నర్సింగ్ (పోస్టు బేసిక్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో ఆరేండ్ల అనుభవం ఉండాలి.
- స్టాఫ్ నర్స్ (గ్రేడ్1) మొత్తం పోస్టుల సంఖ్య: 125 పోస్టులు (జనరల్-65, ఓబీసీ-33, ఎస్సీ-18, ఎస్టీ-9)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్టు సర్టిఫికెట్)/ బీఎస్సీ నర్సింగ్ (పోస్టు బేసిక్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో మూడేండ్ల అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 9,300-34,800+ గ్రేడ్ పే రూ. 4,800/-
- **వయస్సు:** 21 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2018 జనవరి 4
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

హైదరాబాద్‌లోని ఎంఎస్‌ఎంఈ-టూల్ రూమ్ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎంఎస్‌ఎంఈ-టూల్ రూమ్ అనేది మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్ కింద పనిచేస్తున్న సంస్థ.



- **కోర్సుపేరు:** ఈఎస్‌డీఎం
- అడ్వాన్స్‌డ్ ఎంబెడెడ్ టెక్నాలజీ, ఫిజికల్ డిజైన్ ఇంజినీర్, వీఎల్ఎస్ఐ డిజైన్ ఇంజినీర్, ఎఫ్‌పీజీఏ డిజైన్ ఇంజినీర్, సర్టిఫికెట్ కోర్సు (వెరిలాగ్ డిజైన్, మైక్రోకంట్రోలర్ ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ ఆపరేషన్ సిస్టమ్), ఎంబెడెడ్ సిస్టమ్ డిజైన్ (మైక్రో కంట్రోలర్)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి డిప్లొమా లేదా బీఈ/బీటెక్, బీఎస్సీ/ఎమ్మెస్సీలో ఉత్తీర్ణత.
- **కోర్సు వ్యవధి:** రెండు నుంచి ఆరు నెలల వరకు ఉంటుంది. (కోర్సులను బట్టి వేర్వేరు వ్యవధుల్లో శిక్షణ ఇస్తారు)
- **కోర్సుపేరు: ఆటోమేషన్**
- మాస్టర్ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ మెకట్రానిక్స్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి డిప్లొమా లేదా బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత.
- **కోర్సు వ్యవధి:** ఆరు నెలలు.
- **కోర్సుపేరు:** క్యాడ్/క్యామ్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్స్ (సీఎన్‌సీ మెషినింగ్), మాస్టర్ సర్టిఫికెట్ కోర్స్ (కంప్యూటర్ ఎయిడెడ్ టూల్ ఇంజినీరింగ్, క్యాడ్/క్యామ్), సర్టిఫికెట్ కోర్స్ (సీఎన్‌సీ టర్నింగ్, సీఎన్‌సీ మిల్లింగ్).
- **కోర్సు వ్యవధి:** ఆరు నుంచి పన్నెండు నెలల వరకు శిక్షణ ఇస్తారు. (కోర్సులను బట్టి వేర్వేరు వ్యవధుల్లో శిక్షణ ఉంటుంది)
- **అర్హత:** పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా లేదా బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత.
- **కోర్సులు ప్రారంభం:** ప్రతి నెల మొదటి, మూడో బుధవారాల్లో.
- శిక్షణకోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ కల్పిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1000/-
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. కోర్సు ఫీజు, తదితర పూర్తి వివరాలకు సంస్థ వెబ్‌సైట్ చూడవచ్చు.

చిరునామా: Central Institute of Tool Design Bala Nagar 'X' Road, Hyderabad -500 037.

- **వెబ్‌సైట్:** http://www.citdindia.org

సీసీఎంబీలో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీసీఎంబీ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న అనుబంధ సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య: 15

విభాగాలవారీగా ఖాళీలు:

- కన్సల్టెంట్-2, సైంటిఫిక్ అటెండెంట్-5, క్లినికల్ కౌన్సెలర్-2, జెనెటిక్ కౌన్సెలర్-2, సోషల్ వర్కర్-2, డేటా ఎంట్రీ ఆపరేటర్-2
- సీనియర్ సైంటిస్ట్-5 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి ఇంటర్, డీఎంఎల్‌టీ, బీఎస్సీ, బీసీఏ, పీజీడీసీఏ, ఎమ్మెస్సీ, బీటెక్, ఎంబీబీఎస్, ఎండీలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** గరిష్ఠంగా 40 ఏండ్లకు మించరాదు (పోస్టులను బట్టి వయోపరిమితిలు వేర్వేరుగా ఉన్నాయి)
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నింపేటప్పుడు నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 16
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in